అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 8-8-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 219 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు వెల : 6.50



మణిపూర్ ఘటనపై మహిళా కమిటీ

ముగ్గురు మాజీ జడ్జిల నియామకం : సుప్రీంకోర్టు

వివరాలు 13లో..



రాహుల్ ఈజ్ బ్యాక్

- లోక్‌సభలో అనర్హత వేటు ఎత్తివేత
- నాలుగు నెలల తరువాత పార్లమెంట్‌కు...
- ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ ఎంపీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తిరిగి వయనాడ్ ఎంపీగా కొనసాగనున్నారు. ఎంపీగా ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని లోక్‌సభ సచివాలయం పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. 'మోడీ ఇంటిపేరు' కేసులో గుజరాత్ కోర్టు ఇచ్చిన రెండేండ్ల ...13లో

ప్రజాస్వామ్య విజయం

- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించడం ప్రజాస్వామిక విజయమని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల ...13లో

గ్రామసభల ద్వారానే దళితబంధుకు ఎంపిక

రాజకీయాలకతీతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితబంధు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో పైరవీలు, కమీషన్లకు తావిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. దీంతో అసలైన లబ్దిదారుల ఎంపిక జరగడం లేదని తెలిపింది. ఎమ్మెల్యేల ఒత్తిడి, రాజకీయ కారణాలతో అనర్హులను లబ్దిదారులుగా ఎంపిక చేయడంతో నిజమైన అర్హులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొంది. ఈ పథకంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా, లబ్దిదారుల ఎంపికకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించాలనీ, రాజకీయాలకతీతంగా గ్రామసభల ద్వారా వాస్తవ లబ్దిదారులను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితబంధు రెండో విడతకు ప్రతి నియోజకవర్గం నుంచి 1,100 మందిని ఎంపికచేసి, ఒకొక్కరికి రూ.10 లక్షల ...13లో



ఢిల్లీ బిల్లుకు ఆమోదం

రాజ్యసభలో అనుకూలం 131, వ్యతిరేకం 102

- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- మొరాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్
- చిట్టీలతో ఓటింగ్ ప్రక్రియ

నవతెలంగాణన్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో ఢిల్లీ పౌరుసేవల బిల్లు ఆమోదం పొందింది. బిల్లుపై ఓటింగ్ జరగగా, బిల్లుకు అనుకూలంగా 131, వ్యతిరేకంగా 102 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లు ఆమోదం పొందినట్లు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ వెల్లడించారు. ఢిల్లీ సీనియర్ ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీలకు సంబంధించిన అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు అప్పగించే ఆర్డినెన్స్ స్థానంలో ఢిల్లీ సర్వీసుల బిల్లును కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ జరిగింది. ఢిల్లీ సర్వీసుల బిల్లును ఏం చేసైనా సరే సాధించాలని బీజేపీ అనుకుంటోందని, ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని, ప్రజావ్యతిరేకమని కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వి అన్నారు. ఏ విధంగానైనా బిల్లుకు ఆమోదం పొందడం ద్వారా ఢిల్లీ సర్వీసుల అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని బీజేపీ అనుకుంటోందని విమర్శించారు. ఇది రాష్ట్రాలు మరియు ఢిల్లీ ప్రజల ఆకాంక్షలపై నేరుగా జరుపుతున్న దాడిగా ఆయన పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, సివిల్ సర్వీస్ అకౌంటబిలిటీ, అసెంబ్లీ ఆధారిత ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేత పి. చిదంబరం మాట్లాడుతూ రాజ్యాంగ అంశాలు పక్కనపెడితే, ఈ బిల్లులో



కమిటీ విషయాన్ని తెలుపుతానని అన్నారు. కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారని, అందులో ముఖ్యమంత్రి, మరో ఇద్దరు కేంద్ర ప్రభుత్వం చేత నియమితులైన వారు ఉంటారని తెలిపారు. మెజార్టీ ఇద్దరు కేంద్రం నియమించినవారే కాబట్టీ వారి అభిప్రాయాలే నెగ్గుతాయని, ముఖ్యమంత్రి మాట చెల్లదని అన్నారు. అలాగే కమిటీ కోరం ఇద్దరని బిల్లులో పేర్కొన్నారని, అలాంటప్పుడు ముఖ్యమంత్రి లేకుండానైనా కమిటీ సమావేశం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఈ కమిటీ ప్రతిపాదనలు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదిస్తారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు.

25 ఏండ్ల వరుస ఓటములే కారణం: చద్దా

ఢిల్లీలో జరిగిన గత ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దారుణమైన ఓటమి చవిచూసిందని, ఆ కారణంగానే బీజేపీ ఈ బిల్లు తీసుకువచ్చిందని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా ధ్వజమెత్తారు. 25 ఏండ్లుగా బీజేపీ గెలుపునకు దూరమైందని, కేజ్రీవాల్ ప్రభుత్వం కారణంగా మరో 25 ఏండ్లు తాము గెలువలేమనే విషయం బీజేపీకి బాగా తెలుసునని అన్నారు. ఆ కారణంగానే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ధ్వంసం చేయాలని బీజేపీ కోరుకుంటోందన్నారు. ఢిల్లీ సర్వీసుల బిల్లు ఒక 'పొలిటికల్ ఫ్రాడ్' అని, రాజ్యాంగ పాపమని, ఢిల్లీలో ప్రభుత్వ యంత్రాగాన్ని స్తంభింప చేయడానికి ఉద్దేశించినదని విమర్శలు గుప్పించారు. సమష్టి బాధ్యతను గుర్తుచేసే పార్లమెంటరీ సిద్ధాంతాలను బలహీనపరచడమే ఈ బిల్లు ఉద్దేశమని అన్నారు. కేంద్రం రాజ్యాంగ నేరానికి పాల్పడుతోందని విమర్శించారు. ఇప్పుడు ఆఫీసర్లు ఎవరూ ముఖ్యమంత్రి, మంత్రుల మాట వినే పరిస్థితి ఉండదన్నారు. ఈ చర్య ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలని తోసిరాజనడమేనని అన్నారు.

ఈ బిల్లుపై బికాష్ రంజన్ భట్టాచార్య (సీపీఐ(ఎం), పి. సంతోష్ కుమార్ (సీపీఐ), కె.కేశవరావు (బీఆర్ఎస్), వి.విజయసాయి రెడ్డి (వైసీపీ), పి.చిదంబరం (కాంగ్రెస్), తిరుచ్చి శివ (డీఎంకే), మనోజ్ కుమార్ ఝా, ...7లో



తరలివచ్చిన కళాలోకం

కళారవికి కన్నీటి వీడ్కోలు

- జోహార్ గద్దరన్న.. లాల్‌సలాం కామ్రేడ్ నినాదాలతో దద్దరిల్లిన నగరం
- జనసంద్రంతో నిండిన ఎల్బీస్టేడియం, పరిసర ప్రాంతాలు
- రాజకీయ, సినీ ప్రముఖుల నివాళులు
- ట్యాంక్‌బండ్ మీదుగా గద్దర్ ఇంటికి చేరిన అంతిమయాత్ర
- సీఎం కేసీఆర్ నివాళి.. కుటుంబీకులకు ఓదార్పు
- అల్వాల్ మహాబోధి పాఠశాలలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా గాయకుడు, ఉద్యమకారుడు గద్దర్‌కు జనం కన్నీటి వీడ్కోలు పలికారు. లాల్ సలాం కామ్రేడ్, జోహర్ గద్దరన్న వంటి నినాదాలతో ఎల్బీస్టేడియం పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వామపక్ష నాయకులు, కవులు, కళాకారులు, అభిమానులు నివాళులర్పించారు. అనంతరం మధ్యాహ్నం 12గంటల తర్వాత గద్దర్ అంతిమయాత్ర అశ్రునయనాల మధ్య ఆరంభమైంది. గన్‌పార్కు.. ట్యాంక్‌బండ్ మీదుగా అల్వాల్‌లో గద్దర్ ఇంటికి చేరింది. అక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్ గద్దర్ భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబీకులను ఓదార్చారు.

అల్వాల్‌లోని మహాబోధి పాఠశాల గ్రౌండ్‌లో అంత్యక్రియలు

అల్వాల్‌లోని మహాబోధి పాఠశాల గ్రౌండ్‌లో గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనం చేసి.. గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. గద్దర్ అంత్యక్రియలను ఆయన పెద్ద కుమారుడు సూర్యుడు ...14లో

నియంతృత్వానికి ప్రతిబింబం



- ప్రజలు ఎన్నుకున్న సీఎం తోలుబొమ్మగా మారుతారు
- ప్రజాస్వామ్యమంటే అధికార పంపిణీ, కేంద్రీకరణ కాదు
- చిల్లర రాజకీయాలు మాని, రాజ్యాంగాన్ని పరిరక్షించండి : సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య

వివరాలు 7లో..

దురుద్దేశంతోనే ...

- హోంమంత్రి సమాధానం ఆశ్చర్యకరంగా ఉంది
- ఇది రాజ్యాంగ విలువలకు మహాప్రమాదం
- ఈ బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం: బీఆర్ఎస్ నేత కె.కేశవరావు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దురుద్దేశంతోనే ఢిల్లీ బిల్లు తీసుకొచ్చారని బీఆర్ఎస్ రాజ్యసభ నేత కె.కేశవరావు విమర్శించారు. తాను సీబీఐ, ఈడీ వంటి క్రిమినల్ చట్టం గురించి మాట్లాడటం లేదని, రాజ్యాంగ చట్టం గురించి ...7లో



గద్దర్ అంత్యక్రియల్లో విషాదం

- గుండెపోటుతో సియాసత్ ఉర్దూ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి వివరాలు 14లో..
- భారీగా తరలివచ్చిన జనం
- అల్వాల్‌లో తోపులాట



కదం తొక్కిన పోలవరం నిర్వాసితులు

సీపీఐ('ఎం) ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో ధర్నా

- వివిధ ప్రజా సంఘాల సంఘీభావం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పునరావాసం కల్పించాలని, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోలవరం నిర్వాసితులు కదం తొక్కారు. తమ గోడును దేశ రాజధానిలో వినిపించారు. సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. తొలిత హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కేఎస్) భవన్ నుంచి సీపీఐ(ఎం) నేతలు, పోలవరం నిర్వాసితులు పాదయాత్ర చేసుకుంటూ కన్నాట్ ప్లేస్ మీదుగా జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. అక్కడ ప్లకార్డులు చేబూని మోడీ సర్కార్‌కు ...13లో

పోలవరం నిర్వాసితులది జాతీయ సమస్య

- పరిహారం, పునరావాసం కేంద్రం బాధ్యతే
- ప్రధాని మోడీ, సీఎం జగన్‌ది ఆత్మ సమర్పణ: సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

వివరాలు 13లో..

ఆగిన మరో జీపీ కార్మికుడి గుండె

కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ డిమాండ్

- మృతదేహంతో రోడ్డుపై బైటాయించి ధర్నా

నవతెలంగాణ-వీర్నపల్లి


జీవిత పోరాటంలో అలసిపోయిన మరో జీపీ కార్మికుని గుండె ఆగింది. గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన పసుల మల్లేశం(48) స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. తమ సమస్యల పరిష్కారం ...13లో



(ఫైల్)

వనమాకు ఊరట

హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ : కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ రెండో స్థానంలోని జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ వనమా దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. వనమా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పార్టీ మారినందున రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని జలగం వెంకట్రావు తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు కోరారు. దీనిపై హైకోర్టులో వాదనలు జరగలేదు కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. వనమా ...13లో

విద్వేష కలక



అధికారపక్షంలో అందరికీ అవే లక్షణాలు

- అకృత్యాలు కనిపించకుండా నల్ల కండ్లద్దాలు
- అదేమిటని ప్రశ్నిస్తే..ఎరుపెక్కుతున్న కండ్లు

దేశంలో కండ్ల కలక అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఎంత వేగంగా అంటే విద్వేషాలు, వదంతులు ఎంత వేగంగా వ్యాపిస్తాయో అంత వేగంగా అన్నమాట. దీని లక్షణాలు ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికే మీడియాలో విస్తృత కథనాలు వచ్చాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి. మతోన్మాద ధోరణులు కూడా అచ్చం అలాగే వ్యాపిస్తున్నాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ (ఒకప్పటి ట్విట్టర్) వంటి వేదికల ద్వారా గాలి కంటే వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. కండ్ల కలక వచ్చిన వారిలో ఎలాంటి లక్షణాలు కన్పిస్తాయో ప్రస్తుత రాజకీయ నాయకులలో కూడా అలాంటి లక్షణాలే కన్పిస్తున్నాయి.

న్యూఢిల్లీ: కండ్ల కలక వ్యాధి సోకిన వారిలో కన్పించే మొదటి లక్షణం ఏమంటే కండ్లు ఎర్రబడతాయి. ఇప్పుడు దేశంలో కూడా కొందరు నాయకుల కండ్లు ఎరుపెక్కుతున్నాయి. అందుకు కారణం మణిపూర్ హింస లేదా నూహ్ ఘర్షణలు లేదా ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఒకరు ముస్లింలుగా భావించి నలుగురు వ్యక్తులపై కాల్పులు జరిపి పొట్టన పెట్టుకున్న సంఘటన కావచ్చు. ఇక రెండో లక్షణం వ్యాధి వచ్చిన వారు కండ్లు తెరవలేరు. తెరిస్తే మంట. బహుశ ఇలాంటి వ్యాధి లక్షణాల వల్లనే కాబోలు..గత తొమ్మిది సంవత్సరాలుగా దేశంలో పెరిగిపోయిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి పరిణామాలను చూడలేక కొందరు నాయకులు కండ్లు మూసుకునే ఉంటున్నారు. అదేమి విచిత్రమో గాని వీరికి చైనాను చూస్తే కండ్లు ఎర్రబడుతున్నాయి. అవినీతిపరులు, ఆర్థిక నేరస్థులు, హంతకులు, లైంగికదాడులు చేస్తే ..వారిని చూసి కోపమూ రావటంలేదు.కండ్లూ ఎర్రబడడం లేదు.

ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న కమలనాథులు కూడా అచ్చం కండ్ల కలక వచ్చిన వారి మాదిరిగానే ప్రవర్తిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులను చూసినా, హక్కుల కార్యకర్తలను చూసినా, ప్రశ్నించే గొంతుకలను చూసినా వారి కండ్లు ఎర్రబడుతున్నాయి. మతోన్మాద ...7లో

త్వరలో 25 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు

- పరిశీలించిన టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీలోకి త్వరలో కొత్తగా 25 ఎలక్ట్రిక్ అద్దె బస్సులు రానున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 1,300 ఎలక్ట్రిక్ బస్సులను వాడకంలోకి తేవాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. పర్యావరణ హితంగా ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు ఈ బస్సులను అందుబాటులోకి తెస్తున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. సోమవారం హైదరాబాద్ బస్ భవన్ ప్రాంగణంలో ఎలక్ట్రిక్ ఏసీ బస్సు నమూనాను టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ పరిశీలించారు. బస్సులో ప్రయాణీకులకు కల్పిస్తోన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా బస్సులను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణకాంత్, సీఎంఈ రఘునాథ రావు, సీఈఐటీ రాజశేఖర్, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) వేణుగోపాల్‌రావు, మేనేజర్ ఆనంద్ బసోలి, అసిస్టెంట్ మేనేజర్ యతిష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు సజ్జనార్ నివాళి

ప్రజాగాయకుడు గద్దర్ మరణానికి టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ సంతాపం తెలిపారు. సోమవారం గద్దర్ పార్థివదేహం ఉంచిన హైదరాబాద్ ఎల్బీస్టేడియంకు వెళ్లి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నెల రోజుల క్రితం ఆయన తనను వ్యక్తిగతంగా కలిసినప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతతో పాటు బస్‌తో తనకున్న అనుబంధాన్ని వివరించారని చెప్పారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల కష్టాల గురించి ఒక పాటను రాసి, సంస్థకు అంకితం చేస్తానని చెప్పారని తెలిపారు. అంతలోనే గద్దర్ మరణ వార్త వినడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రజాస్వామ్యం ద్వారానే హక్కు లను సాధించుకోవడం సాధ్యమని గద్దర్ భావించారనీ, అందుకే తొలిసారి తన ఓటు హక్కును వినియోగించుకుని ఎందరికో ఆదర్శప్రాయుడయ్యారని అన్నారు.

కూల్చివేతలు ఆపండి

పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు



ఛండీగఢ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో కూల్చివేత కార్యక్రమాన్ని నిలిపివేయాల్సిందిగా పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు సోమవారం ఆదేశించింది. హైకోర్టు తీర్పును అనుసరించి బుల్డోజర్ చర్యను నిలిపివేయాలని డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత వారం విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్రను గురుగ్రామ్ అల్వార్ జాతీయ రహదారిపై కొందరు యువకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల్లో ఇద్దరు హోంగార్డులతో సహా ఆరుగురు మరణించిన సంగతి తెలిసిందే. నుహ్, గురుగ్రామ్, పల్వాలా, ఫరీదాబాద్‌లలో అధికారులు ఆంక్షలు విధించారు.నుహ్ కి 20 కిలోమీటర్ల దూరంలోని తావ్‌డూ పట్టణంలో అక్రమ వలసదారులు ఉంటు న్నారని, వీరే అల్లర్లకు కారణమంటూ అధికారులు ఆరోపిస్తున్నారు. గత శుక్ర వారం నుంచి 350కి పైగా గుడిసెలు, 50కి పైగా దుకాణాలు, వ్యాపార సముదాయాలను కూల్చివేసింది. ఇవన్నీ అక్రమ కట్టడాలని అధికారులు ఆరోపించారు. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన కోర్టు కూల్చివేతలను నిలిపి వేయాలని ఆదేశించింది. రాష్ట్రంలోని ముస్లింలు లక్ష్యంగా ఈ కూల్చివేత కార్య క్రమం చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇండ్లను ధ్వంసం చేసిన వారిలో చాలా మంది తమకు ముందస్తు నోటీసు ఇవ్వలేదని పేర్కొన్నారు.

ఆర్టీసీ చైర్మెన్‌ను కలిసిన కార్మిక సంఘాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయించడంలో కృషి చేసిన చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను పలు కార్మిక సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారంనాడాయన ఇంటికి వెళ్లి సంబురాలు నిర్వహించారు. టీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ కత్తుల యాదయ్య, సభ్యులు పీ రవీందర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. మెజార్టీ యూనియన్ల జేఏసీ చైర్మెన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ కే హన్మంతు, కో కన్వీనర్ పీ కమాల్‌రెడ్డి, టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి తదితరలు చైర్మెన్‌కు కలిసి అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలపై సీఎస్ సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం వీడియో కన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. వివిధ శాఖల కార్యదర్శులు కూడా హాజరయ్యారు.

హరితహారం, దశాబ్ది సంపద వనాలు, స్వతంత్ర భారత వజ్రోత్సవం సందర్భంగా కోటి మొక్కలు నాటడం, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళిత బంధు, భూమిపట్టాల పంపిణీ, కారుణ్య నియామకాలు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, వీఆర్ఏ ల క్రమబద్ధీ కరణ తదితర అంశాలపై ఆమె కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలో వివిధ జిల్లాలోని 1,266 మందికి కారుణ్య నియామకాలను రెండు వారాల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రస్తుతం ఉన్న ఆఫీస్ సబార్డినేట్‌లను జూనియర్ అసిస్టెంట్లుగా అప్-గ్రేడ్ చేస్తూ ఇటీవలే ప్రభుత్వం జీవో 79 విడుదల చేసినందున వెంటనే నియామకాలు పూర్తిచేయాలని చెప్పారు. నోటరీ స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలన్నారు.

స్వీపర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి
- నల్లగొండ జెడ్పీ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ స్కూల్స్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 43వ రోజు సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా సోమవారం నల్లగొండ జెడ్పీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో కాంతమ్మకు వినతిపత్రం అందజేశారు. మహిళా స్వీపర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిప్యూటీ సీఈవో కాళ్లపై పడి వేడుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. 43 రోజులుగా ఆందోళన చేస్తున్నా, స్వీపర్ల వేతనాలు పెంచాలని అసెంబ్లీలో ప్రతిపక్షాలు కోరినా ముఖ్యమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. స్వీపర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వరి... వర్రీ

ఇంకా చాలాచోట్ల సిద్ధం కాని నారుమళ్లు

- రాష్ట్రవ్యాప్తంగా 50 శాతమే సాగు
- ఉత్తర తెలంగాణలో వరదలొచ్చినా నిరాశే
- దక్షిణ తెలంగాణలో ఆశించిన వర్షాల్లేవ్..జలాశయాలలోకి రాని వరద



ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల చూపు

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

జూన్ మొదటి వారంలో వేయాల్సిన వరి నారుమల్లు కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ మొదలు కాలేదు. వర్షాలు ఆలస్యంగా రావడం రిజర్వాయర్లలోకి ఆశించిన నీళ్ల రాకపోవడం వల్ల వరి సాగుకు గడ్డు కాలం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా 50 శాతమే వరి సాగైనట్టు అధికారిక సమాచారం. ఉత్తర తెలంగాణలో వర్షాలొచ్చి.. వరదలొచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. సీజన్ దాటిపోయిన తర్వాత వర్షాలు వచ్చాయి. దక్షిణ తెలంగాణలో ఆశించిన వర్షాల్లేక జలాశయాలలోకి నీరు చేయలేదు. దీంతో రైతులు నిరాశతో ఉన్నారు. వరికి 60 రోజులు ఆలస్యం కావడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆలస్యంగా వరిసాగు చేస్తే దిగుబడి మీద ప్రభావం పడటం, చీడ పీడల బాధ అధికంగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబు తున్నారు. ముఖ్యంగా సోనామసూరిపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హంస పంట సాగు చేయడం లాభదా యకం కాదు అని అధి కారులు అంటున్నారు. దీంతో వ్య వ సా య ం అధికారులు ప్రత్యా మ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచనలు ఇస్తున్నారు. అదును దాటి సాగు చేసినా పూర్తిస్థాయిలో పంటలు చేతికొచ్చే అవకాశాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాలలో పెసర మినుము కంది మొక్కజొన్న వంటి పంటల వైపు రైతులు దృష్టి సారించారు.

రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో మొత్తం వరి సాగు 49,86,634 ఎకరాలకు గాను 25 లక్షల ఎకరాలలో సాగైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సాగయ్యేది వరి. అధికారిక లెక్కల ప్రకారం సాధారణంగా 7 లక్షల ఎక రాలలో వరి సాగయ్యే అవకా శాలున్నా ..తక్కువగానే సాగైంది. వానా కాలంలో ఎక్కువ శాతం సోనా మసూరి, బీపీటీ పంటను సాగు చేస్తారు. అయితే ఈసారి వర్షాలు ఆలస్యం కావడం ఇప్పటికీ పూర్తి స్థాయిలో రిజర్వాయర్లు నిండకపోవడం వల్ల వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

జూన్ మొదటి వారంలో రావలసిన వర్షాలు జూలై చివరలో వచ్చాయి. పూర్తి స్థాయిలో రిజర్వాయర్లు నిండలేదు.

జూరాల సామర్థ్యం 9.58 టీఎంసీలు కాగా 7.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ లో 885 పీట్లకు గాను 857 ఫీట్ల నీటి నిల్వ ఉంది 206టీఎంసీ లకు గాను 99.12 సీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. వర్షాలు తగ్గడంతో ఎగువ ప్రాంతం నుంచి వరదలు రావడం లేదు. దీంతో రిజర్వాయర్లు పాక్షికంగానే నిండాయి.

రిజర్వాయర్లు నిండక పోవడమే కారణం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రిజర్వాయర్లు నిండకపోవడం వల్ల వరి సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఆలస్యంగా నీళ్ల వస్తే వరి నాటు కుందామనుకున్న రైతులకు నిరాశ మిగిలింది. ముఖ్యంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు బీమా, నెట్టెంపాడు కోయిల్ సాగర్‌లకు లిఫ్టుల ద్వారా నీళ్ల రావడం లేదు. పూర్తిస్థాయిలో రిజర్వాయర్లు నిండకపోవడం వల్ల లిఫ్టులు ప్రారంభించలేదు. వనపర్తిలోని సప్తసముద్రాలు, నాగర్‌కర్నూల్‌లోని కేసరి సముద్రం, నాగనూలు, నాగసముద్రం పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రధాన రిజర్వాయర్ల కింద ఆయకట్టు వెలవెలబోతుంది.

వరి రైతులకు భరోసా కల్పించాలి

వర్షాలు లేక వరదలు రాక వరి సాగు ఆలస్యమైంది. సాగు ఎలా జరిగినా దిగుబడి పై ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ముఖ్యంగా మార్కెట్ ద్వారా వరి కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా కల్పించాలి. వరి సాగు విషయంలో రైతులకు అవగాహన కల్పించి దిగుబడి పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిరుధాన్యాలు ఆహార పంటలు కూరగాయల సాగుపై దృష్టి సారించాలి. తెలంగాణ వ్యాప్తంగా 50 శాతం మాత్రమే ఇప్పటికీ వరి సాగు అయినట్టు తెలుస్తుంది. ఇలా అయితే వరి ధాన్యం కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- టి.సాగర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రత్యామ్నాయ సాగుకు అధికారులు సహకరించాలి

వర్షాలు లేకపోవడం, వరదలు రాకపోవడంతో వరి సాగు పై నీలి నీడలు కమ్ముకున్నాయి. ముఖ్యంగా రిజర్వాయర్ల కింద ఆయకట్టు వెలవెలబోతుంది. నారు మల్లు వేయడం ఆలస్యం కావడంతో వరి పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్లిష్టతర సమయంలో వరిసాగు కు ప్రత్యామ్నాయంగా ఆహార పంటలు చిరుధాన్యాలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

- కడియాల మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

వరికి సీజన్ దాటిపోయింది

వరికి సీజన్ దాటిపోయింది. ఇప్పుడు నారుమల్లు వేస్తే లాభదాయకమైన దిగుబడి రాదు. అందుకే డ్రం ఫీడర్ తప్పనిసరిగా వాడాలి. ముఖ్యంగా మెట్ట లో వరి ధాన్యాన్ని చల్లడం ద్వారా దాటిపోయిన సమయాన్ని అధిగమించవచ్చు. ఇట్లాంటి జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడిపై ప్రభావం ఉండదు. మరీ ముఖ్యంగా మెట్ట పొలాల్లో వరి ధాన్యంతో పాటు చిరుధాన్యాలు వ్యాపార పంటలు సాగు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఆ దిశగా రైతులు వ్యవసాయం చేసుకొని నష్టాల నుండి దూరంగా ఉండాలి. నాగర్ కర్నూల్ జిల్లాలో సాధారణంగా 1,20,000 ఎకరాలలో వరి పంట సాగు కావలసి ఉంది. అయితే ఇప్పటివరకు 5000 ఎకరాలు మాత్రమే సాగయింది. మరో 20 రోజుల్లో 30 శాతం సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

- వెంకటేశ్వర్లు డీఏఓ నాగర్ కర్నూల్ జిల్లా

జీపీ కార్మికుల రాస్తారోకోలు



నవతెలంగాణ- విలేకరులు

గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా సోమవారం అన్ని మండల కేంద్రాల్లో రాస్తారోకోలు చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద జేఏసీ జిల్లా నాయకులు గూడూరి భాస్కర్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు భారీ రాస్తారోకో నిర్వహించారు. ములుగు జిల్లా తాళ్లపాగు సెంటర్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రం నెహ్రూ సెంటర్‌లో జీపీ కార్మికులు మోకాళ్ళపై నిల్చొని నిరసన తెలిపారు. పలు సెంటర్‌లలో భిక్షాటన చేశారు.

ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సీఐటీయు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో కొత్తగూడెం - ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో జీపీ కార్మికులు బోనాలు ఎత్తారు. భువనగిరి, తుర్కపల్లి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రాల్లో కార్మికులు రాస్తారోకో చేశారు. రామన్నపేటలో వంటావార్పు చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జీపీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. కోదాడలో జీపీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన తీశారు. ఆత్మకూర్‌ఎస్ మండల పరిధిలోని నెమ్మికల్ వద్ద సూర్యాపేట- దంతాలపల్లి ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ఎస్ఐ వెంకట్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి కార్మికులకు సర్దిచెప్పారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో జీపీ కార్మికులు బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. మాడ్గులపల్లి మండలంలో జీపీ కార్మికులు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. కేజీ టు పీజీ విద్యా పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 700లకుపైగా గురుకులాలను ప్రారంభించారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో మొత్తం డిగ్రీ కళాశాలలతో కలిపి 1,002 గురుకుల విద్యా సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. ఒక్కో సొసైటీలో ఒక్కో రకంగా పరిపాలన, అజమాయిషీ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. బోధనా సమయాల్లో సైతం ఏకరూపత లేదని తెలిపారు. కొత్త విద్యా సంస్థలన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ టీచర్లతోపాటు, సమాన సంఖ్యలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గెస్ట్, పార్ట్‌టైం టీచర్లు పనిచేస్తున్నారని వివరించారు. వారికి కనీస వేతనాల్లేవని తెలిపారు. 2018, 2019 సంవత్సరాల్లో నియామకమైన రెగ్యులర్ టీచర్ల సర్వీస్‌ను రెగ్యులరైజేషన్ పూర్తిచేయడంలో, పదోన్నతులు ఇవ్వడంలో ఒక్కో సొసైటీ ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ సంస్థలన్నీ నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా మంచి విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠ్యబోధనే కాకుండా హౌజ్ మాస్టర్, కేర్‌టేకర్, డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజరీ స్టడీస్, నైట్ స్టే విధులను నిర్వహిస్తున్నారనీ, సెలవుల్లేకుండా పనిచేస్తూ శారీరక శ్రమతోపాటు, తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని వివరించారు. నిర్వహణలో ఏమాత్రం తేడా వచ్చినా తీవ్రమైన చర్యలుంటున్నాయని తెలిపారు. అయినా వారికి శ్రమకు తగిన వేతనం, గుర్తింపు లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేక రకాలుగా నిరసనలు

తెలియజేశారని గుర్తు చేశారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈనెల ఐదున హైదరాబాద్‌లో జరిగిన మహాధర్నాకు తాను హాజరై వారి సమస్యలను తెలుకున్నానని తెలిపారు. ఆ సమస్యలన్నీ న్యాయమైనవేననీ, కాబట్టి సీఎం కేసీఆర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని వారి కోర్కెలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మేడ్చల్ జిల్లాలో దుశ్శాసన పర్వం

- నడిరోడ్డుపై యువతిని వివస్త్రను చేసి...
- మద్యం మత్తులో వీరంగం
- అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-జవహర్‌నగర్

రాష్ట్ర రాజధానికి సమీపంలో.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో దారుణ ఘటన జరిగింది. రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువతితో మద్యం మత్తులో ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రతిఘటించిన ఆమెపై దాడి చేసి బట్టలు చింపేసి వివస్త్రను చేశాడు. అతన్ని అడ్డుకోబోయిన ఓ మహిళపై సైతం దాడి చేశాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, డీఐ శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్‌లో పెద్ద మారయ్య అనే వ్యక్తి భార్య, నలుగురు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. అతను బండరాళ్ళు కొడుతూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మారయ్య మద్యానికి అలవాటు పడి కుటుంబంలో తరచూ గొడవలు పడుతుండేవాడు. ఆదివారం రాత్రి ఓ యువతి దుకాణానికి వెళ్లి వస్తుండగా బాలాజీనగర్ బస్టాప్ వద్ద మారయ్య ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆత్మరక్షణ కోసం యువతి మారయ్యను నెట్టేసింది. కోపోద్రిక్తుడైన మారయ్య యువతిపై దాడిచేసి దుస్తులు లాగేశాడు. అటుగా వెళ్తున్న ఓ మహిళ దాడిని అడ్డుకోబోగా ఆమెనూ కొట్టాడు. అయితే పక్కనే ఉన్న మారయ్య తల్లి అతన్ని వారించకపోవడం గమనార్హం. నగ్నంగా రోడ్డుపై ఏడ్చుకుంటూ కూర్చున్న యువతిని కొద్దిసేపటి తర్వాత స్థానిక మహిళలు కవర్లతో కప్పి జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అదించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం నిందితుడు మారయ్యను రిమాండ్‌కు పంపించారు.

కండ్లకలకపై మెడికల్ క్యాంప్



హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న కండ్ల కలక వ్యాధికి సంబంధించి హైదరాబాద్‌లోని కాచిగూడలో మెడికల్ క్యాంప్ నిర్వహించటం జరిగింది. శ్రీసాయిదుర్గా సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంపులో డా॥శేఖర్ ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, జంగన్న, నిరంజన్ రెడ్డి, ప్రభాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతులు టీచర్లే

- అందరికంటే శక్తివంతులు అమ్మానాన్నలే
- విలువలు నేర్పించడంలో ప్రభుత్వ పాఠశాలలే ఉన్నతం
- విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలంటే ఐదు సూత్రాలు పాటించాల్సిందే
- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్రరావు
- ప్రతిఒక్కరూ పుట్టుకతోనే విజేతలు..మలుచుకోవడం మన చేతుల్లోనే : డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ
- తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పతకాలు, మెమోంటోలు అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తరతరాలకు తమ జ్ఞానాన్ని పంచే జ్ఞానజ్యోతులు టీచర్లేననీ, అందరికంటే శక్తివంతులు అమ్మానాన్నలే అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్రరావు అన్నారు. పిల్లలు వారిని గౌరవించాలని సూచించారు. బాలలను విలువలతో బతికేలా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలే ఉన్నతమైనవన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సుద్దాల అశోక్‌తేజతో కలిసిన ఆయన బంగారు, వెండి, కంచు పతకాలను, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 60 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదొందల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే నిరుత్సాహపడకుండా ఎప్పుడూ ఉత్తేజంగా, నవ్వుతూ ఉండాలనీ, మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉంటే ఏదైనా చేయగలుగుతామని చెప్పారు. కష్టం వస్తే భయపడకుండా విజయంపై అడుగులు వేయాలనీ, తమ బతుకులు ఇంతే అనే భావనను మనస్సులో ఎప్పుడూ రానివ్వొద్దని సూచించారు. మన ప్రవర్తన ఆదర్శంగా ఉండాలనీ, ఎదుటి వ్యక్తులను గౌరవించడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.

బాడీ లాంగ్వేజ్ అనేది అత్యంత ముఖ్యమైనదన్నారు. క్రమశిక్షణ అనేది మన ఎదుగుదలలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడం అవసరమేగానీ, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్, సెల్‌ఫోన్లను చూడటానికి బానిసలుగా మాత్రం మారొద్దని సూచించారు. మన మీద మనకు నమ్మకం అనేది అత్యంత కీలకమైనదనీ, దాన్ని కోల్పోవద్దని నొక్కి చెప్పారు. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే పై ఐదు అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రముఖ సినీ గేయ రచయిత, డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ..తల్లి గర్భం నుంచి భూమి మీదకొచ్చినప్పుడు పిడికిలి బిగించి బయటకొస్తామనీ, అది విజయానికి గుర్తు అని చెప్పారు. ప్రతిఒక్కరూ పుట్టుకతో విజేతలేననీ, మన జీవితాలను ఎలా మార్చుకుంటామన్నది మన చేతుల్లోనే ఉంటుందని అన్నారు. పిల్లలను ఇష్టమైన అంశాల్లో ప్రోత్సహిస్తే వారు మెరకల్లా మారుతారని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నతస్థాయికి ఎదగాలనీ, చిన్నచూపు చూసిన వారితోనే శభాష్ అనిపించుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి కూడా శాస్త్రీయ ఆలోచనా విధానంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యారంగం ప్రభుత్వ రంగంలోనే ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ఇరుకుగదుల్లో ర్యాంకుల చుట్టే చదువులు సాగుతున్నాయని చెప్పారు. నైతిక విలువలనే నేర్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బాలోత్సవం ప్రధానకార్యదర్శి సోమయ్య మాట్లాడుతూ..పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా ముందుకెళు న్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ బాలోత్సవం కార్యక్రమాలు చేస్తామన్నారు. టీచర్లకు కూడా వ్యాసరచన, క్రీడా పోటీలను నిర్వహించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు మమత, సుజావతి, కార్యదర్శి సుశీల, ఎస్వీకే మేనేజర్ బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిరథ చక్రాలు ఆగవు

- ఆర్టీసీ విలీనంపై కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- ప్రతి పేదవాడూ మంత్రే :మంత్రి పువ్వాడ అజయ్
- ఆర్టీసీ సిబ్బంది, మున్నేరు బాధితుల స్వాగతం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రగతి రథ చక్రాలు ఎన్నటికీ ఆగవని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.150 కోట్లతో మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి ఆమోదం లభించిందని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు ముగించుకొని సోమవారం ఖమ్మం వచ్చిన మంత్రికి ఆర్టీసి సిబ్బంది, మున్నేరు బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలతో ఆయన్ను సత్కరించారు. మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం కోసం ఇప్పటికే రూ.180 కోట్లు మంజూరయ్యాయని, మున్నేరు ముంపు బారి నుంచి రక్షించేందుకు ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి మొన్నటి క్యాబినెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను నాలుగేండ్లుగా కడుపులో పెట్టుకున్నామని మంత్రి అన్నారు. ఎవరికి ఇబ్బందులు వచ్చినా ఆదుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి రందీ లేదన్నారు.

ఉద్యోగ భద్రత ఉందన్నారు. వారిపై ఈగ కూడా వాలదని చెప్పారు. ప్రతి నెలా 1న జీతాలు అందుతాయని తెలిపారు. మున్నేరుకు ఇరువైపులా మట్టికట్టల జోలికి పోకుండా శాశ్వత పరిష్కారంగా ఆర్‌సీసీ వాల్ నిర్మిస్తున్నామన్నారు. మంత్రిగా మొదటిసారి ఖమ్మంలో అడుగుపెట్టినప్పుడు చెప్పిన మాటలే మళ్లీ చెబుతున్నాననంటూ 'ప్రతి పేదవాడూ మంత్రే' అన్నారు. ఖమ్మానికి పట్టిన అన్ని రుగ్మతలను మంత్రదండం ద్వారా పరిష్కారం చేశానన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి కేసీఆరేనని స్పష్టం చేశారు.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే..

అందులో మన పాత్ర తప్పకుండా ఉంటది

- ఈ నెల నుంచే "చేనేత మిత్ర" అమలు
- ప్రతి మగ్గానికీ నెలకు రూ.3వేలు ఇస్తాం..
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- మన్నెగూడలో జాతీయ చేనేత దినోత్సవం
- మినీ శిల్పారామంలో చేనేత మ్యూజియానికి మంత్రి శంకుస్థాపన



నవతెలంగాణ-తుర్కయాంజల్

కేంద్రంలో ఈ సారి తప్పకుండా సంకీర్ణ ప్రభుత్వమే వస్తదని.. అందులో మన పాత్ర తప్పకుండా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాల్టీ మన్నెగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నరాలను పోగులుగా చేసి.. రక్తాన్ని రసాయనాలుగా రంగరించి.. దేశానికి అద్భుతమైన నాగరికతను నేర్పించింది చేనేత కార్మికులని కొనియాడారు. అలాంటి నేతన్నల కోసం "చేనేత మిత్ర" పథకాన్ని ఈనెల నుంచే అమలు చేస్తామని చెప్పారు. చేనేతమిత్ర పథకం కింద ప్రతి మగ్గానికీ నెలకు రూ. 3 వేలు ఇస్తామన్నారు. ఇక చేనేత మీద 5 శాతం జీఎస్టీ వేసిన మొట్టమొదటి ప్రధాని మోడీ అని విమర్శించారు. చిన్నప్పుడు చేనేతకారుల ఇంట్లో ఉండి సీఎం కేసీఆర్ చదువుకున్నారని, చేనేత కార్మికుల గురించి కేసీఆర్‌కు తెలిసినంత ఏ ముఖ్యమంత్రికీ తెలియదన్నారు. అందుకే చేనేతకు చేయూత పథకం తీసుకొచ్చారని చెప్పారు.

చేనేతలకు రూ.200 కోట్ల రుణాలు

చేనేతలకు డీసీసీబీ, టెస్కాబ్ ద్వారా రూ.200 కోట్ల రుణాలు అందిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. చేనేతలు తమ నివాసాల వద్ద గృహలక్ష్మి పథకం కింద షెడ్ నిర్మించుకునేందుకు సాయం చేస్తామని ప్రకటించారు. నేతన్నకు చేయూత ద్వారా 59 నుంచి 75 ఏండ్ల వయస్సు వరకు బీమా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షల బీమా కల్పిస్తామన్నారు. నేటి నుంచి తెలంగాణ చేనేత మగ్గం పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. రూ.40.50 కోట్లతో 10,652 ఫ్రేమ్ మగ్గాలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

నేతన్నలకు చేనేత హెల్త్ కార్డు

మృతిచెందిన కార్మికుల కుటుంబానికి టెస్కో సాయం రూ.25 వేలకు పెంచుతామని మంత్రి తెలిపారు. నేతన్నల కోసం చేనేత హెల్త్ కార్డు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్డుల ద్వారా ఓపీ సేవలకు రూ.25 వేలు ఇస్తామని ప్రకటించారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశామని, నేతన్నలు శ్రామికులుగా సూరత్ వెళ్లి పారిశ్రామికులుగా స్వరాష్ట్రం తిరిగి వచ్చారన్నారు. ఉప్పల్‌లో అద్భుతమైన హ్యాండ్‌లూం మ్యూజియం నిర్మిస్తామని తెలిపారు. పోచంపల్లి హ్యాండ్‌లూం పార్కును రూ.12.60 కోట్లతో పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింత ప్రభాకర్, పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ అలుగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో చేనేత మ్యూజియం

ఉప్పల్ మినీ శిల్పారామంలో చేనేత భవనం (పర్మినెంట్ కన్వెన్షన్ సెంటర్ హాట్) కోసం రూ.50 కోట్లతో 2576 చదరపు గజాల విస్తీర్ణంలో, మ్యూజియం కోసం రూ.15 కోట్లతో 500 చదరపు గజాలలో నిర్మాణాల పనులకు మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి వరంగల్ జాతీయ రహదారి మెయిన్ రోడ్డు కారిడార్ పనులను పూర్తి చేయాలని, ఉప్పల్ భగాయత్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు రెండెకరాల చొప్పున కేటాయించాలని, వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో సీపీ డీఎస్. చౌహన్, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఉప్పల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఉప్పల్ ఎమ్మార్వో కృష్ణారెడ్డి, డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ పాల్గొన్నారు.

ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లకు డీజీపీలుగా పదోన్నతి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలోని ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు సి.వి ఆనంద్, రాజీవ్ రతన్, జితేంద్రలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)లుగా పదోన్నతులిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991వ బ్యాచ్‌కు చెందిన సి.వి ఆనంద్.. నగర పోలీసు కమిషనర్‌గా పని చేస్తుండగా, అదే బ్యాచ్‌కు చెందిన రాజీవ్ రతన్ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ ఎండీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 1992 బ్యాచ్‌కు చెందిన జితేంద్ర రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ముగ్గురు అధికారులు ప్రస్తుతం అదనపు డీజీ స్థాయి హోదాలో ఉన్నారు.ఈ ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లకు డీజీపీలుగా పదోన్నతులివ్వటంతో వీరిలో ఒకరిని పోలీసు శాఖ చీఫ్, రాష్ట్ర డీజీపీగా నియమించనున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కారణం..ప్రస్తుత డీజీపీ అంజనీ కుమార్.. క్యాడర్‌కు సంబంధించిన వివాదం హైకోర్టు పరిశీలనలో ఉన్నది. ఆయన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి కావటంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సోమేశ్ కుమార్ కూడా ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కావటంతో ఆయనను హైకోర్టు ఆదేశాల మేరకు ఆ సమయంలో ఏపీకి పంపించాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అంజనీ కుమార్‌కు సంబంధించి న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ రాష్ట్ర ఐపీఎస్ వర్గాలలో నెలకొన్నది.

ఒకవేళ అంజనీకుమార్ ఏపీ రాష్ట్రానికి వెళ్లే పరిస్థితి ఏర్పడితే.. ప్రస్తుతం డీజీపీలు పదోన్నతులు ఇచ్చిన ముగ్గురు ఐపీఎస్ అధికారులలో ఎవరో ఒకరు రాష్ట్ర డీజీపీ అయ్యే అవకాశాలున్నాయని చర్చ సాగుతున్నది. అయితే, 1990 బ్యాచ్‌కు చెంది రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న డాక్టర్. రవి గుప్తా పేరు కూడా రాష్ట్ర డీజీపీ రేసులో ఉన్నట్టు తెలుస్తున్నది.

సంపాదకీయం


అతని పాట అమరం

'మూగబోయిన గొంతులో రాగమెవరు తీసెదరు! ఆ జీరబోయిన గొంతులో... జీవమెవరు పోసెదరు! ఆ జానపదం జీవకణంలో జీవాక్షరాలెవరో...తుపాకులకు ఎదురు నడిచినా తూటనెవరు దాచెదరో..!' తను లేనినాటి కోసం తనకుతాను రాసుకని పాడుకున్న పాట ఇది. గద్దర్ పేరుతో సాంస్కృతిక యుద్ధరంగ సైనికుడై పోరాడుతున్న గుమ్మడి విఠల్ ఆగస్టు 6న అనారోగ్యంతో మరణించాడు. 74 ఏండ్ల జీవితంలో యాభై ఏండ్లు ప్రజాకళాజీవితానికే అంకితమై తెలుగు విప్లవగీతానికి కొత్త ఒరవడిని, అగ్నిసెగను అద్దిన జనకళా మహానౌక అతడు. ఆయన

> ఎన్ని ఒడిదుడుకులు, అటుఇటుగా అడుగులు పడినా, పాట తొణకలేదు. పోరుగీతం ఆగలేదు. ఇప్పుడు గద్దర్‌ను తలచుకుంటే మనకు అతని పాటే దర్శనమిస్తుంది. తిరుగుబాటు పాటలోనే గద్దర్ మన మనసుల్లో నిలుస్తాడు. "నా దేశంలో, నా ప్రజలు ఎంతకాలం, మనుష్యులుగా గుర్తించబడరో, అంతకాలం, ఈ తిరుగుబాటు గీతం, పాడుతూనే వుంటాను' నా జాతి నా వారసత్వాన్ని కొనసాగిస్తుంది" అని చెప్పిన గద్దర్ జీవితం ధన్యం. తెలుగు నేలలో ప్రజా పాటకు కొత్తరూపునిచ్చిన గద్దర్‌కు విప్లవ జోహార్లు!

భౌతికంగా మృతినొందవచ్చుగాక, బతికిన కాలాలలో అతని గాన విద్యుత్ ప్రవాహం ఎందరిలోకో ప్రవహించి ప్రజ్వలిస్తూనే వుంది. అది నిత్య చేతనమై సామూహిక బృందగానమై, సమరశీల కళగా కొనసాగుతూనే వుంటుంది. గద్దర్ అనగానే మనకు గుర్తుకొచ్చే దృశ్యం, గొంగడి భుజాన వేసుకుని, ఎర్రని జెండా పట్టుకుని, కర్రను చేతబట్టి, పంచె కట్టుతో కాళ్లగజ్జెలతో ఒక్క ఉదుటున ఎగిరి పాట నెత్తుకునే ప్రదర్శనే కండ్లల్లో మెరుస్తుంది. ఇది ప్రజాకళకు ఆయనందించిన ఆహార్యం. అతని పాట దృశ్య రూపకం. ఉర్రూతలూగించే మహా ప్రదర్శన. అది నాభిలోంచి నింగిలోకి దూకే నిప్పుల ధార, ప్రజాగుండె ఘోష. సమసమాజం కోసం గర్జించే పర్జన్యశంఖారావం.

సామాన్యుల బాధలను, గాథలను, జనం భాషలో, జానపద లయలో పాటల్ని సృజించి గానం చేసినవాడు గద్దర్. అతను అమరులను గానం చేస్తున్నప్పుడు కన్నీళ్లు గుండెల నిండుతాయి. ఉద్వేగం ఉప్పెనలా ఎగిసి పడుతుంది. త్యాగం ధ్వనించి ప్రేరణనందిస్తుంది. పీడక కులాల, పీడిత వర్గాల జీవన బాణీలను కొత్తగా సృష్టించిన కర్త. దళిత డప్పు శబ్దాలకు అరుణ అగ్నిశ్వాసను అందించిన ప్రజాకళారూపశిల్పి. విప్లవ గేయాలకు నూతన సంప్రదాయాన్ని ఏర్పరచి వందల పాటలకు ప్రాణం పోశాడు. తెలంగాణ పాటకు కొత్త సొబగులద్ది ఉత్తేజ పరిచిన మహా ప్రభావ ప్రవాహం అతనిది. ఆయన ప్రతి అక్షరం, అభినయం, ఆలాపన ప్రజల పక్షం వహిస్తుంది. జన విముక్తికోసం తపిస్తుంది. నినాదమై జ్వలిస్తుంది. కేవలం విప్లవోత్తేజ గీతాలే కాదు, మానవీయ సంబంధాలను ఉదాత్తంగా గానం చేశాడు. 'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో, లచ్చుమమ్మ, నువ్వు చినబోయి కూచున్న వెందుకమ్మా ఎందుకమ్మా' అనే పాట ఎంత దయార్ద్రంగా వుంటుంది! 'మల్లెతీగకు పందిరివోలే మసక చీకటిలో వెన్నెలవోలె నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా, తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా' అని అనుబంధాలపై అద్భుతమైన సృజన చేయగలిగింది గద్దర్ మాత్రమే. పల్లెల్లో తన బిడ్డ ఊరెళ్లుతుంటే జర భద్రం బిడ్డా, పైలం కొడుకా అని జాగ్రత్తలు చెప్పడటం సాధారణం. ఆ సామాన్యులు పలికే పదాలను తీసుకుని 'జర భద్రం కొడుకో నా కొడుకో కొమరన్న జరా పైలం కొడుకో...ఎక్కేకాడ, దిగేకాడ, తొక్కుడుకాడ, మలుపుకాడ!' అంటూ పట్టణాలకు వలసవచ్చిన కూలీల బాధలను, పట్నంలో దోపిడీ తీరును



కండ్లకు కట్టించడం ఆయనకు వచ్చిన విద్యమాత్రమే. ప్రజలతో మమేకమై తిరిగిన గళమే అలాంటి పాటలు పాడగలుగుతుంది. 'మా భూమి' సినిమాలో యాదగిరి రాసిన 'బండెనక బండికట్టి...' పాటకు కొత్త గొంతుకనిచ్చి నేటికీ సజీవం చేశాడు. ఆఖరికి తనను చంపటం కోసం తుపాకులెక్కుపెట్టి తూటా పేల్చిన పోలీసుల మీద కూడా పొట్టకూటి కోసం పోలీసన్నా అంటూ పాటలు పాడాడు. చీపురు కట్టమీద, పిల్లిమీద, ఫ్యాను మీద పాటలల్లాడు. దేనిమీద రాసినా పాడినా, ప్రజాకోణాన్ని మరువలేదు. వీడలేదు.

గద్దర్ ఒక వ్యక్తికాదు. అతడే ఒక సైన్యం. ఎంతోమంది ప్రజాకళాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాడు. ఎన్నో దళాలను తయారు చేశాడు. రెండు తెలుగు రాష్ట్రాలలో వేల, లక్షల ప్రదర్శనలిచ్చాడు. ఇతర రాష్ట్రాలలోనూ తిరిగి తన గొంతు వినిపించాడు. గద్దర్ పాటలు ఇతర భాషలలోనూ అనువాదమయ్యాయి. ఎందరికో చైతన్యాన్ని, ప్రేరణను అందించిన ఆయనపాట ఆధిపత్యానికి, రాజ్యానికి, మతతత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటును పురికొల్పుతుంది. 1997లో ఆయన మీద హత్యాహత్నం జరిగింది. అప్పుడు కాల్పుల్లో దిగిన తూటా చివరికంటా తన శరీరంలోనే రాజ్యహింసకు గుర్తుగా నిలిచే వుంది. అయినా ఎప్పుడూ అదరలేదు బెదరలేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విస్తృతంగా తనగళాన్ని ఎత్తి ప్రజలను కదిలించాడు. 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా' అంటూ మార్మోగాడు.ఎక్కడ ప్రజాసమస్యలపై పోరాటం కనపడినా అక్కడ గద్దర్ గళం వినిపించేది. 2016లో ప్రజాసంఘాలు సామాజిక సమానత్వం కోసం మహాజనపాదయాత్ర జరుపుతుంటే పాల్గొని సంఘీభావం తెలిపాడు. ప్రపంచీకరణకు, మతతత్వానికి వ్యతిరేకంగా జరిగిన సాహిత్య కృషికి అండగా నిలిచాడు. అయితే ఈ మధ్యకాలంలో రాజకీయంగా కొంత భిన్నంగా వ్యవహరించడం వలన విమర్శలూ ఎదుర్కొన్నారు. రామానుజ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా పాటతో ప్రచారం చెయ్యడమూ వివాదాన్ని లేపింది. ఎన్ని ఒడిదుడుకులు, అటుఇటుగా అడుగులు పడినా, పాట తొణకలేదు. పోరుగీతం ఆగలేదు. ఇప్పుడు గద్దర్‌ను తలచుకుంటే మనకు అతని పాటే దర్శనమిస్తుంది. తిరుగుబాటు పాటలోనే గద్దర్ మన మనసుల్లో నిలుస్తాడు."నా దేశంలో, నా ప్రజలు ఎంతకాలం, మనుష్యులుగా గుర్తించబడరో, అంతకాలం, ఈ తిరుగుబాటు గీతం, పాడుతూనే వుంటాను' నా జాతి నా వారసత్వాన్ని కొనసాగిస్తుంది" అని చెప్పిన గద్దర్ జీవితం ధన్యం. తెలుగు నేలలో ప్రజా పాటకు కొత్తరూపునిచ్చిన గద్దర్‌కు విప్లవ జోహార్లు!

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం



ప్రభాత్ పట్నాయక్

చాలామంది ఆర్థికవేత్తలు భారతదేశంలో సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని అమలు చేయాలని వాదిస్తున్నారు. 2016-17 ఆర్థిక సర్వేలో సైతం ఈ విషయాన్ని అధికారికంగానే సూచించారు. అయితే దానిని ఏ విధంగా అమల్లోకి తేవాలన్న ఆచరణాత్మక విషయం మీద ప్రతిపాదనలు రకరకాలుగా వస్తున్నాయి. ఒకానొక స్థాయి కన్నా తక్కువగా ఆదాయం పొందుతున్న వారందరినీ గుర్తించి వారందరికీ ఒకేవిధంగా నగదు బదిలీ చేయాలన్నది ఒకటి. ఎవరెంత తక్కువ స్థాయిలో ఆదాయం పొందుతున్నారన్నది పరిశీలించి దానికి తగ్గట్టు నగదు బదిలీ వివిధ రకాలుగా చేయాలన్నది రెండోది. ఈ తేడాలను పక్కన పెడితే సార్వత్రిక పాథమిక ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) అనే భావన సారాంశం ఒక్కటే. సమాజంలో ప్రతీ ఒక్కరూ ఒక కనీస ప్రాథమిక స్థాయికి తగ్గకుండా ఆదాయాన్ని పొందగలగాలి. అందుకు వీలుగా ప్రభుత్వం నగదు బదిలీ చేయాలి. అప్పుడు ప్రతీ ఒక్కరూ ఒక కనీస స్థాయిలో సరుకులను పొందగలిగే పరిస్థితిలో ఉంటారు. ఆ విధంగా కనీస జీవన ప్రమాణాలను అందుకోగలుగుతారు.

ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన పట్ల కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. ఆర్థిక సర్వే వాటిని వివరంగా పేర్కొని తన నివేదికలో వాటిపై చర్చించింది. ప్రధానమైన అభ్యంతరాలు మితవాద శక్తులనుండి వచ్చాయి. వాళ్ళ ప్రధానమైన అభ్యంతరం ఒక్కటే. ఈ విధంగా ప్రభుత్వం నేరుగా నగదు అందిస్తే ఇక దానిని అందుకున్నవాళ్లు తమ వంతు కష్టపడి పనిచేయడం మానేస్తారు. పనిచేసినా, చెయ్యకపోయినా ఎటూ ఆదాయం రావడం ఖాయం గనుక ఆ కాడికి మనం పని చేయడం దేనికి? అన్న ధోరణి పెరుగుతుంది. మనం ప్రస్తుతం ఉంటున్న సమాజంలో ఒక వ్యక్తి ఆదాయం అతడు చేసే కష్టం మీద ఆధారపడి వుంటుంది అన్న ప్రాతి పదికన ఈ వాదన నడుస్తుంది. ఒక వ్యక్తి కష్టపడకపోయినా అతనికి లేదా ఆమెకు కనీస స్థాయిలో ఆదాయం గ్యారంటీగా వచ్చే పద్ధతి ప్రవేశపెడితే, అప్పుడు మన సమాజం నడక మారిపోతుంది అని మితవాదులు అంటారు. కాని ఈ వాదన బొత్తిగా అర్థరహితం. ఎందుకంటే, ప్రస్తుత సమాజంలో ధనవంతులు ఏ కష్టమూ పడకుండానే విపరీతంగా తమ సంపదను పెంచుకోగలుగుతున్నారు. ఇంకో పక్క పేదలు చాలా కొద్దిపాటి కూలి డబ్బుల కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు.

ఒకానొక కార్మికుడు ఎంత ఎక్కువ కష్టంతో కూడిన పని చేస్తే, ఎంత ఎక్కువ ప్రమాదంతో కూడిన పని చేస్తే అంత ఎక్కువ జీతం అతడికి వస్తుంది అని ఆడమ్ స్మిత్ చెప్పాడు. ఐతే ఆచరణలో ఆ విధంగా లేదని జాన్ స్టువార్ట్ మిల్ అనే మరో ఆర్థికవేత్త గమనించాడు. నిజానిక అటువంటి కష్టతరమైన, ప్రమాదాలతో కూడిన పనులు చేసేవారికి అతి తక్కువ వేతనాలు లభిస్తున్నాయని అతడు ఎత్తిచూపాడు. అందుచేత ఇక్కడ సార్వత్రిక ప్రాథమిక వేతనం అమలు చేయడం అంటే ఏ పనీ చేయనందుకు ఇచ్చే ఆదాయం కాదు. అతడు చేసే పనికి ఎక్కువ రేటు వేతనాన్ని చెల్లించడం ఔతుంది. (ఒకానొక వ్యక్తి నిరుద్యోగిగా ఉన్నాడంటే అది అతడి వ్యక్తిగతమైన తప్పు కాదు, అది ఈ సామాజిక వ్యవస్థ లోపం. ఈ విషయానికి, ప్రస్తుత చర్చతో సంబంధం లేదు).

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం గ్యారంటీ చేస్తే దాని వలన జనాలు పని చేయడం మానేస్తారు అన్న వాదన ఎలాంటిదంటే, జీతాలు ఎంత పెంచితే కార్మికులు అంతగా పని ఎగ్గొడతారు అన్న వాదన లాంటిది. కార్మికుల జీతాలకు "డిమాండ్-సప్లయ్" సూత్రాన్ని వర్తింపజేసే మితవాద ఆర్థికవేత్తల వాదన ఇది. ఈ వాదన నైతికంగా సహించకూడనిది, విశ్లేషణాత్మకంగా చూస్తే నిరాధారమైనది. అందుకే "ధనవంతులు ఎంత ఎక్కువగా సంపాదిస్తే అంత బాగా పని చేస్తారు, పేదలు ఎంత తక్కువ జీతం ఇస్తే అంత బాగా పని చేస్తారు" అన్నట్టుగా వీళ్ళ వాదన ఉందని జెకె గాల్బ్రియత్ అనే అమెరికన్ ఆర్థికవేత్త మితవాదులని అవహేళన చేశాడు.

మితవాదులు సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని వ్యతిరేకిస్తే, అభ్యుదయ కాముకులైన ఉదారవాదులు (లిబరల్స్) ఈ ప్రతిపాదనను బలంగా ముందుకు తెస్తున్నారు. ఐతే ఈ ఉదారవాదుల ప్రతిపాదన ఎలాంటిదంటే కోడిగుడ్డును పగలగొట్టకుండానే ఆమ్లెట్‌ను తయారు చెయ్యాలన్నటువంటిది. మామూలుగా ఈ ఉదారవాదుల ప్రతిపాదనలన్నీ ఈ విధంగానే ఉంటాయి. వీళ్లు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలనే సమాజం కొనసాగాలనుకుంటారు. అదే సమయంలో ఈ సమాజం కార్మికవర్గం పట్ల మరింత మానవత్వంతో మెలగాలని అంటారు. మరైతే అందుకోసం పెట్టుబడిదారులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టకూడదని కూడా అంటారు. అందుకనే సార్వత్రిక ప్రాథమిక ఆదాయం పేర చెల్లించవలసిన మొత్తం చాలా స్వల్పంగా ప్రతిపాదించారు. ఉదాహరణకి 2016-17 ఆర్థిక సర్వే ఒక సంవత్సరానికి ఒక వ్యక్తికి రు.7620 చొప్పున బదిలీ చేయాలని ప్రతిపాదించింది. మెరుగైన జీతాలు పొందే 25 శాతం కార్మికులను మినహాయించి తక్కినవారందరికీ తలా రూ.7620 చొప్పున ఏడాదికి చెల్లించాలంటే అందుకు మన జీడిపిలో 4.9 శాతం కేటాయించాలి. దానితో సరిసమానమైన మొత్తాన్ని గనుక అత్యల్ప ఆదాయాలు పొందుతున్న 75 శాతం ప్రజలకు కేటాయిస్తే (2011-12 నాటి ధరల ప్రాతిపదికన) దాని వలన దేశంలో పేదరికం ఆ ఏడాదిలో (2011-12 లో) కేవలం 0.5 శాతం మాత్రమే ఉండివుండేది. అంటే పేదరికం దాదాపు లేకుండా పోయేదని ఆర్థిక సర్వే పేర్కొంది. అయితే, తలా రూ.7620 చెల్లించడం కోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సేకరించడానికి ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రకరకాల సబ్సిడీలన్నింటికీ కోత పెట్టవచ్చునని ఆర్థిక సర్వే సూచనప్రాయంగా చెప్పింది.

> అదనంగా 7 శాతం పన్నులు పెంచడం ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. సంపన్నుల మీద అదనపు పన్నులు వేయగలగాలి. అంతే. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభా మీద సంపద పన్ను 2 శాతం చొప్పున అదనంగా విధించాలి. వారసత్వంగా ఆస్థి సంక్రమించినప్పుడు (ఈ ఒక్క శాతం జనాభాలోనే) అందులో 33.33 శాతం వారసత్వ పన్నుగా విధించాలి. ఈ రెండు పన్నులూ చాలు. దేశం మొత్తం మీద పైన చెప్పిన 5 హక్కులనూ అమలు చేయడానికి సరిపడా ధనం సమకూరుతుంది.



ఆర్థిక సర్వే చెప్పిన లెక్కలతో రెండు సమస్యలు ఉన్నాయి. మొదటిది: సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అమలు జరగడం వలన పేదలు తినే ఆహారపు కేలరీల విలువ దాదాపు 50 శాతం పెరుగుతుందని ఆ సర్వే చెప్పింది. ఆ మేరకు వారికి బదిలీ చేసే నగదు మొత్తంలో పెరుగుదల ఉండాలంటే జీడిపిలో 4.9 శాతం చాలదు, 7.5 శాతం కావాలి. ఆర్థిక సర్వే సూచించినట్టు సార్వత్రిక ప్రాథమిక వేతనాన్ని అమలు చేసేటప్పుడు ఇతర సబ్సిడీలకు కోత పెట్టడం జరిగితే అప్పుడు సాలుకి రూ. 7620 సరిపోదు. సార్వత్రిక ప్రాథమిక వేతనాన్ని అమలు చేయడానికి వచ్చిన ఇతర సూచనలు చాలా పరిమితలక్ష్యాలతో ఉన్నాయి.

ఒకవేళ ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం విధానాన్ని అమలు చేయడానికి పార్లమెంటులో ఒక చట్టాన్ని తీసుకు వచ్చి, అందులో పెరిగే ధరలకు అనుగుణంగా చెల్లింపులు పెంచాలన్న నిబంధనను కూడా విధిస్తే (ఇప్పుడు ఉపాధిహామీ చట్టంలో ఉన్నట్టు) అప్పుడు ప్రభుత్వం విద్య, వైద్యం తదితర పద్దుల్లో కోత పెట్టి ఈ విధానాన్ని అమలు చేస్తుంది. అప్పుడు పేదల దగ్గర ప్రభుత్వం ఇచ్చిన సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అయితే ఉంటుంది కాని, వాళ్ళ బిడ్డల్ని ఉచితంగా చదివించే స్కూళ్లుగాని, వాళ్ళ రోగాలకి ఉచితంగా వైద్యం చేసే ఆస్పత్రులు గాని ఉండవు. ఒకవేళ ప్రయివేటు స్కూళ్ళకు, ప్రయివేటు ఆస్పత్రులకు పోతే ప్రభుత్వం సార్వత్రిక ప్రాథమిక ఆదాయం కింద ఇచ్చిన సొమ్ము కాస్తా వాటికే పోతుంది. అప్పుడు వారి వినిమయ శక్తి తగ్గిపోతుంది. సార్వత్రిక ప్రాథమిక ఆదాయం విధానాన్ని ప్రవేశపెట్టిన లక్ష్యం నెరవేరదు. అందరికీ ప్రాథమిక వేతనాన్ని పొందే హక్కు కల్పించే చట్టాన్ని తెచ్చినా, అందుకోసం ప్రభుత్వం అందించే నగదు బదిలీల నిమిత్తం ఇతర సబ్సిడీలలో విధించే కోతల కారణంగా ఆ చట్టం నిరుపయోగం అవుతుంది.

అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని పొందే హక్కును ఒక చట్టంగా చేయడం కన్నా, ప్రజలకు కొన్ని కనీస హక్కులను గ్యారంటీ చేసే చట్టాలను తీసుకురావడం ఎక్కువ ఉపయోగం. నాణ్యత కల విద్యను ఉచితంగా పొందే హక్కు, నాణ్యత కలిగిన విద్య, సేవలను ఉచితంగా పొందే హక్కు, ఉపాధి పొందే హక్కు, ఉచితంగా వృద్ధాప్య పెన్షన్ పొందే హక్కు, అంగవైకల్యానికి పరిహారం పొందే హక్కు వగైరా హక్కులను కల్పిస్తూ చట్టాలు తీసుకురావడం అవసరం. నిజానికి సార్వత్రిక ప్రాథమిక వేతనం ఇవ్వాలన్న ప్రతిపాదన దేనికి? ఆ పేదలు విద్య, వైద్యం, వగైరాలను పొందడానికే కదా? అటువంటప్పుడు ఆయా హక్కులను కల్పించే చట్టాలను చేయడం ప్రయోజనకరం ఔతుంది కాని, సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని ఇస్తూ అందుకోసం విద్య, వైద్యం తదితర హక్కులలో కోతలు పెట్టడం వలన ఏమిటి ఉపయోగం?అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన చాలా సదుద్దేశ్యంతో కూడినదైనప్పటికీ, అది బొత్తిగా అర్థం లేనిది. నిజంగా దేశంలో ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలనుకుంటే, అప్పుడు వైద్యం, విద్య, ఉపాధి తదితర హక్కులను కల్పించే చట్టాలను చేయడమే గాక, సంక్షేమానికి కేటాయింపులను బాగా పెంచాల్సి వుంటుంది. ఆర్థిక సర్వే సూచించిన మొత్తం ఏ మూలకూ చాలదు. ఆహార హక్కు, ఉపాధి హక్కు (లేదా ఉపాధి దొరికేదాకా కనీస వేతనం) నాణ్యత కల వైద్యం పొందే హక్కు, నాణ్యత కల విద్య పొందే హక్కు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్ పొందే హక్కు- ఈ అయిదింటినీ కల్పించాలంటే అందుకు మన జిడిపిలో కనీసం 10 శాతం కేటాయించడం అవసరం. అందుకోసం ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కనీసం 7శాతం మేరకు పెంచాలి (తక్కిన 3 శాతం ప్రజలు చేసే ఖర్చు పెరిగినందు వలన లభిస్తుంది.).

అదనంగా 7 శాతం పన్నులు పెంచడం ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. సంపన్నుల మీద అదనపు పన్నులు వేయగలగాలి. అంతే. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభా మీద సంపద పన్ను 2 శాతం చొప్పున అదనంగా విధించాలి. వారసత్వంగా ఆస్థి సంక్రమించినప్పుడు (ఈ ఒక్క శాతం జనాభాలోనే) అందులో 33.33 శాతం వారసత్వ పన్నుగా విధించాలి. ఈ రెండు పన్నులూ చాలు. దేశం మొత్తం మీద పైన చెప్పిన 5 హక్కులనూ అమలు చేయడానికి సరిపడా ధనం సమకూరుతుంది. ఐతే అప్పుడు మన దేశం సంక్షేమ రాజ్యం ఔతుంది. ఆ విధంగా మార్చడం ఈ బూర్జువా వ్యవస్థ శక్తికి మించిన పని. బూర్జువా వ్యవస్థ పరిధిని దాటని ఉదారవాద ఆర్థికవేత్తల అవగాహనకు అందని వ్యవహారం ఇది.

- (స్వేచ్ఛానుసరణ)

> సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని పొందే హక్కును ఒక చట్టంగా చేయడం కన్నా, ప్రజలకు కొన్ని కనీస హక్కులను గ్యారంటీ చేసే చట్టాలను తీసుకురావడం ఎక్కువ ఉపయోగం. నాణ్యత కల విద్యను ఉచితంగా పొందే హక్కు, నాణ్యత కలిగిన విద్య, సేవలను ఉచితంగా పొందే హక్కు ఉపాధి పొందే హక్కు ఉచితంగా వృద్ధాప్య పెన్షన్ పొందే హక్కు, అంగవైకల్యానికి పరిహారం పొందే హక్కు వగైరా హక్కులను కల్పిస్తూ చట్టాలు తీసుకురావడం అవసరం.



ఆదివాసీ హక్కులకు దిక్కెవరు?

> ఇండియాలో రాజస్థాన్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధిక ఆదివాసీ జనాభా కేంద్రీకరించబడి ఉన్నది. సాధారణ సమాజానికి దూరంగా అణచి వేయబడిన గిరి పుత్రులకు మానవ హక్కులే తెలియవు. ఇలాంటి ఆదివాసీ జాతులు పోడు భూముల సాగుతో పాటు అటవీ ఉత్పత్తులనే జీవనోపాధులుగా చేసుకొని బతుకుతున్నారు.

స్వయంకృషిని మాత్రమే నమ్ముకొని, సాధారణ నాగరిక సమాజానికి దూరంగా జీవనయానం సాగించే ఆదివాసీ, స్వదేశీ జనజాతులు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 90 దేశాల్లో కోట్లలో ఉన్నారు. ఇలాంటి ఆదివాసీ గిరిజన మన్యం జాతులు జనజీవన స్రవంతికి దూరంగా అడవుల్లో, ద్వీపాల్లో తమదైన ప్రత్యేక జీవనశైలితో తమదైన సంస్కృతి వారసత్వాల సంపదలతో అమాయకంగా, అనాగరిక బతుకులను అనుభవిస్తున్నారు. నేటి డిజిటల్ యుగపు శాస్త్రసాంకేతిక ఫలాలు వీరి దరికి నేటికీ చేరలేదనేది చేదు వాస్తవం. ప్రపం చంలో తొలిసారి నీగ్రో నల్లజాతి ఆఫ్రికన్లను బానిసలుగా చేసుకొని అమెరికన్లు, బ్రిటీషర్లు అమానవీయంగా, పశువుల వలె వాడుకున్న చరిత్రను విన్నాం, కన్నాం. అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలు, భాషలు, వేషధారణలు, కులమతాలు, సాంప్రదాయాలతో మమేకమవుతూ, ఆధునిక హంగులకు దూరంగా, ప్రభుత్వ సహాయం అందని, మానవ హక్కులు తెలియని, చిన్న చిన్న మైనారిటీ సమూహాలుగా జీవిస్తుం టారు. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో 5,000లకు పైగా ఆదివాసీ ప్రాంతాల్లో 60 కోట్ల ఆదివాసీలు (ప్రపంచ జనాభాలో 6.2 శాతం) 2680 ఆదివాసీ భాషలతో ప్రత్యేక జీవన విధానంతో బతుకుతున్నారని అంచనా. అడవి పుత్రులుగా నేల, ప్రకతి వనరులు, జీవ సంపదపై ఆధారపడే వత్తుల్లో మగ్గుతూ దీనస్థితులలో బతుకులు సాగిస్తున్నారు.


2007లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ఆదివాసీ జాతుల మానవ హక్కుల పరిరక్షించబడాలని, వారికి అభివద్ధి ఫలాలు అందాలనే ఉద్దేశ్యంతో (1982 ఆగష్టు 09న నిర్వహించిన తొలి ఆదివాసీ జనుల సమావేశానికి గుర్తుగా) ప్రతి ఏటా 'ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ది వరల్డ్స్ ఇండిజీనియస్ పీపుల్)' పాటించుట ఆనవాయితీగా వస్తోంది. స్వదేశీ జాతులకు ఉద్యోగ, ఉపాధి, విద్య, ఆరోగ్యం, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, గుర్తింపులను అందించాలనే ప్రయత్నాలు నేడు జరుగుతున్నాయి. వలస రాజ్యపాలనతో ఆదివాసీలు అమానవీయ బానిసలుగా భావింపబడ్డారు. ఆదివాసీ జాతులు అనారోగ్యం, పేదరికం, వివక్షలతో అమానవీయ దుర్భర బతుకులను ఈడ్చుతున్నారు. ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం-2023 నినాదంగా 'స్వయం అభివృద్ధి ప్రతినిధులుగా ఆదివాసీ యువత' అనే అంశాన్ని తీసుకున్నారు. ఐరాస 2005-15 దశాబ్దాన్ని 'అంతర్జాతీయ ఆదివాసీ దశాబ్దం'గా పాటించడం మనకు తెలుసు. ఆదివాసీల్లో 86 శాతం అసంఘటిత, అనధికార ఆర్థిక వ్యవస్థలో కడు పేదరిక ఉచ్చులో చిక్కి ఉన్నారు. ప్రపంచ ఆదివాసీల్లో 47 శాతం అవిద్య, పేదరికం అనబడే జబ్బులతో నిరుద్యోగులుగా ఉండిపోతున్నారు.

ప్రపంచ జనాభాలో 2వ స్థానం, వైశాల్యంలో 7వ స్థానం పొందిన అతిపెద్ద ప్రజాస్వామిక భారత దేశంలో 705 ఆదివాసీ సమూహాలుగా 10.4 కోట్ల జనులు (జనాభాలో 8.6 శాతం) ఉన్నారు. ఆదివాసులను యస్‌టిలుగా వర్గీకరించిన ప్రభుత్వం అనేక ఆర్థిక సామాజిక సహాయాలను అందిస్తున్నది. ఇండియాలో రాజస్థాన్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధిక ఆదివాసీ జనాభా కేంద్రీకరించబడి ఉన్నది. సాధారణ సమాజానికి దూరంగా అణచి వేయబడిన గిరి పుత్రులకు మానవ హక్కులే తెలియవు. ఇలాంటి ఆదివాసీ జాతులు పోడు భూముల సాగుతో పాటు అటవీ ఉత్పత్తులనే జీవనోపాధులుగా చేసుకొని బతుకుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ముఖ్యమైన ఆదివాసీ తెగలు ఉన్నాయి. వీరిలో చెంచు, బోడో/గుటోబ గడబ, కొండ్, కోలమ్, కొండ రెడ్డి, కొండ సవర, పొరోజ, కోయ, తోటి, కమ్మర, జటపస్, కట్టు నాయకన్, కొలావర్, మన్న దొర, లంబాడీ, యానాది, నక్కల, వాల్మీకి, బంజార, సుగాలీ, గుస్సాడి లాంటి అటవీ జాతులు వస్తాయి. తెలుగు రాష్ట్రాల ఆదివాసీలు అటవీ ప్రాంతాల్లో పోడు భూముల్లో వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సమీకరణల మీద ఆధారపడి జీవనోపాధిని పొందు తున్నారు. నల్లమల అటవీ ప్రాంతాల్లో పోడు సాగుచేస్తూ చెంచు జాతులు బతుకుదెరువు పొందుతున్నారు. ఆదివాసీలు విలక్షణమైన అటవీ పుత్రులు. అమాయక గిరిపుత్రులు జనజీవన స్రవంతికి దూరంగా, అమానవీయ పరిసరాల్లో అడవితల్లిని నమ్ముకొని అనాగరికంగా, అమాయకంగా బతుకుతుంటారు. అడవిలో కొంత భాగాన్ని వ్యవసాయ భూమిగా మార్చుకొని పంటలు పండించుకుంటారు. దీనినే పోడు సాగుపద్ధతిగా పిలుస్తాం. ఇది కూడా చేయద్దని ప్రభుత్వం అడ్డుకుంటున్నది. దీంతో అటవీ ప్రాంతాల్లోనే వలసలు వెళ్తూ వలస సాగు' చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఇది ఎక్కువ తెలంగాణలోని ఆదిలాబాద్?, ఏపీలోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, శ్రీకాకుళం లాంటి ప్రాంతాల్లో కనిపిస్తుంది. బతుకుదెరువుకు, పర్యావరణ పరిరక్షణకు మధ్య నిత్యపోరు చూస్తున్నాం. ఆదివాసీల పక్షాన నిలుస్తున్న ఓటు బ్యాంకు రాజకీయ వ్యవస్థలు దీర్ఘకాలిక అనర్థాలను అర్థం చేసుకోకపోవడం విచారకరం. మణిపూర్‌లాంటి తెగల మధ్య ఘర్షణ చూసిన తర్వాత ఆదివాసీల జీవన భద్రతకు సరైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

(09 ఆగష్టు 'ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం')

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి , 9949700037

మహిళా బిల్లును అడ్డుకుంటున్నదెవరు?




నాదెండ్ల శ్రీనివాస్

'రిజర్వేషన్ అనేది రాజ్యాంగపరమైన హక్కు. మహిళల రిజర్వేషన్ కూడా అందులో భాగమే. వాటిని అమలు చేయకుండా ఎలా ఉంటారు? మీ సొంత పార్టీ బీజేపీ పాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలపై మీరు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మీకు అనుకూలంగా లేని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మీ ప్రభుత్వాలు ఉన్న దగ్గర ఎలాంటి చర్యలు ఉండటం లేదు' అని జులై25న సుప్రీంకోర్టు నాగాలాండ్ స్థానిక ఎన్నికల్లో రాజ్యాంగబద్ధమైన మహిళా రిజర్వేషన్లు అమలుపరచక పోవడంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 'మహిళల విద్య, ఆర్థిక స్థితిగతులు, సామాజిక స్థాయిపరంగా నాగాలాండ్ మెరుగైన స్థితిలో ఉంది. ఇలాంటి రాష్ట్రంలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని అంగీకరించలేకపోతున్నాం' అని పేర్కొంది. అయితే మహిళా సాధికారతపై ఎప్పుడూ జరిగే సదస్సుల్లో ప్రధాని ఎన్నో మాటలు చెబుతారు. తల్లులు, సోదరీమణుల సాధికారత కోసం తన ప్రభుత్వ హామీలు, ఉద్దేశాల గురించి చాలా వినిపిస్తారు. కానీ ఈసారి రిజర్వేషన్ల పరిధి పెంచే సమయం ఆసన్నమై నపుడు దుష్యంతుడులాగే ఆయన కూడా ఇచ్చిన మాట మర్చిపోయారు. ఇది ఆశ్చర్యపోవాల్సిన విషయం కాదా? అయితే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అంశం ఈనాటిది కాదు. ఇది 1974కు ముందు నుంచే నలుగుతోంది. దీనికి సంబంధించి రాజ్యసభలో 2010లో ఆమోదం పొందిన బిల్లును 108వ రాజ్యాంగ సవరణ అని కూడా అంటారు. అప్పటి నుంచి 2014, 2019లో రెండు లోక్‌సభల గడువుతీరి రద్దయి ఉనికిలోకి వచ్చిన మూడవ సభలో కూడా ఇంతవరకు ఆమోదం పొందక ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. మరి కనీసం వర్తమాన లోక్‌సభ 2024లో రద్దయ్యే లోగా అయినా ఈ బిల్లు ఆమోదం పొందుతుందా? అనేది నేడు అంతు చిక్కని ప్రశ్న.

నిజానికి ఈ అంశం 1931లోనే చర్చకు వచ్చినా చట్టసభలలో ఆశించిన మేరకు ప్రాతినిధ్యం పెరగలేదు. 1974లోనే దేశంలో మహిళల స్థితిగతుల గురించి ఒక కమిటీ చేసిన సిఫార్సులలో స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్నది.తరువాత 1988లో జాతీయ మహిళా దష్టి కోణ పథకం (నేషనల్ పరస్పెక్టివ్ ప్లాన్ ఫర్ ఉమెన్) కమిటీ స్థానిక సంస్థలలో మహిళలకు 30శాతం స్థానాలను రిజర్వ్ చేయాలని సిఫార్సు చేసింది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నపుడు 1992-93 సంవత్సరాలలో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా మూడో వంతు స్థానాలను రిజర్వు చేశారు. దీని ప్రకారం మూడవ వంతు కనీసంగానూ, తరువాత ఏ రాష్ట్రమైనా కోరుకుంటే 50శాతం వరకు కూడా పెంచుకొనే అవకాశం కల్పించారు. 1993లో జరిగిన రాజ్యాంగ సవరణ ఈ బిల్లుకు మూలం.మహిళా రిజర్వేషన్ బిల్లును 1996 సెప్టెంబర్ 12న అప్పటి ప్రధాన మంత్రి హెచ్‌డి దేవెగౌడ నేతత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మొదటిసారి లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే ఇప్పటికీ ఇది చట్ట రూపం దాల్చలేదు. లోక్‌సభ, శాసనసభ స్థానాల్లో 33 శాతం స్థానాలను మహిళలకు కేటాయించాలని, చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని, వారి ప్రతిభా పాటవాలను దేశం కోసం, ప్రజల కోసం వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. మూడు సార్వత్రిక ఎన్నికల్లో రొటేషనల్ ప్రాతిపదికపై ఈ రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. అంటే మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఒకసారి మాత్రమే ఒక నియోజకవర్గాన్ని మహిళలకు కేటాయిస్తారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును 1996 సెప్టెంబరు 12న అప్పటి ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవగౌడ నేతత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మొదటిసారి లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ దీనికి ఆమోదం లభించలేదు. గీతా ముఖర్జీ నేతత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును నివేదించింది. ఈ కమిటీ తన నివేదికను 1996 డిసెంబరు 9న లోక్‌సభకు సమర్పించింది.1998 జూలై 13న ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు అప్పటి న్యాయ శాఖ మంత్రి ఎం తంబిదురై సమాయత్తమవుతుండగా, ఆర్జేడీ ఎంపీ సురేంద్ర ప్రసాద్ యాదవ్ సభ వెల్‌లోకి వెళ్లి స్పీకర్ జీఎంసీ బాలయోగి వద్దనున్న ఈ బిల్లు ప్రతులను లాక్కొని,చింపేశారు. ఈ బిల్లును 1999లో ఎన్డీయే ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది,కానీ ఆమోదం లభించలేదు.2004 సార్వత్రిక ఎన్నికల్లో యుపిఎ కనీస ఉమ్మడి కార్యక్రమంలో ఈ బిల్లు గురించి ప్రస్తావించారు.తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే లోక్‌సభ, శాసన సభల్లో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయిస్తూ చట్టం చేసేందుకు నాయకత్వం వహిస్తామని తెలిపింది. 2005లో బీజేపీ ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అయితే మహిళలకు కోటా కులం ప్రాతిపదికపై ఉండాలని బీజేపీ నేతలు కొందరు డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు కాలదోషం పట్టకూడదనే ఉద్దేశంతో 2008లో రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 2010 మార్చి 9న ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. సమాజ్‌వాదీ పార్టీ, లాలూ ప్రసాద్ యాదవ్ నేతత్వంలోని ఆర్జేడీ ఈ బిల్లును గట్టిగా వ్యతిరేకించాయి. వెనుకబడిన కులాలకు చెందిన మహిళ లకు మహిళా రిజర్వేషన్లలో ప్రత్యేక రిజర్వేషన్లు ఉండాలని ఈ పార్టీలు పట్టుబట్టాయి. ప్రస్తుత కాలంలో అయితే లోక్‌సభలో ఆధిక్యతగల



పార్టీయే దీనిని ఆమోదించే విధంగా పరిస్థితులను చక్కదిద్దగలుగుతుంది. దేశంలోని ప్రజా ఆస్తులు లాంటి అనేక సంచలన నిర్ణయాలు తీసుకోవడంలో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్‌షా తల్చుకుంటే దీనిని కూడా ఆమోదింపజేసి, ప్రజాదరణను సొంతం చేసుకోగలుగుతారు.

మన పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు చర్చకు వచ్చినపుడు ఓబిసి, దళిత, గిరిజన మహిళల భుజాల మీద తుపాకి పెట్టి బిల్లును అడ్డుకున్న ఘనులున్నారు. ఏ సామాజిక తరగతికి చెందిన వారు అన్నదానితో నిమిత్తం లేకుండా మొత్తంగా మహిళలు అన్ని సామాజిక తరగతుల్లో వివక్షకు గురవుతున్నారు. అందువలన రిజర్వేషన్లు పెడితే ధనికులు, మనువు చెప్పినదాని ప్రకారం ఎగువ నిచ్చెన మెట్ల మీద ఉన్న మహిళలే ఆ ఫలాలను అనుభవిస్తారంటూ అడ్డుకున్నవారు కొందరు. రిజర్వేషన్లు అడగటం, ఇవ్వటం అంటే మహిళలను కించపరచటమేనని వాదించిన వారూ లేకపోలేదు. పైకి కారణాలు ఎన్ని చెప్పినప్పటికీ దేశంలో ఫ్యూడల్ భావజాలం బలంగా ఉండటమే బిల్లు ఆమోదం పొందటానికి ఆటంకంగా ఉందని చెబుతున్నవారు ఉన్నారు. స్థానిక సంస్థలలో ఎన్నికైన మహిళలు పేరుకు ఆ స్థానాల్లో ఉన్నా భర్త లేదా కుటుంబంలోని ఇతర పురుషులే పెత్తనం చేస్తున్నారన్నది కూడా పాక్షిక సత్యమే. మరోవైపున మహిళలు ఉన్న చోట కేటాయింపులు, పౌరసేవలు ముఖ్యంగా మహిళలకు సంబంధించిన అంశాలకు పెరిగినట్లు, సాధికారత, ఆత్మగౌరవం పెరిగినట్లు కూడా సర్వేలు వెల్లడించాయి.గుర్తింపు పొందిన ప్రతి రాజకీయ పార్టీ చట్టసభలకు పోటీ చేసే వారిలో నిర్ణీత శాతంలో మహిళలు ఉండేట్లు చూడాలన్న ప్రతిపాదనకు ఆమోదం రాలేదు. దీని వలన ఓడిపోయే చోట్ల వారిని పోటీకి దింపుతారనే విమర్శకూడా వచ్చింది.

చట్టపరంగా లేదా రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మహిళలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించకపోవటం మనది ప్రపంచంలో అతి పెద్ద ప్రజా స్వామిక దేశమని ప్రచారం చేసుకోవటాన్ని అపహాస్యం చేస్తున్నది. అన్నింటికంటే పెద్ద వైరుధ్యం, సిగ్గుచేటైన అంశం ఏమంటే ఎన్నికలలో మూడో వంతు సీట్లు మహిళలకు రిజర్వు చేసేందుకు ముందుకు రాని పార్టీలు మరోవైపున నేరచరితులకు పెద్ద పీట వేసేందుకు ముందుకు వస్తున్నాయి.ఎడిఆర్ సంస్థ వెల్లడించిన సమాచారం మేరకు 2019లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో నేర చరితులు 43 శాతం మంది ఉన్నారు. లోక్‌సభలోని 539 మందిలో 233 మంది నేరచరితులు ఉన్నట్లు తేలింది. ఇలాంటి నాయకుల్ని చట్టసభలకు పంపడం బదులు మహిళలకు అవకాశం ఇస్తే వారు కూడా రాజకీయాల్లో రాణిస్తారు కదా అని కూడా దేశంలో చర్చ జరుగుతున్నది. పాలరాతి బొమ్మైనా,పార్లమెంట్ భవన మైనా వాడు కడితేనే ఆకారం, చుడితేనే శ్రీకారం అని అలిశెట్టి ప్రభాకర్ అన్నట్టు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు-2023లో ప్రతి పక్షాల అవిశ్వాస తీర్మానం చర్చకు రాక మునుపే అరగంటలో మూడు బిల్లులను ఎలాంటి చర్చ, ఓటింగ్ లేకుండానే మొన్న శుక్రవారం లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. అలాంటిది ఇప్పుడు బీజేపీ తలచుకుంటే మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అడ్డం పడేదెవరు?

సెల్: 9676407140

> ఎడిఆర్ సంస్థ వెల్లడించిన సమాచారం మేరకు 2019లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో నేర చరితులు 43 శాతం మంది ఉన్నారు. లోక్‌సభలోని 539 మందిలో 233 మంది నేరచరితులు ఉన్నట్లు తేలింది. ఇలాంటి నాయకుల్ని చట్టసభలకు పంపడం బదులు మహిళలకు అవకాశం ఇస్తే వారు కూడా రాజకీయాల్లో రాణిస్తారు కదా అని కూడా దేశంలో చర్చ జరుగుతున్నది.

పదేండ్లుగా పెరగని ఉపకారవేతనాలు

పలుమార్లు కోరినా అవే హామీలు

- జీవో ఉన్నా అమలు చేయని వైనం
- పది రోజులుగా ఆయుష్ పీజీ, హౌస్ సర్జన్ డాక్టర్ల ధర్నాలు
- పట్టించుకోని ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకవైపు వైద్యరంగం అనేక కొలమానాల్లో దేశ, విదేశాల్లో కీర్తిని సంపాదించుకుంటుంది. అదే సమయంలో ఆ రంగంలో వివిధ కేడర్లలో పని చేసే సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు పదే పదే తమ డిమాండ్ల సాధన కోసం నిరసన బాట పడుతున్నారు. అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. వైద్యవిద్యను అభ్యసిస్తున్న వారికి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 15 శాతం చొప్పున ఉపకార వేతనాలు పెంచాలని గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు అల్లోపతి వైద్యవిద్యార్థులకు పెంచినప్పటికీ ఆయుర్వేద, హోమియో, యునానీ, నేచురోపతి తదితర ఆయుష్ వైద్యవిద్యార్థులకు మాత్రం పెంచలేదు. దీంతో పదేండ్ల క్రితం ఉన్న ఉపకార వేతనాలతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి.

ఈ విషయంపై స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ఆ శాఖలోని ఉన్నతాధికారులకు పదే పదే విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. గతంలో వైద్యారోగ్యశాఖ మంత్రులుగా పని చేసిన సీహెచ్.లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్‌తో పాటు ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించుకున్నారు. సరిపోనీ ఉపకారవేతనం, మరో వైపు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ప్రయాణ ఖర్చులు, ఇతర అవసరాలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో 10 రోజుల నుంచి రాష్ట్రంలోని ఆయుష్ విద్యార్థులు ఆయా ఆస్పత్రుల్లో తమ నిరసన తెలిపేందుకు విధులను బహిష్కరించి ధర్నాలు చేస్తున్నారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆస్పత్రి, చార్మినార్ టిబ్బీ యునానీ ఆస్పత్రి, బేగంపేటలోని నేచురోపతి ఆస్పత్రి, రామాంతపూర్‌లోని హోమియో ఆస్పత్రితో పాటు వరంగల్ జిల్లాలోని ఆయుర్వేద ఆస్పత్రిలోని పీజీలు, హౌస్ సర్జన్లు ధర్నా బాట పట్టారు. దాదాపు 600 మంది పీజీలు, హౌస్ సర్జన్లు లేకపోవడంతో ఆయుష్ సేవలకు విఘాతం కలుగుతున్నది.

ఆయుష్ ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో ఎక్కువ మంది దీర్ఘకాలిక రోగులే ఉండటం గమనార్హం. దీంతో చికిత్స అనివార్యంగా చివరి వరకు కొనసాగించే క్రమంలో రెగ్యులర్‌గా వస్తుంటారు. పెద్ద సంఖ్యలో వస్తున్న ఇలాంటి వారికి సేవలందించేందుకు పరిమిత సంఖ్యలో ఉన్న డాక్టర్లపై భారం పడుతున్నాయి. మరోవైపు రోగులకు సకాలంలో వైద్యసేవలందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 10 రోజులుగా ధర్నాలు చేస్తున్నా .... అధికారులు, ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో రోగులు సంకట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఉపకారవేతనాలు చాలక ఆయుష్ వైద్య విద్యార్థులు, మరోవైపు మెరుగైన సేవలు దొరకక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యవిద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



12న చలో హైదరాబాద్‌కు సీబీఐ కోర్టు ఉద్యోగుల మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈ యూ) ఆధ్వర్యంలో ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సీబీఐ కోర్టు, హైదరాబాద్ జిల్లా క్రిమినల్ కోర్టు ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ లోని నాంపల్లిలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం, క్రిమినల్ కోర్టులో చలో హైదరాబాద్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. న్యాయశాఖ ఉద్యోగుల జాతీయ అధ్యక్షులు లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొని మాట్లాడారు. ఈనెల 12న చలో హైదరాబాద్ కార్యక్రమంలో సీబీఐ కోర్టు, క్రిమినల్ కోర్టు ఉద్యోగులు కుటుంబాలతోపాటు పాల్గొంటారని చెప్పారు. పాత పెన్షన్‌లో ఉన్న న్యాయ శాఖ ఉద్యోగులు సైతం వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల్లోపు రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీయస్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోటకొండ పవన్ కుమార్, నవీన్, హేమంత్, జ్ఞాన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈసెట్ కౌన్సెలింగ్‌లో మొదటి విడత సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ద్వితీయ సంవత్సరంలో (లాటరల్ ఎంట్రీ) ప్రవేశాలకు నిర్వహించిన ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్) మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించనుంది. 12,876 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. సీట్ల కేటాయింపు, ఇతర వివరాలకు https://tsecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఇప్పటి వరకూ సమ్మెను విరమించలేదు

- తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెను ఇప్పటి వరకూ విరమించలేదనీ, అది కొనసాగుతుందని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ స్పష్టం చేసింది. సోమవారం ఈ మేరకు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ, కన్వీనర్లు వెంకటరాజం, పి.అరుణ్‌కుమార్, శివబాబు, ఎన్.దాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మెపై జేఏసీ పునరాలోచన చేస్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ముందుకు వస్తుందని మంత్రుల నివాస సముదాయంలో జరిగిన చర్చల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తి చేశారని తెలిపారు. సమ్మె విరమిస్తే ఆర్థిక సంబంధం లేని డిమాండ్లను మూడు,నాలుగు రోజుల్లో హరీశ్‌రావుతో చర్చించి పరిష్కరిస్తామనీ, ఆర్థిక సంబంధమున్న అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీనిచ్చారని తెలిపారు. అవసరమైతే జేఏసీ నేతలను సీఎం కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్తామనీ, సమ్మె విరమించాలని సూచించారని తెలిపారు.

మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించండి

- మంత్రి సబితకు టీజీజేఎల్ఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇంకా మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ గురించి శాసనమండలిలో సానుకూలంగా మాట్లాడినందుకు మంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ త్వరగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కాంట్రాక్టు అధ్యాపకులుగా కొనసాగుతూ అర్థాంతరంగా మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి, పోల్కంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మనోహర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తెగల మధ్య ఘర్షణలకు బీజేపీ కుట్ర

- ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాలను జయప్రదం చేయాలి
- గిరిజన వ్యతిరేక విధానాలపై 9 నుంచి14 వరకు నిరసనలు



నవతెలంగాణ-ముషీరాబాద్

గిరిజన తెగల మధ్య ఘర్షణలు పెట్టడానికి బీజేపీ చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సోమవారం తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు కల్పించిన రాజ్యాంగ హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తోందని విమర్శించారు. మణిపూర్ లో గిరిజనుల హక్కులను కాలరాసి గిరిజనేతర ప్రజలకు హక్కులు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే అల్లర్లను ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన తెగలను చంపుతూ, మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగికదాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా మారణ హోమం సష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లాగానే తెలంగాణలో కూడా గిరిజన తెగల మధ్య వివాదాల కోసం బీజేపీ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. అందుకు ఆ పార్టీ ఎంపీ సోయం బాబురావు వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. ఒకవైపు గిరిజన తెగల మధ్య ఘర్షణలు రేపుతూనే మరోవైపు వాల్మీకి బోయ వంటి 11 ఓబీసీ కులాలను గిరిజన జాబితాలో కలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. భారత రాజ్యాంగం షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులకు కల్పించిన ఆర్టికల్ 371 (ఏ) నుంచి (హెచ్) వరకు, 1/70, పెసా వంటి చట్టాలతో పాటు సంస్కృతి, ఆచారాలను రద్దు చేయడానికే యూని ఫామ్ సివిల్ కోడ్ లాంటి చట్టం తీసుకొస్తున్నదని ఆరోపించారు. అడవులు, అటవీ సంపదను అంబానీ, అదానీలాంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఈ పార్లమెంట్ సమావేశాల్లో అటవీ సంరక్షణ నియమాల బిల్లును చట్టంగా ఆమోదించిందని విమర్శించారు. రాష్ట్రంలో నూ బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన బంధు అమలు చేస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. పోడు భూముల పంపిణీలో అర్హులైన గిరిజనులందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి చెప్పిన విధంగా 11 లక్షల ఎకరాలపై హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ధర్మ నాయక్, నగర నాయకులు గోపీ నాయక్, బాలు, పాండు, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,160	▲ ----
22 క్యారెట్లు	- 55,150	▲ ----
కిలో వెండి	- 78,300	▲ 200



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 93
రిటైల్ (లైవ్)	రూ. 115
స్కిన్‌తో	రూ. 167
స్కిన్‌లెస్	రూ. 190

ఉపాధి చట్టానికి 'హామీ' ఏది?

- డిమాండ్ అధికం... కేటాయింపులు స్వల్పం • తగ్గుతున్న పని దినాలు • అరకొర వేతనాలతో తప్పని అవస్థలు



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించాల్సిందిగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తున్నది. మరోవైపు నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం ఈ చట్టానికి కేటాయింపులను కుదిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సరైన ఉపాధి పొందలేక అర్థాకలితో జీవితాలు నెట్టుకొస్తున్నారు. ఈ చట్టం కింద సంవత్సరానికి కనీసం 100 రోజుల పని కల్పించాల్సి ఉండగా గత సంవత్సరంలో సగటున కేవలం 48 రోజుల పని మాత్రమే కల్పించారు. వాస్తవానికి గత కొన్ని సంవత్స రాలుగా సగటున ఒక్కో కుటుంబానికి యాభై రోజుల పని మాత్రమే దొరుకు తోంది. అటు వేతనాలు కూడా అరకొర గానే లభిస్తున్నాయి. గత సంవత్సరం రోజుకు సగటున రూ. 217.91 వేతనం దక్కగా అంతకుముందు సంవత్సరం కేవలం రూ.208.84 మాత్రమే లభించింది. దీనిని బట్టి చూస్తే మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ పథకాన్ని నీరు కారుస్తున్నదని అర్థమవుతుంది. ఎన్ని ప్రతికూలతలు ఎదురవుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇప్పటికీ ఈ చట్టమే ప్రధాన జీవనాధారంగా కన్పిస్తోంది.

డిమాండ్‌కు కారణమేమిటి?

ఉపాధి చట్టానికి ఎందుకు ఇంత డిమాండ్ ఉంటోంది? ప్రధాన కారణం ఏమంటే మన ఆర్థిక వ్యవస్థ దేశ జనాభాకు చాలినంత ఉపాధి చూపలేకపోతోంది. గత కొన్ని సంవత్సరా లుగా దేశంలో నిరుద్యోగ రేటు 7-9 శాతంగా ఉంటోంది. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ వ్యవసాయమే ప్రధాన ఉపాధి వనరుగా ఉన్నప్పటికీ అది సీజన్‌ను బట్టి మారు తుంటుంది. ఉదాహరణకు వ్యవసాయ పనులు దొరకని వేసవిలో ఉపాధి చట్టానికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉంటోంది. రబీ పంటలు కోసిన తర్వాత వేసవి వస్తుంది. అప్పుడు వ్యవసాయ పనులకు విరామం లభిస్తుంది. జూన్‌లో వర్షాలు పడడం ప్రారంభమైన తర్వాత ఖరీఫ్ సీజన్ వస్తుంది. ఆ సమయంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతుంటాయి. అప్పుడు ఉపాధి హామీ చట్టంలో లబ్ది పొందే వారి సంఖ్య తగ్గిపోతుంది.

కోవిడ్‌లో పట్టణాలు, నగరాల్లో ఉపాధి కోల్పోయిన ప్రజలు

పెద్ద ఎత్తున గ్రామాల బాట పట్టి ఉపాధి హామీ చట్టంలో చేరారు. ఆ సమయంలో ఉపాధి పనుల కోసం ఏ స్థాయిలో డిమాండ్ ఉన్నదో గడచిన జూలై నెలలో కూడా దాదాపు అదే స్థాయిలో డిమాండ్ నెలకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోని మొదటి నాలుగు నెలలలో ... అంటే ఏప్రిల్-జూలై మధ్య కాలంలో ఈ పథకం కింద 9.84 కోట్ల కుటుంబాలు ఉపాధి పొందాయి. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 10% అధికం. 2021లో కోవిడ్ రెండో వేవ్ ముగిసిన తర్వాత ఈ పథకంలో లబ్దిదారులుగా ఉన్న కుటుంబాల సంఖ్య 9.97 కోట్లు.

మరింత ఆదాయం కోసం...

వ్యవసాయ పనులలో అయినా, వ్యవసాయేతర పనులలో అయినా, స్వయం ఉపాధిలో అయినా ఆదాయం తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసుకుంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామీణ కార్మికులకు వాస్తవ వేతనాలు స్థిరంగా ఉండటమో లేదా తగ్గడమో జరుగుతోంది. ఓ సర్వే ప్రకారం దేశంలోని 36.5 కోట్ల మంది కార్మికులలో 61.5% మంది వ్యవసాయంలోనూ, 20% మంది పరిశ్రమలోనూ, 18.5% మంది సేవల రంగంలోనూ ఉపాధి పొందుతున్నారు. 2020 ఏప్రిల్-2021 మార్చి మధ్యకాలంలో దేశంలోని 55% కుటుంబాలు వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధి పొందాయి. రోజువారీ వేతనాలపై 24% మంది పని చేశారు.

గ్రామీణ కుటుంబాలలో నెలవారీ వేతనాలపై పని చేసింది కేవలం 13% మాత్రమే. స్వయం ఉపాధి పొందిన గ్రామీణ పురుషుల నెలసరి ఆదాయం సగటున రూ.10,228 ఉండగా మహిళలకు అందులో సగం కూడా లభించలేదు. పట్టణ ప్రాంతాలలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఆదాయం తక్కువగా ఉండడంతో దానిని పెంచుకునేందుకు ప్రజలు వేర్వేరు పనులు చేస్తున్నారు. అందులో ఉపాధి హామీ చట్టం పనులు ఒకటి.

అరకొర కేటాయింపులే

ఒకవైపు ఉపాధి హామీ పనుల కోసం డిమాండ్ పెరుగుతుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని బలోపేతం చేయడానికి, మరింత విస్తరించడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కేటాయింపులు పెరిగితే లబ్దిదారుల సంఖ్య కూడా పెరిగి, ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుంది. కానీ నయా ఉదారవాద సరళీకరణ విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం ఇలాంటి పథకాలకు సాధ్యమైనంత తక్కువ నిధులు కేటాయిస్తోంది. అదే సమయంలో ప్రైవేటు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు తోడ్పడుతోంది. బడ్జెట్ అంచనాలలో అవసరమైన దాని కంటే తక్కువ మొత్తాన్ని కేటాయిస్తూ ఈ పథకం దానంతట అదే నీరుగారిపోయేలా చేస్తోంది. ప్రభుత్వ కేటాయింపులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పందిస్తూ బడ్జెట్ అంచనాలతో పోలిస్తే సవరించిన అంచనాలు ఎక్కువగానే ఉన్నాయని వివరణ ఇచ్చింది. అయితే 2023-24లో తాము రూ.98 వేల కోట్ల కేటాయింపులను ప్రతిపాదిస్తే ఆర్థిక మంత్రిత్వ శాఖ దానిని రూ.60 వేల కోట్లకు కుదించిందని చెప్పింది. ఈ సమాధానంతో పార్లమెంటరీ కమిటీ సంతృప్తి చెందలేదు. ఇది రొటీన్ సమాధానమేనని పెదవి విరిచింది. ఈ కేటాయింపులు నిరుపేదలైన గ్రామీణ కార్మికులకు ఏ మాత్రం ఊరట ఇవ్వబోవని తెలిపింది.

భారత మాతకు వ్యతిరేకంగా మాట్లాడితే.. వారి ప్రాణాలు తీసేందుకూ వెనకాడం

- బీజేపీ సీనియర్ నాయకుడు

కైలాష్ విజయవర్గీయ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : బీజేపీ సీనియర్ నాయకుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గియా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతమాతకు వ్యతిరేకంగా మాట్లాడేవారి ప్రాణాలను సైతం తీసేందుకు వెనకాడబోమని అన్నారు. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విజయవర్గియా వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. "భారతదేశాన్ని కీర్తించేవారిని 'మేము' అన్నదమ్ములుగా చూస్తాము. కానీ భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి ప్రాణాలను తీయడానికి వెనకాడం" అని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రత్లామ్‌లోని బాంగ్రోట్‌లో పార్టీ కార్యకర్తల కార్యక్రమంలో మాట్లాడుతూ.. "మేము ఎవరికీ ప్రత్యర్థులం కాదు. భారత్ మాతా కీ జై అని చెప్పే వారందరూ మన సోదరులే. వారి కోసం మనం మన ప్రాణాలను అర్పిస్తాం. కానీ, భారత మాతకు వ్యతిరేకంగా మాట్లాడే వారి ప్రాణాలను కూడా తీయడానికి మేము వెనుకడుగు వేయం" అని విజయ వర్గియా చెప్పారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణంపై కాంగ్రెస్ ప్రశ్నలతో అవహేళన చేస్తున్నదన్నారు. రాముడు ఒక ఊహాత్మక మూర్తి అని వాదించే వారందరూ తమ పాపాలను పోగొట్టుకోవడానికి జనవరిలో అయోధ్యకు వెళ్లాలని తెలిపారు. విజయవర్గియావి రెచ్చగొట్టే వ్యాఖ్యలనీ, బీజేపీ తన సిద్ధాంతాన్ని ప్రజలకుపై బలవంతంగా రుద్దేప్రయత్నం చేస్తున్నదనడానికి ఈ వ్యాఖ్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని సామాజికవేత్తలు, మేధావులు తెలిపారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

కలెక్టరేట్ల ఎదుట ధర్నా

- ఏఎన్‌ఎంల భర్తీ నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్
- లేదంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రకటన



నవతెలంగాణ- విలేకరులు

ఎన్నో ఏండ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేయకుండా.. ఏఎన్‌ఎంల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదు. వెంటనే తమను పర్మినెంట్ చేయాలంటూ రెండో ఏఎన్‌ఎంలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు.రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఎన్‌ఎంల భర్తీకి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మద్దతు తెలిపి మాట్లాడారు.ములుగు జిల్లా జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు, డీఎంహెచ్‌ఓకు వినతి పత్రాలు సమర్పించారు. సమస్యలు పరిష్కారం కానిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో మహేష్‌బాబుకు వినతి పత్రం అందించారు.

స్టాఫ్ నర్సు పరీక్ష ప్రాథమిక కీ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం ఈ నెల 2న నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు బోర్డు వెబ్‌సైట్‌లో ప్రిలిమనరీ కీని చూడొచ్చు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల ఏడో తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి తొమ్మిదే తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో తెలపాలని సూచించింది.

గద్దర్ మరణం కలచివేసింది

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ప్రజా గాయకుడు గద్దర్ మరణం తమను కలచివేసిందని మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్లవ సాధనలో జన నాట్య మండలి ఇంచార్జిగా పార్టీకి గద్దర్ అందించిన సేవలు ఎనలేనివని ఆయన అన్నారు. ముఖ్యంగా, నాలుగేండ్ల పాటు అజ్ఞాతంలో ఉండి ఉమ్మడి రాష్ట్రంలో మారుమూల గ్రామాల్లో సైతం జన నాట్య మండలిని విస్తరించటంలో గద్దర్ చేసిన కృషి ఎనలేనిదని ఆయన కొనియాడారు. 2012లో గద్దర్‌ను పార్టీ నుంచి తొలగించటం జరిగిందని తెలిపారు.

నవచిత్రం

దెయ్యానికే కథ చెబితే?

చింతా గోపాలకృష్ణా రెడ్డి సమర్పణలో శతమానం భవతి ఆర్ట్స్ బ్యానర్‌పై సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కథా కేళి'. ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కథా కేళి' మూవీ లోగోను నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. టీజర్‌ను డైరెక్టర్ హరీశ్ శంకర్ రిలీజ్ చేశారు.



హరీష్ శంకర్, దిల్‌రాజు, సతీశ్ వేగేశ్న

ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, 'ఈ టీజర్ చూస్తుంటే సతీశ్ కొత్త ప్రయత్నం చేసినట్టు అనిపించింది. సినిమా విజయం సాధించి అందరికీ మంచి జరగాలని కోరుకుంటు న్నాను' అని అన్నారు. 'ఈ సినిమా టీజర్ చూస్తుంటే సినిమా మంచి పేరు, లాభాలను తెచ్చి పెడుతుందని భావిస్తున్నాను' అని డైరెక్టర్ హరీశ్ శంకర్ చెప్పారు. సమర్పకుడు చింతా గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నాకు కూడా భాగస్వామ్యం కల్పించిన సతీశ్‌కి థ్యాంక్స్' అని తెలిపారు. 'కాన్సెప్ట్ బేస్డ్ సినిమా చేద్దామని చేసిన సినిమానే ఈ కథాకేళి. సాధారణంగా దెయ్యం కథలను అందరూ చెప్పి ఉంటారు. కానీ దెయ్యానికే కథ చెప్పాల్సి వస్తే.. అనేదే మా సినిమా. దిల్ రాజు చెప్పినట్టు డిఫరెంట్‌గా ప్రయత్నం చేసినప్పటికీ నా స్టైల్లో ఫ్యామిలీస్ అందరూ చూసి వారి పాత జ్ఞాపకాలను గుర్తుకు చేసుకునే కథ ఇది. ఇప్పటి యూత్‌కు నచ్చే కథ, అందరినీ నవ్వించే హారర్ కామెడీ ఉంది' అని దర్శకుడు తెలిపారు.



వాల్తేరు వీరయ్యకు మించి హిట్ ఖాయం

చిరంజీవి నటించిన మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈనెల 11న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. నిర్మాతలు అల్లు అరవింద్, టీజీ విశ్వప్రసాద్, ఏఎం రత్నం, దర్శకులు గోపీచంద్ మలినేని, బాబీ, వంశీ పైడిపల్లి, సంపత్ నంది, బుచ్చిబాబు సాన తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడుతూ,'ఖైదీ నెంబర్ 150'లో నాకు నచ్చితేనే చేస్తాను, నాకు నచ్చితేనే చూస్తాను' అనే డైలాగ్ ఉంది. 'భోళా శంకర్' నాకు నచ్చింది కాబట్టే చేశాను. నాకు నచ్చింది కాబట్టే చూశాను. అంతగా నచ్చిన సినిమా మీ అందరితోనూ మార్కులు వేయించుకుంటుందనే ధైర్యంతోనే ఈనెల 11న సినిమాని మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ సినిమా చిత్రీకరణ చాలా ఉత్సాహంగా గడిచింది. ఇంత ఉత్సాహం ఎందుకంటే.. ఈ సినిమా ఆల్రెడీ మా మనసుల్లో సూపర్ హిట్ అయిపోయిందనే ఫీలింగ్ వచ్చేసింది. మెహర్ రమేష్ ఈ సినిమాకి పూర్తి స్థాయి న్యాయం చేశాడు. మణిశర్మ అబ్బాయి మహతి స్వరసాగర్ అద్భుతమైన సంగీతం అందించాడు. అన్ని రకాల పాటలు ఇచ్చారు. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటాడు. నిర్మాత అనిల్ సుంకరకి సినిమా అంటే ప్యాషన్. ఆయనకికి డబ్బు కంటే విజయం ముఖ్యం. 'వాల్తేరు వీరయ్య'కు మించిన హిట్ అవుతుందని ఆకాంక్షిస్తున్నాను' అని అన్నారు.

'ఒక గ్యాంగ్ లీడర్, రౌడీ అల్లుడు ఎలా ఉంటుందో ఈ జనరేష్‌కి అలా ఉండేలా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు మెహర్ రమేష్ అన్నారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ,' చిరంజీవితో సినిమా చేయాలనేది నా కల. అది ఈ సినిమాతో తీరింది. ఈనెల 11న అభిమానులకు గిఫ్ట్ ఇస్తున్నాం' అని చెప్పారు.

ఏటీఎమ్ దొంగల కథ..



కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాగా వైవిధ్యభరితమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది '1134' మూవీ. నూతన దర్శకుడు శరత్ చంద్ర తడిమేటి దీన్ని రాబరీ నేపథ్యంలో బలమైన కథా, కథనంతో తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేసి సినిమాపై హైప్ క్రియేట్ చేశారు మేకర్స్.

2 నిమిషాల 28 సెకనుల నిడివితో ఆద్యంతం ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ఈ ట్రైలర్ కట్ చేశారు. ఏటీఎం దొంగతనాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తుల కథను ఎంతో వైవిధ్యభరితంగా మలిచారని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భారీ డైలాగ్స్ జోలికి పోకుండా కేవలం థ్రిల్లింగ్ సన్నివేశాలతోనే సినిమాపై అంచనాలు పెంచేశారు. ట్రైలర్ చివరలో 'అన్నీ నువ్వనుకునేలా జరిగితే మరి నేనెందుకురా ఇక్కడ' అంటూ వచ్చిన డైలాగ్.. ఈ సినిమాలో ఏదో కొత్త కోణం చూపించబోతున్నారని స్పష్టం చేస్తోంది. నందు మాట్లాడుతూ, 'ఎంత బడ్జెట్‌తో సినిమాను తీశామని కాదు.. కంటెంట్ ఉందా? లేదా? అన్నది ముఖ్యం. ఆ నమ్మకంతోనే శరత్ ఈ సినిమాను తీశాడు. నో బడ్జెట్‌తో తీసిన ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి' అని అన్నారు. 'ఈ సినిమాను మేం ఎంతో ప్యాషన్‌తో నిర్మించాం. జీరో బడ్జెట్, నో బడ్జెట్ సినిమాగా ఈ ప్రాజెక్ట్ చేశాం. ఈ చిత్రానికి సెన్సార్ పూర్తయింది. క్లీన్ యూ సర్టిఫికేట్ వచ్చింది. ఇలాంటి డార్క్ సబ్జెక్ట్‌ను అందరూ చూడాలని ఎలాంటి వల్గారిటీ, బూతులు పెట్టలేదు. అందరినీ ఎంటర్టైన్ చేస్తుంది. ఇప్పుడు జరుగుతున్న స్కామ్‌ల గురించి వివరించాను' అని శరత్ చంద్ర తడిమేటి అన్నారు.

రాంధుని క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కృష్ణ మడుపు, ఫణి భార్గవ్, నర్సింగ్ వాడేకర్, గంగాధర్ రెడ్డి, ఫణి శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ మురళీ కార్తికేయ సంగీతం అందిస్తున్నారు. నజీబ్ షేక్, జితేందర్ తలకంటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.



నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



శాతవాహన వర్సిటీకి రూ.200 కోట్లు కేటాయించాలి

- ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు
- 21న కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు పిలుపు

ఎస్ఎఫ్ఐ పాదయాత్ర ముగింపు

నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

"రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.. ఏ ప్రభుత్వ విద్యాలయంలో చూసినా కనీస సౌకర్యాలు.. సరిపడా బోధనా సిబ్బంది, తరగతి గదులూ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలి.. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి" అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు.

కరీంనగర్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏడు రోజులు సాగిన విద్యార్థి చైతన్య మహాపాదయాత్ర సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. జిల్లాలోని శాతవాహన యూనివర్సిటీకి రూ.200కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 1న కరీంనగర్ జిల్లాలోని వీణవంకలో మొదలైన తమ విద్యార్థి నాయకుల యాత్ర సందర్భంగా విద్యాసంస్థల్లోని ఎన్నో సమస్యలు వెలుగుజూశాయని వివరించారు. వారంపాటు 450కిలోమీటర్లు సాగిన యాత్రలో ఆయా మండలాల్లోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలను అధ్యయనం చేశారని తెలిపారు. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు అరిగోస పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలే రూ.5177కోట్లు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా రాష్ట్రాల్లో నూతన విద్యా విధానం అమలుతో మతపరమైన గొడవలకు విద్యాలయాలు వేదికలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటి పరిష్కారానికి ఈనెల 21న కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు పిలుపునిస్తున్నట్టు తెలిపారు. అప్పటికీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో ప్రగతిభవన్ ఎదుట బైటాయిస్తామని హెచ్చరించారు.

భయాందోళనల మధ్య విద్యార్థులు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్



కరీంనగర్ జిల్లాలో ఏ విద్యాలయాల్లోనూ కనీస సౌకర్యాలు లేవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్ తెలిపారు. శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సరిపడా లేరని, వర్సిటీలో రెగ్యులర్ కోర్సు లేకపోవడంతో పీహెచ్‌డీ చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. కనీసం కొత్త కోర్సులు బీఈడీ, ఎల్ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు కూడా లేవని చెప్పారు. వర్సిటీలో బస్ సౌకర్యం, బ్యాంకు, డిజిటల్ పేమెంటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ సబ్ క్యాంపస్, ఫార్మసీ కాలేజీలో వర్షం వస్తే క్లాస్ రూముల్లోకి పైకప్పు నుంచి నీళ్లు వస్తున్నాయని, వర్షం వచ్చినప్పుడల్లా తరగతులు బంద్ చేస్తున్నారని తెలిపారు. జిల్లాకు ఒక అగ్రికల్చర్ యూనివర్సిటీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ మాట్లాడుతూ.. దేశంలో భారత్ మాతాకీ జై అనే వారే మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారని, నిందితులు దర్జాగా బయటకు వస్తున్న ఘటనలు కండ్ల ఎదుటే కనిపిస్తున్నాయని అన్నారు. యాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు వినీషా రోహిత్, అఖిలాష్, సహాయ కార్యదర్శులు శ్రీజ, మనోజ్, వినయ్, సురేష్, జిల్లా కమిటీ నాయకులు శ్రీవాణి, సందేశ్, సందీప్, రాకేష్, సుదీర్, ఇషాక్, వంశీ, శివ, నవీన్, రాకేష్, రమ్య, హిందూ నితేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

పెరిగిన కిమ్స్ హాస్పిటల్ లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కిమ్స్ హాస్పిటల్స్ 9.3 శాతం వృద్ధితో రూ.86.67 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.79.24 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.500.84 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 21.62 శాతం పెరిగి రూ.609.14 కోట్లకకు చేరింది. 'తొలి త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించాము. సాధారణంగా సీజనల్‌గా బలహీనమైన త్రైమాసికం అయినప్పటికీ.. పలు కీలక పారామీటర్స్‌తో రాణించాం' అని కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బి భాస్కర రావు తెలిపారు. సోమవారం బీఎస్ఈలో కిమ్స్ హాస్పిటల్స్ షేర్ 0.43 శాతం పెరిగి రూ.1,854.85 వద్ద ముగిసింది.

ఎంఆర్ఎఫ్ నుంచి స్టీల్ బ్రేస్ రేడియల్ టైర్లు



చెన్నయ్ : ప్రముఖ టైర్ల తయారీ కంపెనీ ఎంఆర్ఎఫ్ హై ఎండ్ బైక్స్ కోసం ప్రత్యేకంగా స్టీల్ బ్రేస్ రేడియల్ టైర్లను ప్రవేశపెట్టినట్టు వెల్లడించింది. వీటిని అత్యధిక పనితీరు కలిగిన మోటారు సైకిల్స్ కోసం రూపొందించినట్టు పేర్కొంది. స్టీల్ బ్రేస్ రేడియల్స్ అనేవి అత్యంత ప్రత్యేకమైన టైర్లని.. తీవ్ర పరిస్థితుల్లో అసాధారణ పనితీరు కనబర్చుతాయని వెల్లడించింది. రేసింగ్ డిమాండ్లన దృష్టిలో పెట్టుకుని.. అవి వంపులు తిరిగేచోట విశాలమైన కాంటాక్ట్ ప్యాచ్‌తో తగినంతపట్టును కలిగి ఉంటాయని పేర్కొంది.

ఎయిర్‌టెల్ 5జీ వైర్‌లెస్ వైఫై వచ్చేసింది..

న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కో భారతీ ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ఎయిర్‌ఫైబర్ పేరుతో వైర్‌లెస్ 5జీ సర్వీస్‌లను అందుబాటులోకి తెచ్చింది. తొలుత ఈ 5జి టెక్నాలజీ ఆధారిత ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ సేవలను ఢిల్లీ, ముంబయి నగరాల్లో ప్రారంభించింది. దీని ద్వారా ఏకకాలంలో 64 ఫోన్లు లేదా ల్యాప్‌టాప్‌లకు హై స్పీడ్ ఇంటర్నెట్‌ను పొందడానికి వీలుందని ఆ సంస్థ తెలిపింది. ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ఎయిర్‌ఫైబర్ నెలకు రూ.799 ఛార్జ్‌ను నిర్ణయించింది. పరికరం కోసం రూ.2500 అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

ప్లేట్ భోజనం భారం

- నెలలో 34శాతం వ్యయం పెరుగుదల
- శాఖహారంపై టమాట దెబ్బ క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ : శాఖహార భోజనం ప్రియమైంది. ఈ ఏడాడి జూన్‌తో పోల్చితే జులైలో ప్లేట్ అహారం వ్యయం 34శాతం పెరిగిందని ప్రముఖ విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇందులో 25 శాతం టమాట ధరలు పెరగడం వల్లేనని తెలిపింది. జూన్‌లో రూ.33 కిలో ఉన్న టమాట ధర.. జులైలో 233 శాతం ఎగిసి ఏకంగా రూ.110కు చేరింది. క్రిసిల్ సోమవారం విడుదల చేసిన 'ఫుడ్ ప్లేస్' రిపోర్ట్ ప్రకారం.. ప్లేట్ భోజనం వరుసగా మూడుసార్లు పెరిగింది. ఏడాదికేడాదితో పోల్చితే 2023-24లో ఇది చాలా ఎక్కువ. మాంసాహారం థాలీ (ప్లేట్) ధర కూడా పెరిగింది. కానీ నెలవారీగా 13 శాతం తక్కువగా ఉంది. నెలవారీ మార్పు సాధారణ వ్యక్తి వ్యయంపై ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. తృణధాన్యాలు, పప్పులు, బ్రాయిలర్‌లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, వంట నూనె, వంట గ్యాస్‌తో సహా పరిగణనలోకి తీసుకుని థాలీ ధరను లెక్కిస్తుంది. శాఖహార థాలీలో రోటీ, కూరగాయలు (ఉల్లిపాయలు, టమాట, బంగాళదుంపలు), బియ్యం, పప్పు, పెరుగు, సలాడ్ ఉంటాయి. మాంసాహార థాలీలో పప్పుకు బదులుగా చికెన్‌ను పరిగణమలోకి తీసుకుంది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో ఉన్న ఇన్‌పుట్ ధరల ఆధారంగా ఇంట్లో థాలీని తయారు చేయడానికి క్రిసిల్ సగటు ధరను గణిస్తుంది.

ఘాటెక్కిన ఉల్లి, మిర్చి

ఉల్లి, బంగాళదుంపల ధరలు నెలవారీగా వరుసగా 16శాతం, 9శాతం పెరిగాయి. ఇవి జులై ప్లేట్ భోజనం ధరల పెరుగుదలకు మరింత కారణమయ్యాయని క్రిసిల్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. అదే విధంగా మిర్చి, జీలకర్ర ధరలు కూడా వరుసగా 69శాతం, 16శాతం ఎగిశాయి. బ్రాయిలర్ చికెన్ ధర 3-5శాతం మేర తగ్గడంతో మాంసహార థాలీ ధర కాస్తా నెమ్మదిగా పెరిగిందని వెల్లడించింది. వంట నూనెల ధరల్లో నెలకు 2శాతం తగ్గుదల కొంత ఉపశమనం కలిగించిందని తెలిపింది. ఇప్పటికే పెరిగిన టమాట ధరలకు తోడు ఉల్లి మరింత పెరగనుందని గత వారంలో క్రిసిల్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఉల్లి ప్రభావం వచ్చే నెలలో కుటుంబాలపై ఎలా ఉంటుందో వేచి చూడాలి.

మీషోకు తొలిసారి లాభాలు

హైదరాబాద్ : ఈ-కామర్స్ సంస్థ మీషో తొలిసారి భారత్‌లో లాభాలను ప్రకటించింది. ప్రస్తుత ఏడాది జులైలో ఆర్డర్లు పెరగడంతో పాటు వ్యయాలు తగ్గించుకోవడంతో లాభదాయకతను సాధించామని మీషో ఫౌండర్, సీఈఓ విదిత్ ఆత్రేయ్ తెలిపారు. తాము అంచనా వేసినదానికంటే ముందే లాభాలు ఆర్జించినట్టు ఆ సంస్థ పేర్కొంది. గడిచిన 12 నెలల్లో ఆర్డర్లలో 43 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు వెల్లడించింది. ఆదాయంలోనూ 54 శాతం పెరుగుదలను నమోదు చేశామని పేర్కొంది. గడిచిన ఏడాది కాలంలో 140 మిలియన్ల లావాదేవీలు జరిగాయని తెలిపింది.

హైబిజ్ టీవీ బిజినెస్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్ : హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ తొలి ఎడిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను టీఎస్ఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ ఇ వెంకట్ నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ ప్రాజెక్ట్ సీఈఓ వి మధుసూదన్, హైబిజ్ టీవీ, తెలుగు నౌ ఎండీ ఎం రాజగోపాల్, సీఈఓ సంధ్యా రాణి పాల్గొన్నారు. ఈ అవార్డుల ప్రదానం 2023 సెప్టెంబర్ 11న హైటెక్స్‌లో నిర్వహించనున్నారు.

చేనేత వస్త్రాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబాలు : మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చేనేత వస్త్రాలు మన జీవన విధానంతో ముడిపడి, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబి స్తాయని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో చేనేత దినోత్సవం సందర్భంగా 15 రోజుల పాటు నిర్వహించే నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడ, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులను చేనేత వస్త్రాల వైపునకు ఆకర్షించడంతో పాటు వాటి విక్రయాలను పెంచడం, చేనేత రంగాన్ని ప్రోత్సహించడం ఎక్స్‌పో ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా మార్కెట్ కల్పించడానికి ఈ ఎక్స్‌పో ఒక గొప్ప వేదిక అని తెలిపారు. మన నేతన్నల అద్భుతమైన నైపుణ్యం ఆయా వస్త్రాల ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు. నేత కార్మికులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రజలు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ ఎక్స్‌పోలో టీఎస్‌కో ఉత్పత్తులపై 20 నుంచి 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులారా మా రాష్ట్రానికి రండి

- మణిపూర్ విద్యార్థులకు కేరళ ఆఫర్

తిరువనంతపురం: మణిపూర్‌లో చెలరేగిన ఘర్షణలతో విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎంతో మంది విద్యకు దూరమైపోయారు. ఈ నేపథ్యంలో కేరళ చెందిన కన్నూర్ యూనివర్సిటీ మణిపూర్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే ందుకు ముందుకొచ్చింది. అండర్ గ్రాడుయేట్, పోస్ట్ గ్రాడుయేట్ చదవాలనే ఆకాంక్షతో ఉన్న మణిపూర్ విద్యార్థులు తమను సంప్రదించాలని విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్ తెలిపారు.

మణిపూర్ విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం ప్రకటిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ అంశంపై యూనివర్సిటీ సిబ్బందితో చర్చించిన తరువాతే ఏకాభిప్రాయంతోనే, విద్యార్థుల అవసరాలకు తగ్గట్లుగా యూనివర్సిటీ, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తామని వీసీ పేర్కొన్నారు. 'మణిపూర్‌లో విధ్వంసం జరుగుతున్న కారణంగా ఉన్నత విద్య అభ్యసించలేకపోతున్న వారికి యూనివర్సిటీ ప్రత్యేక సీట్లను కేటాయిస్తుంది. వివిధ ప్రోగ్రామ్‌లలో చేరిన వారికి సైతం వసతి కల్పిస్తాం. ప్రవేశం పొందిన విద్యార్థులు వారి విద్యార్హత పత్రాలను సమర్పించడానికి తగినంత సమయం ఇస్తాం. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రవేశం పొందడానికి మణిపూర్ విద్యార్థి ఒకరు ఆసక్తి కనబర్చారని' వీసీ వివరించారు.

మణిపూర్ విద్యార్థులు తమకు ప్రవేశాలు కల్పించాల్సిందిగా దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలను ఇది వరకే సంప్రదించారని కన్నూర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్ తెలిపారు. గత నెలలో మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఓ బాలుడు తిరువనంతపురంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతిలో చేరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ చర్య తరువాతే మణిపూర్ విద్యార్థులు తనతో సంప్రదింపులు చేయడానికి ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. ఇలాంటి మంచి పనులతో కేరళ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని వీసీ పేర్కొన్నారు.

తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలన్నందుకు ఆ ఐఏఎస్‌ను బెదిరించారు

- మహారాష్ట్ర సర్కార్‌పై సీఎం కేసీఆర్ ఆగ్రహం
- తాను అక్కడ కాలు పెట్టాకే విద్యుత్ కోతలు ఎత్తేశారంటూ వ్యాఖ్య
- బీఆర్ఎస్ భయంతో బీజేపీ తోకముడిచిందని ఎద్దేవా
- సీఎం సమక్షంలో షోలాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మోడల్‌ను మహారాష్ట్రలో అమలు చేయాలంటూ కేంద్రేకర్ అనే ఐఏఎస్ అధికారి అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలిచ్చారని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. అది గిట్టని మహారాష్ట్ర సీఎం, మంత్రులు ఆ ఐఏఎస్ అధికారిని పిలిపించుకుని చివాట్లు పెట్టి, బెదిరించి చివరకు ఆయనతో రాజీనామా చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మహారాష్ట్రలో అడుగు పెట్టాక అంతకు ముందున్న విద్యుత్ కోతలు ఎత్తేశారనీ, బీఆర్ఎస్ భయంతో బీజేపీ తోక ముడించిందని కేసీఆర్ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర షోలాపూర్ జిల్లాకు చెందిన పలువురు సర్పంచ్‌లు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అంబానీకి, ఆదానీకి అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు పెంచాలి. పొలాలకాడి మోటర్లకు మీటర్లు పెట్టాలంటూ కేంద్రం వింత చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి వాటని బీఆర్ఎస్ సహించబోదని హెచ్చరించారు. ప్రజలు, రైతులకున్న ఇలాంటి సమస్యలు తొలగించేందుకే బీఆర్ఎస్ మహారాష్ట్రలో కాలు మోపిందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మహమూద్ అలీతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు పాల్గొన్నారు.

ఢిల్లీ బిల్లుకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఎ.డి సింగ్ (ఆర్‌జేడీ), డెరిక్ ఓబ్రెయిన్, సుఖేందు శేఖర్ రాయ్ (టీఎంసీ), ఫౌజియా ఖాన్ (ఎన్‌సీపీ), జావేద్ అలీ ఖాన్ (ఎస్‌పీ), సంజయ్ రౌతు (శివసేన), అనీల్ ప్రసాద్ హెగ్డే (జేడీయూ), జోషి కె.మణి (కేసీఎం), వైకో (ఎండిఎంకె), మహువా మాంఝీ (జెఎంఎం), సస్మిత్ పాత్ర (బీజేడీ), ఎం. తంబిదొరై (అన్నాడిఎంకె), జికె వసన్ (టిఎంసిఎం), సుధాన్షు త్రివేది, రాధా మోహన్ దాస్ అగర్వాల్, మహేష్ జత్మలానీ, ఘనశ్యామ్ తివారీ, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, భూవనేశ్వర్ కలిట, అనిల్ జైన్, సురేంద్ర సింగ్ నగర్, కవితా పటిదర్ (బీజేపీ), కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథ్వాలే (ఆర్‌పీఐ), నామినేటెడ్ ఎంపిలు రంజన్ గొగోయ్, అజిత్ కుమార్ భుయన్ మాట్లాడారు.

దేశ ప్రజలు మాకు అధికారం, హక్కు ఇచ్చారు.. అమిత్ షా

బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సమాధానమిస్తూ, సుప్రీంకోర్టు ఉత్తర్వులను బిల్లు ఉల్లంఘించలేదని అన్నారు. ఢిల్లీలో ఎలాంటి అవినీతికి తావులేని పాలన అందివ్వడం, అవినీతిపై పోరాటమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఢిల్లీలో పోస్టింగుల బదిలీల విషయంలో గతంలో ఎలాంటి గొడవులు లేవని, ముఖ్యమంత్రులతో ఎలాంటి సమస్యలు ఉండేవి కావని అన్నారు. 2015లో ఒక ఆందోళన తరువాత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కేంద్రం తమ హక్కులను లాక్కోవాలని చూస్తోందంటూ కొందరు మాట్లాడారని అన్నారు. అయితే ఆ విధంగా చేయాల్సిన పని కేంద్రానికి లేదని, దేశ ప్రజలు తమకు అధికారం, హక్కు ఇచ్చారని చెప్పారు. ఈ బిల్లు స్పష్టమైన చెల్లుబాటని పేర్కొంటూ మాజీ సుప్రీం కోర్టు సీజేఐ, ఎంపీ రంజన్ గొగోయ్ ప్రసంగం చేస్తున్న సమయంలో సమాజ్ వాదీ పార్టీ నుంచి జయా బచ్చన్ , శివసేన (యూబీటీ) నుంచి ప్రియాంక చతుర్వేది, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నుంచి వందనా చవాన్, టీఎంసీ ఎంపీ సుస్మితా దేవ్ రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఇప్పటికే ఈ బిల్లు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది.

మొరాయించిన రాజ్యసభ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు

బిల్లుపై ఓటింగ్‌కు ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా, డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ అనుమతించారు. అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియ జరపాలని రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌కు సూచించారు. అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించడంతో చిట్టీలతో ఓటింగ్ నిర్వహించారు.

విద్వేష కలక

(మొదటిపేజీ తరువాయి)

శక్తులు విజృంభించి విద్వేషాలను రెచ్చగొడుతుంటే...అవి ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి వేగంగా వ్యాప్తి చెందుతూ మత సామరస్యాన్ని దెబ్బ తీస్తుంటే కండ్ల కలక వచ్చిన వారి మాదిరిగా కండ్లు మూసుకొని తమకేమీ పట్టనట్లు చూస్తూ కూర్చుంటున్నారు. దేశంలో దారుణాలు జరుగుతుంటే వాటికి అడ్డుకట్ట వేయాల్సింది పోయి మొసలి కన్నీరు కారుస్తూ అచేతనంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు మణిపూర్‌లోనూ, ఇటీవల హర్యానాలోని నూహ్‌లోనూ మతోన్మాదం పెచ్చరిల్లితే చిద్విలాసంగా చూస్తూ మిన్నకుండిపోతున్నారే తప్ప చట్టసభలో కనీసం నోరు విప్పలేకపోతున్నారు. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ సైతం కండ్ల కలక సోకిన వ్యక్తి మాదిరిగా ప్రవర్తించడం విచారకరం. దేశంలో మతాలు, జాతుల మధ్య మారణహోమం సాగుతుంటే కండ్లు ఉండీ చూడలేకపోతున్నారు. ఇప్పటి వరకూ పార్లమెంటులో కనీసం ప్రకటన కూడా చేయలేకపోయారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో అనర్గళంగా ఉపన్యాసాలు ఇస్తున్న ప్రధాని, దేశంలో చెలరేగుతున్న హింసపై మాత్రం మౌనం వీడడం లేదు. పెదవి విప్పకపోవడానికి కారణం...జరుగుతున్న దారుణాలకు ఆయన వద్ద సమాధానం లేకపోవడమే. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, కీలక నేతలు సైతం ఆయన మార్గాన్నే అనుసరిస్తున్నారు. రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో పర్యటించి, అనేక ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విసుగూ విరామం లేకుండా హాజరవుతున్నారు. కొత్త రైళ్లకు పచ్చ జెండాలు ఊపి ప్రారంభిస్తున్నారు. పార్లమెంటులో మాత్రం ప్రతిపక్షాలను ఎదుర్కోలేక తడబడుతున్నారు. మోడీ భయపడుతున్నాడు. ప్రతిపక్షమన్నా, పార్లమెంటన్నా, ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నా అతనికి భయం. క్లిష్టమైన సమస్యలు తలెత్తిన ప్రతిసారీ పలాయనం చిత్తగిస్తారు. అవును తప్పులు చేసే వాడికి భయం ఎక్కువ కదా..! కండ్లలో విచ్ఛిన్నకలకలేర్పడినా కండ్లు కనపడవు. విద్వేషం చిమ్మే కండ్లు మూసుకుపోతాయి.

ఇలాంటి దుర్మార్గమైన సీఎంను చూడలేదు

- కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌తో ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ధరణిని సీఎం సమర్థించుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గమైన సీఎం తాను చూడలేదని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ధరణి ఎత్తేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్నదని నిజమే కానీ ఐదేండ్ల నుంచి ధరణిపై ఎన్నడూ మాట్లాడని కేసీఆర్ ఇప్పుడే ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. డిఫాల్టర్ అయిన కంపెనీకి ఇంత కీలకమైన ధరణి బాధ్యత ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. భూములు సర్వే చేయాలనీ, టైటిల్ గ్యారంటీ చట్టం చేయాలంటూ కేంద్రం చెబుతుంటే అవి చేయకుండా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడమేంటని ప్రశ్నించారు.

మెరిసిన పేదింటి ఆణిముత్యాలు

- తాపీమేస్త్రీల ఇండ్లల్లో వెలుగులు
- ఎస్ఐ ఫలితాల్లో 46, 56వ ర్యాంకులు
- తల్లిదండ్రుల కల సాకారం చేసిన సతీష్, తేజస్విని



నవతెలంగాణ-వేములపల్లి

పేదరికం, పల్లెటూరు, కుటుంబ నేపథ్యం.. ఇవేమీ ప్రతిభకు అడ్డుపడలేదు.. పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించొచ్చని నల్లగొండ జిల్లా వేములపల్లి మండలానికి చెందిన సతీష్, తేజస్విని నిరూపించారు. తాజాగా వెలువడిన ఎస్ఐ ఫలితాల్లో మెరిసిన పేదింటి ఆణిముత్యాలు ఇద్దరు తాపీ మేస్త్రీల ఇండ్లల్లో వెలుగులు నింపాయి. మండలంలోని సల్కనూర్ గ్రామం దళిత కుటుంబానికి చెందిన అంకెపాక తేజస్విని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివింది. సూర్యాపేటలో ఇంటర్, మిర్యాలగూడలో డిగ్రీ పూర్తి చేసింది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ చేస్తూ.. ఎస్ఐ కావాలన్న లక్ష్యంతో పట్టుదలతో చదివి 56వ ర్యాంకు విజయం సాధించింది. అదేవిధంగా మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన కన్నెబోయిన సతీష్ స్వగ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైమరీ చదువులు ముగించుకొని రావులపెంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి, మిర్యాలగూడ జేఎంరెడ్డిలో ఇంటర్ పూర్తి చేశాడు. హైదరాబాద్ బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదివాడు. ఓపెన్ కేటగిరిలో 46వ ర్యాంకుతో సివిల్ ఎస్ఐగా విజయం సాధించాడు. ఇరువురివి నిరుపేద కుటుంబాలు. తేజస్విని తండ్రి అంకె పాకబాబు తాపీ మేస్త్రిగా, తల్లి రాణి వీవోఏగా పనిచేస్తున్నారు. సతీష్ తండ్రి కన్నెబోయిన రమేశ్ స్థానికంగా తాపీ పని, తల్లి కూలి పనికి వెళ్తారు. తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలని, వారి కలను సహకారం చేయాలని పట్టుదలతో విజయం సాధించామని అభ్యర్థులు చెబుతున్నారు. వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

నవతెలంగాణ-మహాదేవపూర్

గృహలక్ష్మి ఇండ్ల నిర్మాణానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి జనం బారులు తీరారు. దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. సొంత జాగా ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇవ్వడంతో ప్రజలు దరఖాస్తులు పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. దరఖాస్తుల కౌంటర్ వద్ద భారీగా జనం గుమిగూడారు.

దురుద్దేశంతోనే...

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్నానని అన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరపున కేశవరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతారని, తాను ఏ పార్టీలో ఉన్నా రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ బిల్లుపై లోక్‌సభలో వివరణాత్మకంగా చర్చ జరిగిందని, కానీ కేంద్ర హోం మంత్రి సమాధానం మాత్రం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. తాము ఇండియా కూటమిలో భాగం కాదని, అయితే దేశం ప్రమాదంలో ఉంటే (సరిహద్దుల్లోలా) శత్రువుకు వ్యతిరేకంగా అందరం ఐక్యం అవుతామని అన్నారు. ఇప్పుడు మా శత్రువు రాజ్యాంగాన్ని హననం చేస్తుందని, కనుక దానికి వ్యతిరేకంగా ఉన్నామని తెలిపారు. ఇది రాజ్యాంగ అంశమని, రాజకీయ అంశం కాదని పేర్కొన్నారు.

దురదృష్టవశాత్తూ రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది సుప్రీం కోర్టు పరిశీలనలో ఉందని, మరికొన్ని రోజులు వేచి చూడాలని అన్నారు. ఈ బిల్లు చాలా తీవ్రమైనది కనుక ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఎవరైనా అవినీతి చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలి, కానీ రాజ్యాంగం జోలికెందుకు వస్తారని విమర్శించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన కూడా తరువాత, సుప్రీం కోర్టు చివరి రోజున కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని విమర్శించారు. చట్ట శాసన కర్తలుగా చర్చించి మంచి బిల్లును ఆమోదించి, నష్టం చేసే బిల్లులను పక్కన పెట్టేయాలని అన్నారు.

రాజ్యాంగ విలువలు లేకపోతే ఇంకెందుకని ప్రశ్నించారు. ఎన్నికైన ముఖ్యమంత్రి, ప్రభుత్వం మొత్తం అధికారాలను బ్యూరోక్రసీకి ఇవ్వడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటారని, బ్యూరోక్రాట్లు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండరని అన్నారు. అసలుసిసలైన ప్రజాస్వామ్యంలో బ్యూరోక్రసీకి స్థానం లేదని, ఈ బిల్లు ప్రజాస్వామ్యానికి నష్టం చేస్తుందని అన్నారు. ఈ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

నియంతృత్వానికి ప్రతిబింబం

- సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ బిల్లు ఆమోదంతో ప్రజలు ఎన్నుకున్న ముఖ్య మంత్రి తోలుబొమ్మగా మారుతారని సీపీఐ(ఎం) రాజ్యసభ నేత బికాష్ రంజన్ భట్టాచార్య అన్నారు. ఢిల్లీ బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో సీపీఐ (ఎం) తరపున బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడారు. ఈ బిల్లు ను చూస్తే నాగరికత వెనక్కి వెళ్తున్నట్లుందని అన్నారు. రాజ్యాంగ అసెంబ్లీలో పరిపాలన పాత్రపై చర్చించినట్లు అందరికీ తెలుసని, గవర్నర్ మరొక అధికార కేంద్రం కాకూడదని నిర్ణయించారని తెలిపారు. ఎన్నికైన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల సలహాలను గవర్నర్ అమలు చేయాలనేది ప్రాథమిక సూత్రమని అన్నారు. రాజ్యాంగంలో సమాఖ్య వ్యవస్థ ఉందని తెలిపారు. రాజ్యాంగంలో ఢిల్లీ రాష్ట్రం కాదని, అది కేంద్ర పాలిత ప్రాంతమని అన్నారు. అయినప్ప టికీ హేతుబద్ధంగా ఢిల్లీ రాష్ట్రమని, దానికి కొన్ని అధికారా లు ఉన్నాయని తెలిపారు. పరిపాలించే హక్కు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఉందని, ఇది రాజ్యాంగం సవరణ 239 ఎఎ స్పష్టం చేస్తుందని అన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధుల కు జవాబుదారీతనంగా గవర్నర్, బ్యూరోక్రసీ ఉండాలని, ఇదే రాజ్యాంగ నైతికత అని తెలిపారు. ఈ పార్టీ, ఆ పార్టీ అన్నది సమస్య కాదని, ఇది ప్రజాస్వామ్య గణతంత్రమని అన్నారు. అది స్వాతంత్ర్య పోరాట ఫలితమని పేర్కొన్నారు. కొంత మంది స్వాతంత్ర్య పోరాట వారసత్వం లేని వాళ్లు భిన్నంగా ఆలోచిస్తారని తనకు తెలుసన్నారు. స్వాతంత్ర్య పోరాటం, ప్రాణ త్యాగాల ఫలితమే ప్రజా ప్రభుత్వమని అన్నారు. కొంత మంది బ్రిటీష్ వారికి లొంగిపోయిన వాళ్ల గురించి కాదని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ అధికారం గురించి ఎవ్వరూ ప్రశ్నించటం లేదని, అయితే అధికారం వివేకంతో కూడుకొని ఉండాలని అన్నారు. వివేకంతో లేని అధికారం రాజ్యాంగానికి విరుద్ధంగా, నిరంకుశంగా మారు తుందని పేర్కొన్నారు. ప్రజలకే అంతిమ నిర్ణయం ఉంటుం దని తెలిపారు. ఈ బిల్లు నియంతృత్వాన్ని ప్రతిబింబిస్తుం దన్నారు. తనకు నచ్చిన బ్యూరోక్రాట్‌ని నియమిస్తే, ఆయన ప్రజా ప్రభుత్వాన్ని నియంత్రిస్తాడని పేర్కొన్నారు. ఈ బిల్లు లో పూర్తిగా ఆధునిక మానవత్వం కొరవడిందని అన్నారు. ప్రజాస్వామ్యమంటే అధికారాల పంపిణీ అని, అధికార కేంద్రీకరణ కాదని స్పష్టం చేశారు. ఈ బిల్లు వల్ల ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి తోలుబొమ్మగా మిగిలిపోతారని, ముఖ్యమంత్రిని బ్యూరోక్రాట్ నియంత్రిస్తాడని అన్నారు. చిల్లర రాజకీయాలు మాని అందరూ ఈ కీలకమైన పరిస్థితి అర్థం చేసుకోవాలని రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. రేపు ఒడిశా గవర్నర్‌కు సబ్ సర్వెంట్‌గా ఒడిశా సీఎం, ప్రభుత్వం ఉండాలని బిల్లు ఆమోదిస్తారా? అప్పుడు ఏం చేస్తారని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ కంచుకోట ఉమ్మడి కరీంనగర్

- అన్ని సర్వేలు, నివేదికల్లో స్పష్టంగా బీఆర్ఎస్ ఆధిక్యత
- ఈసారి అన్ని సీట్లలో జయకేతనం
- ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ కంచుకోట అని బీఆర్ఎస్ కంచుకోట ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 2001లో పార్టీ ఏర్పాటుచేసినప్పటి నుంచి తిరుగులేని ఆధిక్యంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. నాటి నుండి నేటి వరకూ జిల్లా ప్రజలను మమేకం చేస్తూ తీసుకున్న ప్రతీ కార్యక్రమం విజయవంతం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా పనిచేస్తుందనీ, తాజా సర్వేల్లోనూ, అన్ని నివేదికల్లోనూ ఈసారి ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎదురులేదని స్పష్టమైందని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు, వివిద కార్యక్రమాలు నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ రూపకల్పనకుగాను మంత్రి కేటీఆర్ సోమవారం అందుబాటులో ఉన్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులతో హైదరాబాద్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్ఎస్ కంచుకోట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రౌండ్ క్లియర్గా ఉందని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభలో వ్యక్తిగత డేటా బిల్లు ఆమోదం

- మరో నాలుగు బిల్లులు కూడా...
- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఐదు బిల్లులు ఆమోదం పొందాయి. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే మణిపూర్‌పై ప్రతిపక్షాలు ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. నినాదాల హెూరెత్తించారు. అలాగే అధికార పక్షనేతలు కూడా నినాదాలు ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్షాల నినాదాల మధ్యే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. అయితే గందరగోళం కొనసాగడంతో రెండు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళన కూడా కొనసాగింది. మరోవైపు స్పీకర్ చైర్‌లో ఉన్న ప్యానెల్ స్పీకర్ కీర్తి ప్రేమ్‌జీ సోలంకి బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే అవకాశం ఇచ్చారు. ఆయన న్యూస్ క్లిక్ సంస్థ, కాంగ్రెస్, చైనా వంటి నిరూపితంకాని, ఆధారాలు లేని న్యూయార్క్ టైమ్స్ రాసిన కథనం గురించి లేవనెత్తారు. వెంటనే అధికార పక్ష ఎంపీలు లేచి నినాదాలు, అరుపులతో తీవ్ర గందరగోళాన్ని సృష్టించారు. వెంటనే మూడు నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. వరుసగా ఐదు బిల్లులను ఆమోదించుకున్నారు. ఇందులో కీలకమైన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుతో పాటు తీర ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు, అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు, ఫార్మసీ (సవరణ) బిల్లు, మధ్యవర్తిత్వ బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. మరోవైపు రాజ్యసభలో మణిపూర్ కాలిపోతుందని ప్రతిపక్షాలు లేవనెత్తాయి. అలాగే మణిపూర్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలు నినదించాయి. దీంతో ప్రారంభం అయిన 14 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 2 గంటలకు చైర్మెన్ జగదీప్ ధన్కర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఢిల్లీ పౌర సేవల సవరణ బిల్లుపై చర్చ జరిగింది. బిల్లు ఆమోదం పొందింది.

ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన గద్దర్

- సీపీఐ(ఎం) నేత పి. నాగేశ్వర్



నవతెలంగాణ - ధూల్ పేట్

జీవితాంతం ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన ప్రజా కళాకారుడు గద్దర్ అని సీపీఐ(ఎం) నేత పి. నాగేశ్వర్ అన్నారు. మహారాజ్ గంజ్, కిషన్ గంజ్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్మికులు, ప్రజలతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ సామాన్య ప్రజల కష్టాలు, ఇతివృత్తంగా తన రచనలు, పాటల, కళారూపాల ద్వారా జీవితాంతం కషిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, జంగయ్య, చెన్నయ్య, గంగపురి, సాయిలు, నర్సింహ, కుర్మయ్య, సవప్ప, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు కన్నీటి వీడ్కోలు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

యాకుత్ పురా నియోజకవర్గం పరిధిలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ వి ఎస్ బోస్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, సీపీఐ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, స్టాలిన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్య దర్శి వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ నెంబర్ హరీఫ్ ఖాన్ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కొమరెల్లి బాబు, జంగయ్య, ఏఐటీయూసీ టూరిజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమౌళి, ఏ ఐ ఎస్ ఎఫ్ కళ్యాణ్, సిపిఐ హైదరాబాద్ సిటీ కౌన్సిల్ నెంబర్ మొహమ్మద్ ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన బాక్స్ డ్రయినేజీ నిర్మాణ పనులు

- అవస్థల్లో నాగోల్ డివిజన్ ప్రజలు

నవతెలంగాణ-నాగోల్

గత రెండు మూడు సంవత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ముంపునకు గురి కాకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కింద నాగోల్ డివిజన్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టింది. అయితే నిర్మాణ పనుల్లో వేగవంతం లేక నత్త నడకన పనులు జరుగుతుండడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొం టున్నట్లు నాగోల్ డివిజన్ ప్రజలు వాపోతున్నారు.

బాక్స్ డ్రయినేజీ పనులు ఆరు మాసాలలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తెచ్చి వరద ముంపునకు గురి కాకుండా కాపాడు తామని బాక్స్ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. కానీ పనులు ప్రారంభమై సంవత్సరం ఆరు మాసాలు గడిచిపోతున్నా పూర్తి స్థాయి పనులకు నోచుకోక వరద ముంపునకు గురికాక తప్పడం లేదంటూ డివిజన్‌లోని నాగోల్ గ్రామం, మమతా నగర్ కాలనీ, గ్రీన్ ఫీల్డ్ కాలనీ, వెంకటరమణ కాలనీల ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఆయా కాలనీల్లో బాక్స్ డ్రయినేజీ కోసం రోడ్లను తొలగించి సుమారు పది ఫీట్ల వరకు గోతులను తవ్వి బాక్స్ డ్రయినేజీ నిర్మాణాలు చేపట్టారు. కానీ చేపట్టిన నిర్మాణ పనుల్లో వేగవంతం లేక ఒక వైపు తాగునీరు సరఫరా లేక, మరోవైపు ప్రవహిస్తున్న డ్రయినేజీ మురుగు నీటితో పాటు తమ ఇండ్ల నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లలేక తీవ్రమైన ఇబ్బందుల గురికావాల్సి వస్తున్నదని ప్రజలు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. బాక్స్ డ్రైన్స్ నిర్మాణాలకు రోడ్లు తొవ్వడంతో తాగునీటి సరఫరా పైప్ లైన్లు కూడా అక్కడక్కడ పగిలిపోయి లీకేజీలు అవుతున్నాయి. దీంతో



ఒకవైపు వర్షపు నీరు ,ఆ పక్కనే డ్రయినేజీ నీరు పారడంతో ఎక్కడ తాగునీటిలో కలుషితమై ఏ ప్రమాదం మంచుకొస్తుందోనని డివిజన్‌లో ఆయా కాలనీలా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలలో లోతైన గోతులు ఉండడంతో వాటికి భద్రత రక్షణలు లేకపోవడంతో రాత్రి వేళలో అటుగా వెళ్లేవారు ఏ మాత్రం మైమరిచినా గోతిలోకి పడి ప్రమాదాలు గురికావల్సొస్తుందోనని పలువురు అంటున్నారు. ఆదివారం సాయంత్రం మమతా నగర్ రోడ్డు నెంబర్



నాలుగులో ఒక వృద్ధుడు అటుగా వెళ్తూ కాలుజారి పడిపోవడంతో అక్కడున్న వారు చూసి వెంటనే వృద్ధిన్ని గోతిలో నుండి పైకి లాగారు. దీంతో వృద్ధుడు కాళ్ళకు చేతులకు స్వల్ప గాయాలతో బయట పడినట్లు తెలిసింది. అంతేకాకుండా గోతులు తవ్వడం తోఅనారోగ్యాలకు గురై అత్యవసర పరిస్థితులు నెలకొంటే కనీసం ఇంటి ముందరకు ఎటువంటి వాహనం కూడా రాలేని పరిస్థితులు దాపరిచాయని డ్రయినేజీ నిర్మాణం పనులు జరుగు తున్న పరిసర ప్రాంత కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.

తమ కాలనీలో అభివృద్ధి చెందుతుందంటే అందరం సహ కరిస్తూ, స్వాగతిస్తాం కానీ చేస్తున్న పనులలో వేగవంతం లేకపోవడం, నెలలు తరబడి ఇబ్బందులు గురవుతూ ఉండడం ఎంతవరకు న్యాయం అని ప్రజాప్రతినిధులకు, అధికారులకే తెలియాలని పలువురు అంటున్నారు. వివిధ పార్టీల రాజకీయ నాయకులు వచ్చి సందర్శించడం పాలక పక్షాలను విమర్శించడం తప్ప అధికారులపై ఒత్తిడి తెచ్చి చేపట్టింది ఏమీ లేదని వ్యక్తం



పోల్కంపల్లిలోని మూడెకరాల భూమి పేదలకు దక్కాలి



- మా భూమి మాకే కావాలంటూ కదం తొక్కిన పోల్కంపల్లి గ్రామస్తులు
- ధర్నాను అడ్డుకున్న పోలీసులు
- మంగళపల్లి నుంచి పాదయాత్రతో ఆర్డీవో కార్యాలయం చేరిన గ్రామ ప్రజలు
- ఆర్టిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-తుర్కయాంజల్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 176లో 3 ఎకరాల భూమిని ప్రజలందరికీ పంచాలని సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో సోమవారం తుర్కయాంజల్ లోని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నాకు బయలుదేరిన ప్రజలను రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన ఉందని నెపంతో అడ్డుకున్నప్పటికి పోల్కంపల్లి గ్రామ ప్రజలు మంగళ్ పల్లి నుంచి ఆర్డీవో కార్యాలయం వద్ద వద్దకు పాదయాత్ర చేసి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొడ సామేల్ మాట్లాడుతూ సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆనాడు పోరాడి సాధించి 60 ఎకరాల భూమిని గ్రామ ప్రజలందరికీ పంచగా మిగిలిన మూడు ఎకరాల భూమిని పార్టీ ప్రజల అవసరాల రీత్యా ఉంచగా అట్టి భూమిని ఆనాటి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేరంగుల నరసింహ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయటం జరిగిందన్నారు. ఆయన బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన తర్వాత ఈభూమి తనేదేనంటూ ప్రజలను మోసం చేస్తున్నాడని, అట్టి భూమిలో గత 30సంవత్సరాల నుంచి గ్రామానికి చెందిన దాదాపు 500 కుటుంబాలు సాగుచేసుకుంటున్నాయని తెలిపారు. అట్టి భూమిని ఎలాగైనా కాజేయాలని దుర్బుద్ధితో ఇందులో సగం భూమిని తన కుమారుడైన దేరంగుల రాజు పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. ఈ భూమిని ప్రజలకు పంపిణీ చేయాలని పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేను కలిసినా కనీసం స్పందించటం లేదని వాపోయారు. ఇట్టి భూమి విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని డి.నర్సింహ్మా , డి.రాజుల పేరుమీద ఉన్న భూమిని వెంటనే గ్రామంలోని పేదలకు పంపిణీ చేసేటట్టు చూడాలని అన్నారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికావడం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, మండల కార్యవర్గ సభ్యులు పీ జగన్, మండల కమిటీ సభ్యులు ఎ.వెంకటేశ్, సీహెచ్ నర్సింహ, ఎం యాదగిరి, శాఖ కార్యదర్శులు జీ అశోక్, ఎ.నర్సింహ్మ, పి వెంకన్న, పి స్వామి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి గడ్డం గణేష్, మండల కార్యదర్శి పి దనేశ్వర్, సీపీయం నాయకులు కె.ఇస్తారీ, జీ నర్సింహ, కర్ణాకర్ రెడ్డి, బాల్ రాజ్, యాదయ్య , తదితరులు పాల్గొన్నారు.

'మహేశ్వరం' అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు

- మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజకవర్గం అభివద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పిం చేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మంత్రి మాట్లా డుతూ గత నెలలో జరిగిన హరితహారం కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వాగ్దానం నేడు కార్యరూపం దాల్చటం హర్ష నీయమన్నారు. నియోజకవర్గ అభివద్ధికి రూ.160.90కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. బడంగ్ పేట్,మీర్ పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున, జల్ పల్లి, తుక్కుగూడ మున్సి పాల్టీలకు రూ.25 కోట్ల చొప్పున,మహేశ్వరం,కందుకూరు మండలాల్లోని 66 గ్రామాలకు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 15 లక్షల చొప్పున రూ.9 కోట్ల 90 లక్షల నిధులు విడుదల చేసినట్టు తెలిపారు.తుమ్మలూరు గ్రామంలో దశాబ్ది కమ్యూనిటీ హల్ నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు, ఇప్పటికే సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. గతానికి భిన్నంగా అభివృద్ధి పనులకు నేడు బాటలు పడుతున్నాయని, ప్రభుత్వం వాగ్దానం చేస్తే మరొక ప్రభుత్వం నిధులు విడు దల చేస్తే ఆ తర్వాతి ప్రభుత్వాలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఇతర ప్రభుత్వాల హయాంలో జరిగేవి అన్నారు. నేడు వాటికి భిన్నంగా స్వరాష్ట్రంలో అభివద్ధి కొత్త పుంతలు తొక్కుతోందని, వాగ్దానం, నిధుల మంజూరు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సైతం స్వల్ప కాల వ్యవధిలో జరుగుతుండటం ముఖ్యమంత్రి కేసీఆర్ మార్క్ పాలనకు నిదర్శనంగా చెప్పవచ్చారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అభివద్ధి పనులు శరవేగంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు.

నేడు ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

నవతెలంగాణ- చైతన్యపురి

ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ఆవిర్భావ సభను మంగళవారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర మీడియా కో కన్వీనర్ కార్తీక్ మహారాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవనం నుంచి ఎల్బీనగర్ మీదుగా జగ్జీవన్ రామ్ భవనం వరకు బైక్ ర్యాలీ ఉంటుం దన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహరాజ్ హాజరవుతున్నట్లు చెప్పారు.

చేనేత కలలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ -నాగోల్



మన అస్తిత్వానికి అసలైన గుర్తింపునిచ్చేవి చేనేత వస్త్రాలేనని, అపురూపమైన చేనేత కలలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన సోమవారం చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ సోమవారం చేనేత వస్త్రాలు ధరించి చేనేత సోదరుల ఆర్థిక అభివద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో బి.ఆర్.ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి కే.టి.ఆర్ పిలుపుమేరకు తనతోపాటు తమ కార్యకర్తలు, అభిమానులు ఆ రోజు చేనేత వస్త్రాలను ధరిస్తున్నట్టు తెలిపారు. దీంతో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలపై ఆసక్తిని చూపుతూ వాటిని ధరిస్తూ చేనేత కార్మిక సోదరుల ఆర్థిక అభివద్ధికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేనేత రంగానికి పెద్ద పీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఫోన్ స్నాచింగ్ నిందితుల అరెస్టు

- నాలుగు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం



నవతెలంగాణ-వనస్థలిపురం

ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి వారి ముందు వాహనంపై వెళుతున్న వారి వద్ద నుంచి సెల్ ఫోన్ స్నాచింగ్ చేసిన ఇద్దరు నిందితుల్ని పోలీసులు చాకచక్యంగా వల పన్ని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసు కున్నారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శ్రీకష్ణదేవరాయ నగర్ రోడ్ నెంబర్ 9 లో నివసిస్తున్న జగ్గు గణేష్, సాగర్ కాంప్లెక్స్ శ్రీపురం కాలనీకి చెందిన దేవరపల్లి శివ ఇద్దరు కలిసి సెల్ ఫోన్ స్నాచింగ్ చేయాలని పథకం పన్నారు. ఈ మేరకు ఈనెల 5వ సాగర్ కాంప్లెక్స్ నుంచి తన ద్విచక్ర వాహనంపై రాజు అనే వ్యక్తి తమ స్నేహితులతో కలసి వెళ్తుండగా వారి వాహనం వెనుక నుంచి అతి వేగంగా ఎంఈ 4 జేఎఫ్ ఎన్‌జీ 072406 నెంబర్ గల స్కూటీపై వచ్చిన నిందితులు సెల్ ఫోన్ స్నాచింగ్ చేసి పారిపోయారు. బాధితుడు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు కోసం వేట ప్రారంభించారు. సోమవారం బీఎన్ రెడ్డి నగర్ చౌరస్తాలో ద్విచక్ర వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా అనుమాన స్పంద స్థితిలో కనిపించిన నిందితులు గణేష్, శివలను పోలీసుల అదుపులోకి తీసుకుని విచారించారు. సెల్ ఫోన్ స్నాచింగ్ చేసినట్టు నిర్ధారణ కావడంతో వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో వనస్థలిపురం డిటెక్టివ్ వెంకట్ నేతత్వంలో క్రైమ్ సిబ్బంది సెల్ ఫోన్ స్నాచింగ్ నిందితులను అదుపులోకి తీసుకోవడానికి కషిచేసిన క్రైమ్ హెడ్ కానిస్టేబుల్స్ కరణ్, యాదగిరి, క్రైమ్ కానిస్టేబుల్ యూనిస్ లను డీసీపీ సాయి శ్రీ అభినందించారు. వనస్థలిపురం ఏసీపీ భీం రెడ్డి ముగ్గురుకి రివార్డులను అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, వనస్థలిపురం డిటెక్టివ్ సీఐ వెంకట్, ఎస్సై నర్సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది చేతల ప్రభుత్వం.. చేనేతల ప్రభుత్వం



- నేతన్నలకు కేసీఆర్ ఒక భరోసా
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని అనంతవేణి నగర్ కాలనీ నందు శ్రీభావన ఋషీదేవ చేనేత సహకర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ఆదరిద్దాం.. నేతన్నల జీవితాల్లో కొత్త వెలు గులు నింపుదాం అని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రైతు బీమా మాదిరిగానే నేతన్నల సంక్షేమానికి నేతన్న బీమా పేరుతో ఆగస్టు 14 నుంచి పథకాన్ని అమలు చేస్తుందని, ఈ పథకం కింద నమోదు అయిన నేతన్నలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మే 2023 నాటికి 18 నుంచి 59 ఏండ్ల వయసు కలిగిన 35,999 మంది నేతన్నలు ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నారని, మే 2023 నాటికి మరణించిన 79 మంది నేతన్నల కుటుంబాలకు రూ. 3.95 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పొగుల రాంబాబు, సతీష్,రాఘవేంద్రరావు,రాజు యాదవ్, నిర్వాహకులు రాపోలు తిరుమలేష, కిరాందాస్ నర్సింహా,సత్యనారాయణ, నర్సింహా, విజయలక్ష్మి, సూర్య కళ, శ్రీ రంగం, ఎల్లయ్య ప్రభాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసిద్ధ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రసిద్ధ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం విజయవంతంగా జరుపుకుం టున్నామని హాస్పిటల్ డైరెక్టర్లు చైతన్య రాజు, ప్రదీప్, శ్రీధర్ రెడ్డి తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ తమ హాస్పిటల్ నందు వైద్య సేవలు సామాన్యునికి అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యతతో కూడిన వైద్యాన్ని తక్కువ ధరలో అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి నందు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఎంతో అనుభవం ఉన్న డాక్టర్లు విస్తతంగా వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు.. హాస్పిటల్ నందు 24 గంటలు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పల్లవి, నరేష్, విష్ణు భార్గవి, త్రివిక్రమ్, సురేష్, హరిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో కొనసాగిన గద్దర్

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి



నవతెలంగాణ- వనస్థలిపురం

భూస్వామ్య పెత్తందారి దోపిడీపై తన పాటలతో గళ మెత్తిన గద్దర్ మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. సోమవారం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద గద్దర్ చిత్రపటానికి జోహార్లు అర్పించారు. గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. భూస్వాములు పెత్తందార్ల దోపిడికి వ్యతిరేకంగా గద్దర్ తన పాటలు కళారూపాల ద్వారా అట్టడుగు వర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంత పేదలను సమీకరించారని తెలిపారు. అట్టడుగు వర్గానికి చెందిన దళిత కుటుంబంలో పుట్టి ఉన్నత విద్య ఇంజనీరింగ్ చదివి అతివాద ఉద్యమాలవైపు వెళ్లారని, చివరివరకు ప్రజా ఉద్యమాల్లో కొనసాగారన్నారు. చివరి రోజుల్లో వ్యవసాయ కార్మిక , సామాజిక ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొని మద్ద తు తెలిపారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం కొనసాగిన మహాజన పాదయాత్ర, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సాధన కోసం సాగిన ఉద్యమం, పేదలు ఇండ్ల స్థలాల కోసం చేసిన పోరాటాలకు సంఘీభావంగా నిలబడ్డా రన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటల హత్య లకు వ్యతిరేకంగా, ప్రజా ఉద్యమకారులపై నిర్బంధానికి వ్యతిరేకంగా, ఇందిరా పార్క్‌లో ధర్నా చౌక్ ను కొనసా గించాలని సాగిన పోరాటాల్లో ప్రత్యక్షంగా తన పాత్ర పోషించారని తెలిపారు. ఎర్రజెండా రాజ్యం రావాలి పేదల రాజ్యం రావాలన్న గద్దర్ ఆశయాలను కొనసాగించాలని తెలియజేశారు. సీపీఐ(ఎం) నాయకులు కొత్త గణేష్ గౌడ్, అడ్డా అధ్యక్షులు ఐత రాజు ఆంజనేయులు, అంజయ్య గౌడ్, సజన, రాధమ్మ, నరస మ్మ, ఎల్లయ్య, వెంకటయ్య, అలివేలు పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి : సీపీఐ(ఎం) జి.విఠల్

నవతెలంగాణ-ధూల్‌పేట్



పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ (ఎం) కార్వాన్ జోన్ కార్యదర్శి జి.విఠల్ అన్నారు. సీపీఐ(ఎం) కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినయొద్దీన్‌ను కలిసి పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజ కవర్గంలో పేదలు ఇండ్లు లేక చాలా ఇబ్బంది పడుతు న్నారని, వాళ్లకు ఇండ్లు ఇవ్వాలన్నారు. గత ఐదు సంవ త్సరాల నుండి అనేకసార్లు అధికారులు చుట్టూ తిరిగామని, గతంలో మిమ్మల్ని కూడా కలిసి వినతి పత్రం అందజే శామని గుర్తు చేశారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ అధికా రులు సర్వేలు చేశారని, దాంతో పాటు గవర్నమెంట్ అధికా రులు కూడా సర్వే చేస్తున్నారన్నారు. నిరుపేదలైన ఇల్లు లేని వాళ్ళకి, అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో పార్టీ కార్వాన్ జోన్ కమిటీ సభ్యులు ఈ కళ్యాణ్, పార్టీ సభ్యులు భాగ్య .భూలక్ష్మి, చిన్ని, ఆదిలక్ష్మి, చిన్న, అంజ నమ్మ, రామాంజనమ్మ, విజయ, నీలా, రాధా, మైబూబి అం జలి, నీలమ్మ, నరసింగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా యుద్ధనౌక కామ్రేడ్ గద్దర్ మతికి సీపీఐ(ఎం) కార్వాన్ జోన్ కమిటీ కార్యదర్శి జి.విఠల్, పార్టీ సభ్యులు కళ్యాణ్, భూలక్ష్మి, భాగ్య, మహబూబ్, చిన్న, అంజన్నమ్మ, ఆదిలక్ష్మి, రామాంజనమ్మ అంజలి, షమీనా తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన చిత్ర పటానికి నివాళ్లర్పించారు. నవతెలంగాణ - ధూల్‌పేట్

పాలకులకు పారిశుధ్య సమస్య పట్టదా..?



నవతెలంగాణ-సంతోష్‌నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని హైదరాబాద్ నగర పాలక సంస్థ మాడల్ మార్కెట్ ఎదురుగా పారిశుధ్యం అధ్వానంగా మారింది. నిత్యం అంతర్గత అక్కడక్కడ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తుంటే మరో పక్క డివిజన్ల పరిధిలో అందుకు భిన్నంగా మురుగు, చెత్త రహదారులపై దర్శనమిస్తున్నాయి. మురుగు ప్రవాహం వల్ల దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు వ్యాధుల బారి నపడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అధికారులు పర్యవేక్షణ లేక డ్రయినేజీ లోని పూడిక ను పారిశు ధ్య సిబ్బంది సరైన సమయంలో తొలగించక పోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు, పారిశుధ్య సమస్యకు త్వరితగతిన పనులు పూర్తిచేసి స్థానిక నివాసితులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని స్థానికులు. కోరుతున్నారు.

దుర్గంధంతో స్థానిక ప్రజల ఇబ్బందులు...

మ్యాన్ హోళ్లలో చెత్తా చెదారం సకాలంలో తొలగిం చకపోవడం వల్ల తరచూ మురుగు లీకై రోడ్లపై అధికంగా ప్రవహిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. వ్యర్థాలను తీసి రోడ్లపై కుప్పలుగా వేసి తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీసిన సిల్ట్‌ను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డివిజన్లలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు.. స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తూతూమంత్రంగా ఫాగింగ్..

దోమల నివారణకు బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ నిర్వహించడంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ప్రభుత్వం రసాయ నాలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుంటే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కాలనీలో ఎక్కడైతే చెట్లు ఉన్నాయి ఎక్కడైతే గడ్డి పెరిగింది అక్కడ ఓ 10 నిమిషాలు ఆగి ఫాగింగ్ చేస్తే బాగుంటుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫాగింగ్ నిర్వహణ సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శంషాబాద్‌లో జరిగే మహాపడావ్‌ను జయప్రదం చేయాలి



- ఓరుగంటి యాదయ్య

నవతెలంగాణ-తుర్కయాంజల్

కార్మిక హక్కుల కోసం ఆగస్టు 9, 10 తేదీల్లో శంషా బాద్‌లో జరుగు మహా పడవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో పి. శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధా నాలకు నిరసనగా మహా పడవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వందలాదిగా కార్మి కులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రజా సంఘాలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గువ్వల రాజు, చెక్క యాదగిరి, భాస్కర్, సుందరమ్మ శ్రీకాంత్ నాగేశ్వరరావు, నరసింహ ఆనంద్, కోట్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి

నవతెలంగాణ-ధూల్ పేట్

మైనారిటీ గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అన్నారు. ఎంపీజే ఆధ్వర్యంలో ఆయన కమిటీతో కలిసి



మైనారిటీ గురుకులాల సెక్రటరీ షఫివుల్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్కా భవనాలు లేక అద్దెభవనాలు మైనా రిటీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో, అరకొర వసతులతో కునారిల్లు తన్నాయన్నారు. అక్కడ బోధిస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టి అన్ని రకాల వసతులు కల్పించి మెరుగైన ఫలితాల సాధనకోసం కృషి చేయాలన్నారు. ఎంపీజే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ డివిజన్‌లో వివిధ కారణాలతో చెట్టు కొమ్మలు కొట్టేయిస్తున్న జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో యంత్రాంగం వాటిని వెంటనే తొలగించడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వర్షాలకు కొమ్మలు కుళ్లి దుర్వాసన వస్తున్నది. దీనికితోడు కొందరు రాత్రిపూట అక్కడే చెత్తను పడేస్తున్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలో సైదాబాద్ కాలనీ, మాధవ నగర్ కాలనీ, పలు బస్తీలలో ప్రాంతాల్లోని పలు కాలనీ, బస్తీలో రోడ్లు పక్కన చెట్టు కొమ్మలు వారాలు తరబడి ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయవేత్తలు పరిశుభ్రత పాటించేలా చూడాలని, సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నవతెలంగాణ-సంతోష్‌నగర్

మృతురాలి కుటుంబానికి బీఎల్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీకి చెందిన లలిత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి రూ.10వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జలిగం వెంకటేష్, నవీన్ గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి



● అంబేద్కర్‌వాది బందెలా పరమేష్

నవతెలంగాణ-కీసర

1969 తెలంగాణ ఉద్యమంలో, మలిదశ ఉద్యమంలో తన పాట ద్వారా ఆట ద్వారా కోట్లాదిమంది ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ రావడంలో ముఖ్యపాత్ర పోషించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నిర్మించాలని అంబేద్కర్‌వాది బందెలా పరమేష్ డిమాండ్ చేశారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ సాధనలో ఆయన చేసి కృషి ఎవరూ మర్చిపోలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు.

జర్నలిస్టుల సమస్య పరిష్కరిస్తానని కేటీఆర్ హామీ



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ మండల పరిధిలోని ఉప్పల్, నాచారం, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2008 సంవత్సరంలో ఇచ్చిన ఇండ్ల పట్టాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు హామీ ఇచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత హస్తకళల మ్యూజియం భవనానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తో కలిసి సోమవారం మినీ శిల్పారామం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలిసి జర్నలిస్టుల ఇండ్ల పట్టాల సమస్యతో పాటు ప్రెస్‌క్లబ్ భవనం విషయం పై వినతిపత్రం అందజేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడు తూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. వచ్చేది తెలంగాణ ప్రభుత్వమేనని జర్నలిస్టులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాన్ని పరిశీలించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తామని తెలిపారు.ఉప్పల్ ప్రెస్‌క్లబ్ తాత్కాలిక భవనం స్థానంలో కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూకుట్ల నరోత్తంరెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయూ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లా మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదిరాజు సురేష్, ఏవీ. శ్రీధర్‌రావు, సంయుక్త కార్యదర్శి గుత్తి శేఖర్, ముఖ్య సలహాదారులు కె. చంద్రమౌళి, ఎం. రాం ప్రసాద్ శర్మ, డి.సురేష్, వి.కిషోర్, ఎం.శ్రీశైలం జర్నలిస్టులు రమేష్, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని 12,9,6,5,4 వ వార్డుల్లో రూ.1.90లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలకు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మున్సిపాల్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీతాశ్రీకాంత్ గౌడ్ , మున్సిపల్ కమిషనర్ రాజ మల్లయ్య, డీఈఈ చిరంజీవులు , స్థానిక కౌన్సిలర్లు పాండాల అనురాధ, గోగుల సరిత, వరగంటి వెంకటేష్, మంగళ్ పూరి వెంకటేష్ ,కొత్త సురేఖ, నానూనాయక్, నాగాయిపల్లి సుజాత, వసుపతి రమేష్‌గౌడ్, రామారం శ్రీహరి గౌడ్, కో - ఆప్షన్ సభ్యులు వడియాల రజినీ, షేక్ శాదుల్, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, సంపన్నబోల్ హరిగౌడ్, పాండాలయాదగిరి గౌడ్, కొత్త భాస్కర్‌గౌడ్, మోర నరహరి రెడ్డి,సాయి గౌడ్, తిరుపతిరెడ్డి, రామారం కార్తీక్‌గౌడ్, ఓర్సు రాములు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి పద్మజారాణి

నవతెలంగాణ-ఘటకేసర్

వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలో చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిణి పద్మజారాణి తెలిపారు. మండల పరిధిలోని అవుషాపూర్‌లో సోమవారం వై.సంగీతారెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ఆర్వో (నీటిశుద్ధిప్లాంట్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరోనా కష్ట సమయంలో గ్రామాల్లో వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేసి ఆదుకున్నట్లు గుర్తుచేశారు. గ్రామాలకు వెళ్తున్న వలస కార్మికులకు భోజనం, పండ్లు, పాలు అందజేశారని చెప్పారు. సమాజానికి మంచి చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలనికోరారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులకు మంచినీటిని తాగిస్తున్న వైఎస్ఆర్ ట్రస్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ ఏనుగు కావేరి మశ్చేందర్‌రెడ్డి, ఏపీఎం తౌర్యానాయక్, కార్యదర్శి సునీత, వార్డుసభ్యులు రాధాబాలకృష్ణ, మల్లేష్, కౌన్సిలర్ మేకల పద్మారావు, సింగిల్ విండో డైరెక్టర్ జిల్లాల పోచిరెడ్డి, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, సదానందరెడ్డి, సందుపట్ల జీవన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పిట్టల శ్రీశైలం, ఏనుగు లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వారి సమస్యలకు సంబంధించిన 102 అర్జీలను అదనపు కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి దరఖాస్తుదారుని సమస్యను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖాధికారులు పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

100 శాతం రోగ నిరోధకతే 'మిషన్ ఇంద్రధనుష్' లక్ష్యం

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమం ద్వారా చిన్నారులు, గర్భిణుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపు, 100 శాతం రోగ నిరోధకతను సాధించడమే లక్ష్యమని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఉప్పల్‌లోని చర్చికాలనీలో ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ -5.0 కార్యక్రమాన్ని డీఅండ్‌హెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం మొదటి దశ ఈ నెల 7 నుంచి 12 వరకు, రెండో దశ సెప్టెంబర్ 11-16 వరకు, మూడో దశలో డోస్ అక్టోబర్ 9-14 వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,509 మంది పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సి ఉందన్నారు. నూటికి నూరు శాతం వ్యాక్సినేషన్ కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని చెప్పారు. కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ డీఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.సరస్వతి, పీవో ఎన్సీడీ డాక్టర్ రఘునాథ్ స్వామి, పీహెచ్‌సీ ఉప్పల్ ఎంవో డాక్టర్ సౌందర్యలత, ఉప్పల్ పీహెచ్‌సీ సిబ్బంది బొగె ప్రకాష్, పద్మ గొంగడియ్య, వెంకట్‌రావు, శోభ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌ల అభివృద్ధికి కృషి : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ -కీసర

పార్క్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాల్టీలోని 5 వ వార్డు శ్రీపురం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నాగారం మున్సిపాల్టీ లో పార్కుల అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్, అన్నంరాజు లావణ్య, శ్రీనివాస్, డీఈ సుదర్శన్, కాలనీ ప్రెసిడెంట్ రమేష్, కాలనీ వాసులు తిరుపతిరెడ్డి, అశోక్, అభి, కిషోర్ ,హనుమంత్‌రావు సత్యనారాయణ, తిరుపాలయ్యా తదితరులు పాల్గొన్నారు.

చెట్లే మనిషి జీవనానికి ప్రాణవాయువు

● కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

చెట్లే మనిషి జీవనానికి ప్రాణవాయువని, కాలుష్యా న్ని నివారించి ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర వాతావరణం చెట్లతోనే లభిస్తుందని కార్పొరేటర్ శారదా మనోధర్ రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని 9వ డివిజన్‌లో 9వ విడత హరితహారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. హరితహారంతో తెలంగాణలో ఎక్కడ చూసినా పచ్చనివనంలా కనిపిస్తుందన్నారు. మొక్కలను నాటడం తో విస్తారంగా వర్షాలు పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. జవహర్ నగర్‌లో ఎక్కడ చూసినా పచ్చని చెట్లే కనిపిస్తున్నాయని తెలిపారు. మరిన్ని చెట్లు నాటి సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిళా లు కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు సిగ్గుచేటు : ప్రజా సంఘాలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

మహిళలను గౌరవించాల్సిన దేశంలో వారిపై దాడులు చేయడం సిగ్గుచేటని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో బాలాజీనగర్ యువతిపై దాడి చేసి వివస్త్రను చేయడం దుర్మార్గమని వాపోయారు. ఈ దారుణానికి పాల్పడిన దుర్మార్గుడిని శిక్షించాలని కుషాయిగూడ ఏసీపీ వెంకటరెడ్డిని సోమవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు నాయకులు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తుంటే ఇలాంటి ఘటనలు భయాందోళన కలిగిస్తుందన్నారు. నిందితుడు పెద్దమారయ్యను శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో మహిళలపై దాడులు జరగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, జిట్టా శ్రీవాణి, నిహారికగౌడ్, అలూరి సంగీతా, శారదామనోధర్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు షేక్షావలీ, విజయ, అనంతలక్ష్మి, రజిత, యాకస్వామి, కాలేషా, పాషామియా తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా మేయర్ కావ్య

విషయం తెలుసుకున్న మేయర్ మేకల కావ్య కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు బాధితురాలికి అండగా నిలిచారు. దుకాణానికి వెళ్లి ఇంటికి వస్తున్న యువతిని అకారణంగా దూషించి, బట్టలు లాగడం అమానుషమని వాపోయారు. మహిళలపై దాడులు జరిగితే సహించబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్ నేతల ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపల్ కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీని బలోపేతం చేయడం కోసం వార్డు కమిటీ, అనుబంధ కమిటీల అధ్యక్షులతో చర్చించారు. వార్డులలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మెన్‌గా చిర్రబోయిన రామచందర్ యాదవ్, మున్సిపల్ అధికార ప్రతినిధిగా మోత్కుల మల్లేష్ యాదవ్, ఓబీసీసెల్ ఉపాధ్యక్షులుగా శ్రీపతి గురుప్రసాద్, ఎస్సీసెల్ అధ్యక్షులుగా సుతారి గూడెం దుర్గయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మణిగోండ నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శామీర్ పేట్ మాజీ జెడ్పీటీసీ బాలేష్, తూంకుంట మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ మధుసూధన్‌రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, మున్సిపల్ ఆయా కమిటీల అధ్యక్షులు ధర్మారెడ్డి, హరి గోపాల్, జగదీష్ గౌడ్, జాఫర్, నాగమణి, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత : బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని బీఆర్ఎస్ నాయకులు బండారు లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ అన్నారు. ది రైట్స్ ఫౌండేషన్ మౌలానా మునోవీర్ అలీసాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మేయర్ బొంతు రాంమ్మోహన్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు 25 టీమ్స్ వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.15వేలు, కార్తీక్ రైడర్స్, లాలాపేట్, రన్నరప్‌గా నిలిచిన గ్రీన్‌స్టార్స్ అడ్డగుట్ట టీమ్ రూ.10వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో గంధం నాగేశ్వర్‌రావు, అలకుంట హరి, ఆర్గనైజర్స్ మాకదూమ్, షేరఫాదీన్, ముజీబ్, నిస్సార్, రఫీ, హుస్సెన్, ఇరు జట్ల ఆటగాళ్లు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్



నవతెలంగాణ-శామీర్‌పేట

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల పరిషత్తు కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను విస్మరించిందన్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు ఏమి తక్కువ అని కేసీఆర్ అసెంబ్లీలో చెప్పడం దొర అహంకారానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు వైద్యం కోసం ఈఎస్ఐ సౌకర్యం వద్దా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఈ ఎస్ఐ, ప్రమాద బీమా పథకం, పర్మినెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్, కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఉన్నికృష్ణ, మేడ్చల్ మండల నాయకుడు సుధాకర్ ,గిరి, శామీర్ పేట మండల నాయకులు సుధాకర్, ఆరోగ్యం, ముత్యాలు, మూడు చింతలపల్లి మండలం నాయకులు రవి ,కృష్ణ, శ్రీనివాస్, రమేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



'ఫెహ్మీకాన్-2023' ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫెహ్మికేర్ హాస్పిటల్ నిర్వహించే వార్షిక థీమాటిక్ కాన్ఫరెన్స్ 13వ ఫెహ్మీకాన్‌ను కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఖజకిస్థాన్ రాయబారి డాక్టర్ నవాబ్ మీర్‌నాసిర్ అలీఖాన్ ప్రారంభించారు. వరుసగా మూడేండ్లుగా గైనకాలజికల్ క్యాన్సర్ కణితిలను ఎదుర్కోవడానికి, గైనక్ ఆంకాలజీలో అధునాతన పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే ప్రయత్నాల్లో ముందంజలో ఫెహ్మికేర్ ఉంది. ఈ సమావేశంలో 350 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు. వీరంతా స్త్రీ జననేంద్రీయ క్యాన్సర్‌ల పరంగా పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పరిష్కారాలను అన్వేషిస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ గైనకాలజిస్ట్, మినిమల్లీ ఇన్వాసివ్ సర్జన్, ఫెహ్మికేర్ హాస్పిటల్ డైరెక్టర్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎల్ ఫహ్మిదా బాను మాట్లాడుతూ 'ప్రస్తుత సమస్యల పట్ల అవగాహన కల్పించడానికి మేం ఈ థీమాటిక్ సమావేశాలను నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఇది గైనకాలజీ ఆంకాలజీపై దృష్టి సారించింది. ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు బోధించాల్సిన నివారణ చర్యలు, రోగనిర్ధారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించటం, తద్వారా వారు ఈ సందేశాన్ని మహిళలు, వారి కుటుంబాలకు అందజేయగలరు. యుక్త వయస్సులోకి రాగానే టీకాలు వేయించటం, క్రమమైన వ్యవధిలో స్క్రీనింగ్, ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా రోగి జీవితాన్ని రక్షించవచ్చు' అని తెలిపారు. కార్కినోస్ హెల్త్‌కేర్ వద్ద కన్సల్టెంట్ గైనకాలజికల్ ఆంకాలజిస్ట్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ 'ఈ ఏడాది ఫెహ్మికేర్ కోసం మా భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంది, క్యాన్సర్ అవగాహనను వ్యాప్తి చేయడానికి, గైనక్ ఆంకాలజీలో అధునాతన పరిజ్ఞానాన్ని పంచుకోవాలనే మా ఉమ్మడి నిబద్ధతను విస్తరించింది. ఈ సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళల జీవితాలను మెరుగుపర్చాలనే మా ప్రయత్నాలను ఈ భాగస్వామ్యం పునరుద్ఘాటించింది. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా కార్కినోస్ హెల్త్‌కేర్ కీలకమైన సమస్య అయిన మహిళల క్యాన్సర్ సమస్యను పరిష్కరించడానికి దృష్టి సారించింది' అని తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత : డీపీవో రమణామూర్తి



నవతెలంగాణ-ఘట్కేసర్

మండలంలోని చౌదరిగూడ విజయపురి కాలనీ ప్రిన్స్టన్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అక్రమ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీపీవో రమణామూర్తి ఆధ్వర్యంలో కూల్చేశారు. విజయ పురి కాలనీ సర్వేనెంబర్ 759, 760లో నిర్మిస్తున్న అక్రమ బిల్డింగును కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమంగా బిల్డింగ్‌లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చ రించారు. కాలనీల్లో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కాలనీవాసులు తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో స్మిత, పంచాయతీ సెక్రెటరీలు శశికుమార్, శ్రీనివాస్, మల్లారెడ్డి, వేణుగోపాల్, నరేష్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ నియోజకవర్గం ఆమ్‌ఆద్మీ పార్టీ ఇన్‌చార్జిగా ప్రియాంక నియామకం అయ్యారు. సోమవారం ఆమెకు రాష్ట్ర కమిటీ సభ్యులు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గ నుండి పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆప్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఢిల్లీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ అండతో తెలంగాణలో విజయం సాధిస్తామని తెలిపారు.

నవతెలంగాణ,కాప్రా

మారుతీనగర్ వెల్ఫేర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ నాయక్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం, మారుతీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధరావత్ శ్రీనివాస్‌నాయక్, కార్యదర్శి ధరావత్ నవీన్, కోశాధికారి నర్సింహా నాయక్‌లను ఎన్నుకున్నారు. చక్రీపురం చౌరస్తాలో నూతన కమిటీని అమ్మ వారి ఆలయ చైర్మెన్ ధిరావత్ శంకర్ నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమం కోసం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. కాలనీ అభివృద్ధి కోసం అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హనుమంతు నాయక్, కిషన్ నాయక్, జగన్ నాయక్, నర్సింహా నాయక్, జమ్ము నాయక్, రెడ్డి నాయక్, వంశ రాజ్ రమేష్, చందన్ నాయక్, జీబీఐ శ్రీను, మల్లేష్ నాయక్, బాలాజీ నాయక్, బాలు నాయక్, నటరాజ్ నాయక్, పంతులు నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సోమవారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సారథ్యంలో మరింత అభివృద్ధి చెందాలని స్వామి వారిని కోరినట్లు తెలిపారు.



నవతెలంగాణ,కాప్రా

ముగిసిన దళిత సంక్షేమ సంఘం ఎన్నికల నామినేషన్ల పర్వం

నవతెలంగాణ-బాలానగర్



తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారం ముగిసింది. బాలానగర్, రాజు కాలనీలోని ఆ సంస్థ కార్యాలయంలో ఉ.10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల్లో అధ్యక్ష పదవికి కలమూరి శ్రీనివాస్, ఆదిముళ్ల రాము, మహంకాళి సూర్యనారాయణ, మహంకాళి శివశంకర్ నామినేషన్లు వేయగా, ప్రధాన కార్యదర్శులుగా చిలుక రాం దాస్, చింతా నర్సింగరావు, జి.రమేష్ నామినేషన్లు వేయగా, కోశాధికారు లుగా దండు రవికుమార్, ఎడ్ల సుధాకర్ నామినేషన్లు వేశారని ప్రధాన ఎన్నికల అధికారి నల్ల విల్సన్ తెలిపారు. సంఘం సలహాదారులు ఎన్.పి.లక్ష్మణ్ రావు, జేరిపోతుల రవీందర్, మాదాసు నర్సింహులు, మల్లిగారి లక్ష్మినారాయణ, సంఘం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యను త్వరగా పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఐదు రోజుల క్రితం రాత్రివేళ అకస్మాత్తుగా వచ్చిన భారీ వర్షంతో, పాపిరెడ్డి నగర్‌లోని రోడ్ నెంబర్ 8 సీ బ్లాకు లోని పలు ఇండ్లలోకి వరద నీరు చేరింది. దానివల్ల వారి నివాసంలోని పలు వస్తువులు నీట మునిగి చెడిపోయావి. సదరు వీధిలోని కాలనీవాసులు పాపిరెడ్డి నగర్ కాన్టెస్టెడ్ అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి పై విషయాన్ని వివరించారు. దీనికి తక్షణ పరిష్కారం చూపవలసిందిగా గాంధీని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తగు పరిష్కారము త్వరితగతిన తీసుకునేలా సంబంధిత అధికారులకు వివరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి అక్కిరెడ్డి యాదగిరి, బుచ్చిరెడ్డి, వీరేష్, నరేష్, వెంకటేష్ ,ముకుందం కాలనీ వాసులు పాల్గన్నారు.

అన్ని సేవలు ఒకే గొడుగు కిందకు

- ఆగస్టు 15 వరకు డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ ప్రారంభించాలి
- జనావాసాలకు దూరంగా డంపింగ్ యార్డులుండాలి
- ప్రయివేటు డంపు యార్డు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు తప్పవు
- మాదక ద్రవ్యాలు, ఫామ్ హౌస్‌లపై పోలీసులు మరింత నిఘా పెంచాలి
- రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ ప్రజల సమస్యల పరిష్కారంలో జీహెచ్‌ఎంసీ ముఖ్య పాత్ర పోషిస్తుందని రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి అధ్యక్షతన 64వ సిటీ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమన్వయంతో అన్ని శాఖల అధికారులు ఒక్క దగ్గర ఉండాలనే లక్ష్యంతో వార్డు ఆఫీస్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. భేషజాలకు వెళ్లకుండా ఏ శాఖ అధికారులైనా జీహెచ్‌ఎంసీ అనుమతి తర్వాత నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ 8 వేల టన్నులు దాటిపోయిందన్నారు. డంప్ యార్డుల కోసం భూమిని గుర్తించాలని రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా డంప్ యార్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, జనావాసాలకు దూరంగా ఉండేలా, హైదరాబాద్‌కు 50 ఏండ్ల వరకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వచ్చే చెత్తను వేరు చేసేందుకు, విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఉండాలన్నారు. వ్యవసాయానికి యోగ్యత లేని భూములు గుర్తించాలని తెలిపారు. క్వారీలను ఉపయోగించుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. దుండిగల్, ఖానాపూర్, ప్యారా నగర్ డంప్ యార్డ్‌ల అంశంలో వారంలో పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. సీ అండ్ డీ ప్రైవేట్ డంపు యార్డు నిర్వహిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి అవసరమైతే పోలీస్ కేసులు పెట్టాలని తెలిపారు. జోనల్ స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. జోనల్ పరిధిలోని అంశాలను అక్కడే పరిష్కరించుకోవాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసుకోవాలన్నారు. పాత బస్తీ రోడ్ల విస్తరణ సమస్యలకు కేటాయించిన రూ.150 కోట్లు వినియోగించుకోవాలని తెలిపారు. ఓల్డ్ సిటీలో ప్రజలతో మమేకమై పని చేయాలని, మంచి ఫలితాలు వస్తాయన్నారు. మూసీ నదిపై 14 బ్రిడ్జిలకు త్వరలో శంకుస్థాపన చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం శాఖల పరిధిలోని అంశాలు పూర్తి చేయాలన్నారు. 14 బ్రిడ్జి లకు త్వరలో టెండర్లు పూర్తి చేయాలని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు ఒక వైపు నుంచి మరోవైపు ను కలుపుతూ సిటీ మధ్య నుంచి 4, 6 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి ఉస్మాన్ సాగర్ కు నీళ్లు తరలించవచ్చని, ఉస్మాన్ సాగర్ నుంచి నీళ్లు వదిలితే మురుగు కాకుండా మంచి నీళ్లగా మారుతాయని అభిప్రాయపడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పబ్‌లు, హుక్కా సెంటర్లు, పాఠశాలలు, ఫామ్ హౌస్‌ల చుట్టూ పోలీసుల నిఘా పెంచాలన్నారు. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సీసీ కెమెరాలు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉందన్నారు. మాదకద్రవ్యాల అలవాట్లు తీవ్రమైన నేరాలకు కారణం అవుతాయని తెలిపారు. మల్టీ లెవల్ పార్కింగ్‌కు ప్రణాళిక చేయాలన్నారు. అందుకోసం జీహెచ్ఎంసి పరిధిలో ప్రభుత్వ ఖాళీ స్థలాలను తో పాటుగా ప్రైవేట్ స్థలాలను గుర్తించాలన్నారు. నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం ఉన్న చోట స్కై వాక్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు. గూగుల్ స్ట్రీట్ వ్యూ సమన్వయంతో జీహెచ్‌ఎంసీ యాప్ డెవలప్ చేయాలన్నారు. యాప్‌లో అన్ని వివరాలు అందుబాటులోకి తేవాలన్నారు. నగరంలో మున్సిపల్ కార్యాలయాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఛార్జ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. 2బీకే లబ్దిదారులకు పంపిణీకి సర్వే పూర్తి చేయాలని, ఆగస్టు 15 వరకు డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ ప్రారంభించాలన్నారు. సర్వే సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మహిళా శిశు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర క్రీడలు, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జలమండలి ఎం.డీ దానకిషోర్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ముగ్గురు పోలీసు కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై పోలీసుల దాడి హేయం



- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ చేపట్టిన విద్యార్థి నాయకులపై పోలీసులు విచక్షణా రహితంగా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. ప్రభుత్వం మూడేండ్లుగా రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదన్నారు. తక్షణమే పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికి యూనిఫామ్ ఇవ్వలేదని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేవని, లెక్చరర్స్, టీచర్స్ ఖాళీలను భర్తీ చేయలేదని తెలిపారు. గురుకులాలు మరింత అధ్వానంగా న్నాయన్నారు. గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయనీ, కనీస సౌకర్యాలు లేవన్నారు. మెస్ బిల్లులు రాక నాణ్యమైన భోజనం పెట్టక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం ప్రారంభం కాలేదని, వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు యూనివర్శిటీలకు అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వ యూనివర్శిటీలను అభివద్ధి చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, విజయ్, నాయకులు బాలాజీ, నిఖిల్, కార్తీక్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేనేత కులస్తులను ప్రోత్సహించాలి



- పద్మశాలి అధ్యక్షులు ఏర్వ శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కులస్తులను గుర్తించి అన్ని రంగాలలో ప్రోత్సహించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఏర్వ శంకరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు డివిజన్ సంఘాల అధ్యక్షులు, కుల పెద్దలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గాజుల రామారం డివిజన్ ఇందిరానగర్, శ్రీరామ్ నగర్‌లో జగద్గిరిగుట్ట డివిజన్ చివరి బస్ స్టాప్‌లో, సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్, సూరారంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మారావు నగర్ రింగ్ రోడ్డు, రంగారెడ్డి నగర్ డివిజన్ గిరినగర్, చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్, ప్రాంతాలలో జరిగిన వేడుకలకు ఆయన హాజరై జగద్గిరిగుట్టలో గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కులస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పద్మశాలి కులస్తులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని రంగాలలో అణిచివేశారన్నారు. ఎన్నో ఏండ్లుగా కులవృత్తి అయిన చేనేత రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్నామని తెలిపారు. సామాజికంగా, రాజకీయంగా తమకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పద్మశాలి కుల సంఘ భవనం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు ప్రాంతాల పద్మశాలి కులస్తులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ,పద్మశాలి కుల బాంధవులు వడిచెర్ల మారుతి, బేతి యాదగిరి, పెద్ది మల్లేశం, కాముని శ్రీనివాస్, పెండెం లక్ష్మీనరసయ్య, మేకల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు సుబ్బారావు

నవతెలంగాణ-కల్చరల్



ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి తన పరిశోధనా గ్రంథంలో భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు సుబ్బారావు అభ్యుదయ కవిత్వ వైతాళికుడు గురజాడ అని పేర్కొన్నారని సి.బి.ఐ. న్యాయస్థానం విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ అన్నారు. భావ కవిత్వంలో అమలిన శృంగారం అనే కొత్త మార్గాన్ని వేసిన రాయప్రోలు జాతీయ కవిగా ప్రసిద్ధులు అని ఆయన వివరించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా లలిత కళా వేదిక పై శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా రాయప్రోలు సుబ్బారావు సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగమారుతీ శర్మ పాల్గొని మాట్లాడుతూ తెలుగు కవిత్వం గ్రంధిక భాష ఏలుతున్న తరుణంలో రాయప్రోలు వ్యవహారిక భాష ప్రాధాన్యంగా భావ కవితోద్యమానికి నాంది పలికారన్నారు. నైజాం నవాబ్ ఆహ్వానం మెరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ తొలి పీఠాధిపతిగా పదవీ బాధ్యతలు చెప్పట్టి ఎందరినో భాషా పండితులను దేశానికి అందించారని తెలిపారు రాయప్రోలు రచించిన ఒక్క పద్యం ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతీని ఆయనను చిరంజీవిగా జాతీయ కవిగా చిరస్థాయిగా చరిత్రలో నిలిపిందని కొనియాడారు. గాన సభ అధక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో విశ్రాంత న్యాయమూర్తి కాశీవిశ్వేశ్వర రావు, తెలంగాణ రచయితల సంఘము రాష్ట్ర అధ్యక్షుడు డా.సలేశ్వరం శంకరం పాల్గొని, బండి శ్రీనివాస్ ద్రావిడ వందన సమర్పణ చేశారు.

వరద బాధితులను ఆదుకోండి : కీలుకాని లక్ష్మణ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారం డివిజన్ షాపూర్ నగర్‌లో వరద బాధితులకు విరాళాల సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇటీవల కురిసిన భా రీ వర్షాలతో ఉమ్మడి వరంగల్ జిల్లా, తెలంగాణలో ఇతర జిల్లాల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం భారీగా జరి గిందన్నారు. నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని సంబంధిత మంత్రులు ,అధికారులు, ప్రజాప్రతినిధులు నష్టం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు న్యాయం చేయా లని తెలిపారు. పూర్తిగా పాడైపోయిన రోడ్లను వెంటనే నిర్మించాలని, కూలిపోయినటు వంటి ఇండ్ల స్థానంలో బాధితులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పంట నష్టం జరిగినటువంటి రైతులకు అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరిగిన ఇప్పటికి మంత్రులు పర్యటి ంచకపోవడం ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తుందని అన్నారు. వెంటనే ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని లేనిపక్షంలో బాధితుల తరపున న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అన్నారు. పార్టీ మండల నాయకులు రావుల స్వాతి, యేసు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించినా : సీఐటీయు

నవతెలంగాణ-మల్కాజిగిరి

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం సీఐటీయు మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నరసింహారావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేల ఇవ్వాలి, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి , కార్మిక కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని అదేవిధంగా మున్సిపల్ వర్కర్స్ కు శానిటేషన్ కిట్, నూనెలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్, జే.వెంకన్న , మొగిలి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ మొహరం పర్వదిన వేడుకలు పురస్కరించుకుని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్‌లు మసీదులో ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ జీతేంద్ర నాథ్, సతిష్ కుమార్, గుండా నిరంజన్, ఎస్.ఆర్ ప్రసాద్, బాబు, సత్యనారాయణ, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం : కార్పొరేటర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని సంగీత్ నగర్ కాలనీ, కొమ్మునిగడ్డలో ప్రజా సమస్యలపైన, వివిధ విభాగాల అధికా రులతో కలసి కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలకు రోడ్లు గుంతలు పడటం వల్ల ఇబ్బందులు కలుగుతున్నారని, అలాగే చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉండటం వల్ల ప్రమాదకరంగా తయారైందని, స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటం మాట్లాడుతూ రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే మరో సీసీ రోడ్డు వేయాల్సి ఉం దని దానిని సైతం పూర్తి చేసి, ప్రజలకు ఏలాంటి సమస్యలు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ కుమార్, ఎంటోమోలజీ సూపర్వైజర్ నరేశ్, ఏస్. ఆర్.పి వినయ కాంత్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్య, స్ట్రీట్ లైట్ సూపర్వైజర్ బద్రయ్య, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం కౌంటర్ ఏర్పాట్లను ప్రారంభించిన కమిషనర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ కార్యాలయంలో పౌర సేవా కేంద్రం నందు సోమవారం గృహలక్ష్మి పథకం కౌంటర్ ఏర్పాట్లను దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కే .సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన ప్రత్యేక కౌంటర్‌ను అన్ని మున్సిపల్ కార్యాలయాలలో ఎర్పాటు చేయాలని ఆదేశించారు. దుండిగల్ మున్సిపాల్టీలో ప్రారంభించడమైందని, గృహలక్ష్మి పథకం అనేది తెలంగాణ రాష్ట్రంలో సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు కట్టుకునేందుకు ఆర్థికసాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన పథకం అన్నారు. ఈ పథకానికి దరఖాస్తులు చేసుకునే వారికి ఆఖరు తేది: 10.08.2023, వచ్చిన దరఖాస్తులను తేది:20.08.2023 వరకు పరిశీలన చేయడం జరుగుతుంది. తేది: 25.08.2023 వరకు అర్హులైన వారకి మంజూరు ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుంది. ఈ గృహలక్ష్మి పథకానికి కావలసినవి ఫుడ్ సెక్యూరిటీ కార్డు (రేషన్ కార్డు), ఖాళి స్థలం కానీ రేకులు ఇల్లు కలిగివుండాలి, జీవో నెంబర్ 59 ప్రకారం లబ్ది పొందినవారు అనర్హులు, ఇంకా జీవో నెంబర్ .25, తేదీ.21.06.2023 లోబడి నిబంధనలు వుండాలని కమీషనర్ గ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ టి. నర్సింహులు , రెవిన్యూ ఆఫీసర్ ఎస్. సునంద గారు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1కాలనీకు చెందిన కాలనీ వాసులు డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌ను , సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్‌ను డిప్యూటీ మేయర్ కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించి డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నని తెలిపారు.ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్యదర్శి కుంటపల్లి రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, బీసీ సెల్ అధ్యక్షులు చంద్రయ్య, కాలనీ వాసులు శేఖర్, సుభాష్, మల్లేష్, సిద్ధయ్య, శేఖర్, రవి, సంజీవ్ కుమార్, బొడస్ రమేష్, శేఖర్, ఆంజనేయులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్



గద్దర్ మృతి కళారంగానికి, ఉద్యమాలకు తీరనిలోటు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజయుద్ధనౌక గద్దర్ అకాల మృతి యావత్ కళా రంగానికి, ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. గద్దర్ మృతికి సంతాపంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి చివరి బస్ స్టాప్‌లో సీపీఐ ప్రజానాట్యమండలి, జర్నలిస్టుల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మా ట్లాడుతూ తన గళం ద్వారా అనేక మందిని ఉద్యమాల వైపు మళ్లించి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, నిత్యం పేద ప్రజల సమస్యలను పాటల రూపంలో పాడి ఆలోచింపచేసిన గొప్ప కళాకారుడు గద్దర్ అని కొనియా డారు. గద్దర్ లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో "పొడుస్తు న్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా" అని పాట పాడి ఉద్యమాన్ని తీవ్రతరం చెయ్యడానికి కారణమైనరాని గుర్తు చేసుకున్నారు. నిత్యం పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పాడి కమ్యూనిస్టు సిద్ధాంతం ద్వారానే సమసమాజం ఏర్పడుతుందని భావించి ఉద్యమకారులకు ఊతం ఇచ్చేలా పాటలు పాడి కళాకారులకు స్ఫూర్తి నిచ్చిన గొప్ప వ్యక్తి ఉద్యమ కెరటం నేడు మనమధ్యలో లేకపోయినా వారి పాటలు నిత్యం తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమం డలి అధ్యక్షుడు ఆకుబత్తి ప్రవీణ్, జర్నలిస్ట్ నాయకులు దప్పు రామస్వామి, తొండ వెంకట్, నర్సింగ్, మా పల్లె శంకర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, సీపీఐ నాయకులు సహదేవ్ రెడ్డి, చర్లపల్లి రాము లు,సోమన్న, ఇమామ్,ప్రభాకర్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు సామెల్, ముసలయ్య, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు. వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ జోహార్ గద్దర్ అన్న జోహార్ జోహార్... ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు వాసగొని శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, జీవన్ రెడ్డి, కేశెట్టి రాములు, సానాది శంకర్, బి.కె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముస్తాల కృపా సాగర్ అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యం లో, మండల కమిటీ సభ్యులు గుంటి లక్ష్మన్ అధ్యక్షతన గద్దర్



చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా చిందం హరి, మాజీ యువజన సంఘ నాయకులు ప్రసంగిస్తూ గద్దరన్న గొప్ప విప్లవ భావాలు కలిగిన కళాకారుడు మన మధ్య లేక పోవడం బాధాకరం అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆటా, పాటలతో జనం గుండెల్లో సజీవంగా నిలిచి పోయారని... తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు పోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీలో పనిచేసారని.. ప్రత్యేక తెలంగాణ విషయంలో పార్టీని విభేదించి బయటకు వచ్చి, తెలంగాణా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. తను జీవిత కాలం అంతా ప్రజలకోసమే జీవించారని... కామ్రేడ్ విజయ్ కుమార్, కొండల్ పార్టీ నాయకులు, మండల కమిటీ సభ్యులు బంగారు నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి: ప్రజా గాయకుడు గద్దర్ పార్థివదేహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్‌తో తనకు గత30 సంవత్సరాలుగా సానిహిత్యం ఉందని, ఇప్పటికీ కూడా తరచూ ఆయన్ని కలుస్తుండేవాడినని, ఆయన మరణం తీరని లోటని అన్నారు. మా తండ్రి చనిపోయినప్పుడు ఎంత బాధ అనిపించిందో గద్దర్ మరణ వార్త విన్నప్పుడు అంతే బాధ అనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సజీవంగా మన మధ్య లేకపోయినా ఆయన పాట ద్వారా ఎప్పుడు ఆయన మనతోనే ఉంటారని ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటుగా కో ఆర్డినేటర్ సతీష్ అరోరా ఉన్నారు.



మల్కాజిగిరి: మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర, ఆయన పాటతో ప్రజల్లో ఉద్యమ జ్వాలను రగిలించిన గద్దర్ అన్న, తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాలను పాటతో చైతన్యపరిచారు. భౌతికంగా ఆయన మన మధ్యలో లేకున్నా, ఆయన పాట ఈ భూమి ఉన్నంతవరకు ఆయన



బాలానగర్: కూకట్‌పల్లి సర్కిల్ ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ పరిధిలోని హస్మత్ పేట్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రముఖ విప్లవ కవి ప్రజా గాయకుడు గద్దర్(గుమ్మడి విఠల్ రావు) (74) ఆత్మకు శాంతి చేకూరాలని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..విప్లవ సాంస్కృతిక ప్రజా ఉద్యమాలతో పెనవేసుకు పోయి చైతన్యం రగిల్చిన యుద్ధనౌక అని, బడుగు, బలహీన వర్గాల ప్రజల బాధలన్నింటిని పదాలుగా కూర్చిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ మరణించినా ఆయన పాటకు మరణంలేదని యుద్ధం నరసింహ యాదవ్ కొనియాడారు. నాయకులు కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్, మన్నే ఉదయ్ యాదవ్, న్యాతరి నర్సింగరావు, ఎజాజ్ బాయ్, హరినాథ్, లలిత పాల్గొన్నారు.

బాలానగర్: ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక, తాడిత, పీడిత ప్రజల కోసం తన గళాన్ని వినిపించిన ప్రజా గాయకుడు గద్దర్ మరణానికి సంతాపం తెలిపి, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో కలసి టీపీసీసీ అధికార ప్రతినిధి,పీసీసీ సభ్యులు డా.సత్యం శ్రీరంగం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రజా గాయకుడు, ప్రజాయుద్ధ నౌక, తన గళంతో తెలంగాణ ప్రజల గుండెల్లో విప్లవాగ్ని రగిల్చిన ఆయన విప్లవ కెరటమని, మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న సమయంలో ప్రజల పక్షాన తెలంగాణ పాటై గొంతెత్తి పాడిన ఉద్యమ కెరటం అన్నారు. గద్దర్ స్వరాష్ట్ర సాధన కోసం గోసి, గొంగడి వేసి ప్రజల్ని చైతన్య వంతులను చేస్తూ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణా రాజ్ పూత్ పాల్గొన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా సంబురాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 15వ తేదీన శామీర్‌పేట కలెక్టరేట్‌లోని గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్స సంబురాలను నిర్వహిస్తామనీ, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కల్టెర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించేందుకు వచ్చే వారితోపాటు ముఖ్య అతిథి, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. అతిథికి పోలీస్ గౌరవ వందనంతోపాటు బందోబస్తు ఏర్పాట్లను చూడాలని పోలీస్ శాఖకి సూచించారు. పరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, అతిథి ప్రసంగించే చోటుతోపాటు వేదిక వద్ద రంగురంగుల పూలతో అలంకరించాలని ఉద్యానవనశాఖ అధికారులకు సూచించారు. ఆ రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులకు సూచించారు. మైక్, సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్‌పీఆర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, కలెక్టరేట్ ఏఓ రామ్ మోహన్, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన చంటి పిల్లలకు ముర్రు పాలు ఎంతో శ్రేష్ఠకరం

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ పరగండి మైసమ్మ పరిధిలోని అంగన్ వాడి కేంద్రంలో సోమవారం టీచర్ మీనాదేవి తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 8వ వార్డ్ కౌన్సిలర్ కోల సాయి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీచర్ మీనాదేవి చంటి పిల్లల తల్లులకు, గర్భిణులకు ముర్రుపాల యొక్క ప్రాముఖ్యతను వారికి వివరించారు. ముఖ్యంగా పుట్టిన చంటి పిల్లలకు ఆరు నెలల లోపు వరకు తల్లి పాలు తప్పకుండా త్రాగించాలని, డబ్బాపాలు తాగించకూడదని తెలిపారు. రెండు సంవత్సరం నిండే వరకు పిల్లలకు తల్లిపాలు పట్టించాలని తల్లిపాలలో పోషక విలువలు(ఇమ్యూనిటీ) ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అనంతరం చంటి పిల్లలకు కౌన్సిలర్ సాయి యాదవ్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- మేడ్చల్-మల్కాజిగిరి డీఐఈఓ జి.కిషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ జూనియర్ ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా చేర్చిన 6 ఒకేషనల్ పోస్టులకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జి.కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. సిటి, పీఎస్‌టీటీ, కంప్యూటర్ సైన్స్, ఈటీ, ఎంఎల్‌టీ అండ్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్) మొత్తం ఆరు సబ్జెక్టుల్లో భోదించుటకు సంబంధించిన సబ్జెక్టుల్లో బీటెక్, బీఈ లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అతిథి అధ్యాపకుల నియామకం కోసం అనుబంధ షెడ్యూల్‌ను జతచేసినట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ లోపు డీజేఈఓ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల నకళ్ళతో జతపరిచి దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

టీజీజేఎల్‌ఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజమౌళి, శ్యామ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీజేఎల్ఏ) వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. వసుకుల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.పి. శోభన్ బాబు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ కె. సురేష్ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలో జరిగిన సమావేశంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ రాజమౌళి(మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె. శ్యామ్ కుమార్ బొల్లారం(ప్రభుత్వ జూనియర్ కళాశాల)లను ఎన్నుకున్నారు. త్వరలో మేడ్చల్ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సమావేశం నిర్వహించి పూర్తిస్థాయి జిల్లా కమిటీ సభ్యుల బృందాన్ని ఎన్నుకుంటామని నూతన మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెలియజేశారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆస్పత్రిలో నర్సులు అందించే సేవలు వెలకట్ట లేనివని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప అన్నారు. వైద్యులు ఓ రోగితో పది నిమిషాల నుంచి గంట పాటు ఇంటరాక్షన్ అయితే నర్సులు మాత్రం అడ్మిషన్ నుంచి డిశ్చార్జి వరకు ఇంటరాక్షన్ ఉంటుందని తెలిపారు. సోమవారం నిమ్స్ ఆస్పత్రిలోని ఎమెర్జెన్సీ బిల్డింగ్ 5వ అంతస్తులోని ఆడిటోరియంలో 'రోల్ ఆఫ్ నర్సింగ్ కేర్ ఇన్ పేషేంట్' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై నర్సులను ఉద్దేశించి మాట్లాడారు. బయట ఆస్పత్రులతో పోల్చుకుంటే నిమ్స్‌లో ఉన్న నర్సులు ఎంతో వేగంగా సేవలందిస్తున్నారన్నారు. నర్సులు రోగి సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రోగి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయ్యే వరకు ఓర్పుతో సేవలందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారని చెప్పారు. నర్సులు, రోగులకి మధ్య ఎమోషనల్ సపోర్టు ఉంటుందన్నారు. కొంత మంది జూనియర్ నర్సులు రోగికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు వైద్యులను అడిగేందుకు భయపడుతున్నారని, వార్డులో ఉన్నప్పుడు తాము నర్సులం కాదని, డాక్టర్లమే అనే కాన్ఫిడెంట్ ఉండాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ముందుడి సేవలు చేస్తున్నారని తెలిపారు. ఆపరేషన్ థియేటర్లలో కూడా నర్సుల పాత్ర కీలకమని, వారు లేకుంటే సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను చేయలేని పరిస్థితి ఉంటుందని చెప్పారు. వార్డుల్లో నర్సులు రోగుల సేవల కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారని, వారితో ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సేవలను గుర్తించి కొనియాడుతారని, అవి మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. మరికొంత మందికి ఎంత సేవ చేసినా గుర్తించరని, అలాంటి వారి గురించి పట్టించుకోవద్దన్నారు. హాస్పిటల్‌లో వర్క్ లోడ్ ఎక్కువ అవుతుందని, అయినా సేవలను మాత్రం వేగంగా అందిస్తున్నారని తెలిపారు. రోగికి ఎదైనా ఇబ్బంది అన్పిస్తే కౌన్సెలింగ్ కూడా చేయొచ్చు అని తెలిపారు. నిరంతరం రోగుల సేవలో ఉండే నర్సులు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నర్సుల్లో మరిన్ని నైపుణ్యాలను పెంచేందుకు శిక్షణా సదస్సులను నిర్వహించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొనే వారికి అదనంగా ప్రోత్సాహకాలను కూడా అందేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డీన్ లిజా రాజశేఖర్, అసోసియేట్ డీన్ నాగేశ్వరరావు, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్, నెఫ్రాలజీ విభాగాధిపతి స్వర్ణలత, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ద్రాక్షాయని, నర్సింగ్ సూపరింటెండెంట్లు లలితకుమారి, పద్మ, నిమ్స్ నర్సులు, వివిధ హాస్పిటల్స్‌లలో పనిచేసే నర్సులు కూడా పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన రాజారావు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో గాంధీ హాస్పిటల్ అభివృద్ధికి, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. త్వరలోనే హాస్పిటల్‌ను సందర్శించనున్నట్టు కలెక్టర్ చెప్పినట్టు రాజారావు తెలిపారు.

ఆధునాతన 'వంతెనల నిర్మాణం'పై ఐదురోజుల వర్క్‌షాప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆధునాతన 'వంతెనల నిర్మాణం' అనే అంశాలపై గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఇఎస్‌సీ) క్యాంపస్‌లో ఐదు రోజుల వర్క్‌షాను ప్రారంభించారు. ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామే శ్వర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌లో ఆధునాతన బ్రిడ్జిల నిర్మాణం, ప్రణాళిక, రూపకల్పన తదితర అంశాలపై చర్చిస్తారు. కేంద్ర మంత్రిత్వ శాఖ స్పాన్సర్‌షిప్‌తో ఇఎస్‌సీఐ, సీటీఇడీ ఆధ్వర్యంలో ఐదు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం 7 నుంచి 11 వరకు ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందని, ఇం దులో ఆధునాతన, పొడవైన బ్రిడ్జిల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రణాళికలపై చర్చించనున్నట్లు ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామే శ్వర్‌రావు తెలిపారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రోడ్స్ అండ్ బిల్డింగ్ డిపార్టుమెంట్(టీఆర్‌అండ్‌బీ) చీఫ్ పీ.రవీంధర్ రావు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 22రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ (35 మంది) జూనియర్ ఇంజనీర్ల నుంచి చీఫ్ ఇంజరనీర్ల వరకు పాల్గొంటారని తెలిపారు. మొదటి రోజు బ్రిడ్జిల ప్రాముఖ్యత, సరికొత్త నిర్మాణాలు, నాణ్యతతోపాటు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ తదితర అంశాలపై చర్చించా మన్నారు. ముఖ్యంగా సీనియర్ స్థాయి ఇంజనీర్‌లు శిక్షణలో ఇచ్చే సూచనలు, సలహాలను జూనియర్ స్థాయి ఇంజనీర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఇఎస్‌సీఐలో అందించే వివిధ కోర్సులు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఎస్‌సీఐ డైరెక్టర్ ఆర్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు ఆర్యోగంగా ఉంటేనే సమాజం బాగుంటుంది

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్నారులు ఆరోగ్యాంగా ఉంటేనే సమాజం బాగుంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ యూపీహెచ్‌ఎసీలోని భోలా నగర్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా చిన్నారులకు టీకాలు వేసి.. టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వ్యాక్సినేషన్ మొదటి రౌండ్ ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు, రెండవ రౌండ్ సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, మూడవ రౌండ్ అక్టోబర్ 9 నుంచి 14 వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు, 5ఏండ్ల లోపు చిన్నారులకు టీకా వేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్, ప్రభుత్వ దవాఖానాల్లో 12 రకాల టీకాలు ఉచితంగా వేస్తారని, జిల్లాలో 1,262 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 100 శాతం టీకాలు తీసుకునే విధంగా కృషి చేయాలనీ, ఈ టీకా కార్యక్రమంపై ఆశావర్కర్లతో కాలనీలో ప్రతీ ఇంటిని సందర్శించి వారికీ ఈ టీకా ఆవశ్యకతను వివరించి.. అందరు టీకా తీసుకునేలా చేయాలన్నారు. ఈ టీకా కార్యక్రమాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు సహకారం తీసుకొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, జిల్లా ఇమ్యునైజషన్ అధికారి శ్రీకళ, మెడికల్ ఆఫీసర్ నాగేంద్ర రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీ మనోజ్ కుమార్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-వనస్థలిపురం

చంద్రయాన్ గుట్ట ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కే . మనోజ్ కుమార్‌ను పీస్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా గజవుద్దీన్, సౌత్ జోన్ జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కుమార్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ రిజ్వాన్, కమిటీ సభ్యులు ఆసిఫ్ ఉద్దీన్, రేణు కేశవుని, నిశాంత్ బేగం, వివేక్ సింగ్, దీపక్ శర్మ, మీనాక్షి, ఫరిజన, అశోక్ గౌడ్ స్థానిక నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు పంచుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత సమాజసేవలో ముందుండాలన్నారు. రాబోయే తరాలకు గుర్తింపు ఉండాలంటే యువతకు సరైన అవగాహన కల్పించాలన్నారు. కమిటీ సభ్యులు సేవా భాగంలో తామున్నానని భరోసా కల్పించాలని, శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. పలువురు సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్‌లోని ఆయా కాలనీలలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి , బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి ,మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు, యూజీడి, కమ్యూనిటీ భవనాలు, బాక్స్ డ్రయినేజీ నిర్మాణాల కోసం రూ. 6 కోట్ల 33 లక్షల 70 వేల వ్యయంతో చేపట్టి నిర్మాణాల కోసం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు.

మీకు అందుబాటులో ఉంటా

ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్



నవతెలంగాణ-బేగంపేట :

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా వారికి రక్షణ కలిగించే బాధ్యత తమపై ఉందని ఎ.ఎస్.రావునగర్ ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానికులు కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఆయన మా ట్లాడుతూ ప్రజలకు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-అంబర్‌పేట

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని చూసి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ మైనారిటీ మోర్చా సిటీజనరల్ సెక్రెటరీ ఇర్ఫానా సుల్తానా, సీనియర్ నాయకులు సునీల్‌బాబులు అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్ర మా లకు ఆకర్షితులై సోమవారం గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్టీల్ బ్రిడ్జి ప్రారంభం



- ఫ్లైఓవర్‌ను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇందిరా పార్క్ నుండి వీ.ఎస్.టీ వరకు రూ.450 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఫ్లై ఓవర్ స్టీల్ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి రానుంది. సోమవారం ముషిరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ప్రాజెక్టు ఇంజనీరింగ్, అధికారులతో కలిసి కమిషనర్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఫ్లైఓవర్ స్టీల్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఎస్.ఆర్.డీ.పీ ద్వారా 48 పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 35 పనులు పూర్తయ్యాయని, ఇక స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే 36 పనులు పూర్తి కాగా 20వ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తుందన్నారు. మిగతా 13 పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఒక్కొక్క పనిని ఎప్పటి వరకు పూర్తి చేయాలో అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందిరా పార్క్ అశోక్ నగర్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు మీదుగా ఉస్మానియా యూనివర్సిటీ తార్నాక, అంబర్‌పేట్ ఉప్పల్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఎన్నోబాధలు పడేవారని ఈ ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ ఇబ్బంది తొలగిపోతుందనిఎమ్మెల్యే ముఠాగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇందిరా పార్క్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు మీదుగా 4 జంక్షన్‌లకు ఈ ఫ్లై ఓవర్‌తో ట్రాఫిక్ సమస్య ఇక ఉండదన్నారు. ఈ ఫ్లై ఓవర్ పనులు పూర్తి అయిన నేపథ్యంలో మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారం భి స్తారని అన్నారు. తదనంతరం కమిషనర్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ఇందిరాపార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వాకర్స్‌తో మాట్లాడి పార్కులో గల సౌకర్యాలు నిర్వహణకు కావలసిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్. డీ.పీ. సీ.ఇ. దేవానంద్, యూ.బీ.డీ. అడిషనల్ కమిషనర్ కృష్ణ, డైరెక్టర్ శ్రీవాస్, ఎస్.ఇ రవీందర్ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రులు తలసాని శ్రీనివాస్, సబిత ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బేగంపేట్

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలన్ని పరిష్కరించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పభుత్వం ఎంతో కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు తెలిపారు. సోమవారం సనత్‌నగర్‌లోని అశోక్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలను మంత్రులు సందర్శించి పాఠశాలలోని సమస్యలు, ఇబ్బందుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను సిబ్బంది, విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి 2,3 రోజులలో విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో కలిసి పాఠశాలలను సందర్శించి అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రరెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ చైర్మెన్ రావులశ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ ఆర్జేడి విజయలక్ష్మి, జేడి ప్రసాద్, అదనపు కలెక్టర్ అభిషేక్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారిలతో కలిసి పాఠశాలలను సందర్శించారు. ఈ పాఠశాలలోనే తెలుగు, ఉర్దూ మీడియం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమకు వడ్డించే మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండటంలేదని, దాంతో తమ ఇంటి వద్ద నుండే బోజనాలు తెచ్చుకుంటున్నామని, నాణ్యమైన బోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా టాయిలెట్స్ సమస్య, పర్నిచర్ కూడా లేదని, సిబ్బంది కొరత ఉన్నదని, స్వీపర్లు లేకపోవడం వలన పాఠశాల పరిశుభ్రత సక్రమంగా ఉండటం లేదని మంత్రుల దృష్టికి విద్యార్థులు తీసుకు రాగా, వారం 10 రోజులలో నీటి సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించారు. సిబ్బంది అదనంగా ఉన్న పాఠశాల నుండి అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్ పై ఇక్కడ నియమించాలని అక్కడికక్కడే మంత్రి అధికారులను ఆదేశించారు. పాఠశాలల లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను జీహెచ్ఎంసీ సిబ్బంది చేపడతారని, పర్యవేక్షించాలని అక్కడే ఉన్న ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్‌ను మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన మన బస్తీ మన బడి కార్యక్రమం 2వ



విడతలో పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డ్, టాయిలెట్స్ నిర్మాణం వంటి అన్ని పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, ప్రదానోపాద్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఏంఈఓ ఆంజనేయులు, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్ తదితరులు ఉన్నారు.

టీకాలతో ఆరోగ్యంగా ఉండండి

- గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తార్నాక డివిజన్ శాంతినగర్ కమ్యూనిటీ హాల్లో చిన్నపిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్‌నగర డిప్యూటీ మేయర్, మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతెశోభన్‌రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీకాలు తీసుకుని చిన్నా రులు, గర్భిణీలకు 100శాతం టీకాలు వేసే విధంగా తెలంగాణ ప్రభు త్వం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది, సమీ పంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోని, ప్రభుత్వ ఆస్పత్రిలో టీకాలు ఇస్తా రన్నారు. 7నుంచి 12 , సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను టీ బీ, పోలియో, కొరింత దగ్గు, హెపటైటిస్ బి తదితర వ్యాధుల నుంచి కాపాడుకోవాలన్నారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ ఆఫీసర్ సౌశీల్యా, వైద్య అధికారులు , బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

9 ,10న మహాపడావ్ జయప్రదం చేయండి

- సీఐటీయూ అంబర్‌పేట కార్యదర్శి రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఇందిరా పార్కులో 9,10వ తేదీన జరిగే మహా పాడావ్ మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ అంబర్‌పేట కార్యదర్శి రాములు తెలిపారు. సోమవారం అంబర్‌పేట సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కరపత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజాకార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నదని, జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలు కారు చౌకగా స్వదేశి విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తున్నదని, డీజిల్ పెట్రోల్ గ్యాస్ ఇతర నిత్యావసరకులు ధరలు పెంచి ప్రజలు నడ్డి విరుస్తున్నదని విమర్శించారు. అనేక త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మారుస్తూ పార్లమెం ట్‌లో చట్టం చేసింది. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడిందని, పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టం చేసి సమ్మె హక్కును కాలరాస్తున్నది సామాజిక భద్రత కోడు వృత్తి సంబంధిత రక్షణ ఆరోగ్యం పని పరిస్థితిలో కోడులతో పిఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తున్నన్నారు. నిరుద్యోగం పెరిగిపోతున్నదని, ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 17 లక్షల ఖాళీలు ఉన్నాయని వారిని వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న వినాశకర చర్యలన్నింటిని కార్మికవర్గం ఐక్యంగా ఎదుర్కొని పోరాడాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంబర్ ఎట నాయకులు వీర్య, భాస్కర్, ధర్మానాయక్, రాజు, వినోద, కాంతి, తదితరులు పాల్గొన్నారు.

అత్యంత శక్తివంతమైన విప్లవకారుడు గద్దర్



- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తన ఆత్మలో విప్లవం నింపుకుని పోరాడిన అత్యంత శక్తివంతమైన విప్లవకారుడు గద్దర్ అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కొని యాడారు. సోమవారం ఎల్.బి స్టేడియంలో ప్రజా యుద్ధనౌక, వాగ్గేయకారుడు గద్దర్ భౌతికకాయంపై పూలమాలలు వేసి దిడ్డి సుధాకర్, ఆప్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ గద్దర్ ఆకస్మిక మృతి అణగారిన వర్గాలకు తీరని లోటు అన్నారు.చైతన్యం రగిలించడంలో సమస్యలపై పోరాడటానికి, ప్రజలు ఏకం కావడనికి గద్దర్ పాటలు ప్రభావితం చేశాయని ఆయన గుర్తు చేశారు.సీఎం కేసీఆర్ రాకముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గళమెత్తిన తెలంగాణ ముద్దుబిడ్డ గద్దర్ పేరట ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు ఎంఏ.మజీద్, యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్లంగి విజయ్, విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్, అధికార ప్రతినిధులు పరీక్షిత్, అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అవకాశం కల్పించాలి
- పీసీసీ మాజీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్నామని పీసీసీ మాజీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో జాంబాగ్ యాదవ సంఘం భవన్ సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో గోషామహల్ నియోజకవర్గం లోని ఆరు డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ కి కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ వారిని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అడుగుతామన్నారు. తాను 37 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తున్నట్లు చెప్పారు. తనకు టికెట్ ఇస్తే ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తనకు పార్టీ సీనియర్లు సహకారం ఉన్నట్లు చెప్పారు. స్థానికులకు కాకుండా వేరే వారికి పార్టీ టికెట్ ఇస్తే పనిచేసే ప్రసక్తే లేదని అన్నారు.స్థానికులకే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ నరేందర్ .శ్రీధర్ గౌడ్, నిర్మల్ యాదవ్ శ్యాంసింగ్, కన్నయ్యలాల్, వినయకుమార్, కైలాశ్ సింగ్ . మధు తదితరులు పాల్గొన్నారు తెలిపారు.

చేనేతను ప్రోత్సహించండి

- బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బి.ఎస్ రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రతి ఒక్కరూ వారానికో సారైనా చేనేత దుస్తులు ధరించి చేనేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ అధ్యక్షతన సోమవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో గల కమ్యూనిటీహాల్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ చేనేతకు పవర్లూమ్ యజమానులు సహకరించాలని, ప్రతి ఒక్కరూ చేనేత నైపుణ్యాన్ని ప్రోత్సహించి వారి ఉపాధి కల్పనకు సహకరించాలని చెప్పారు. ప్రభుత్వాలు కూడా వారికి రావలసిన సౌకర్యాలు, స్కీములు ప్రవేశపెట్టాలని, రైతులకు రుణమాఫీ గౌడ తదితర ప్రధాన వృత్తులకు ఉన్న రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, ప్రధాన కార్యదర్శి చిలుక శివకుమార్, కోశాధికారి బి. అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య, పులిపాటి శ్రీనివాస్, డాక్టర్ నాగ సాయన్న, కుందన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, కార్యదర్శి పి. మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

యార్డ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్ బస్తీలో ముస్లీం గ్రేవ్ యార్డ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం గ్రేవ్ యార్డ్ కు కేటాయించిన స్థలాన్ని మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఆ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని త్వరగా తొలగించాలని, లెవెలింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంత ముస్లీంలు తమలో ఎవరైనా మరణిస్తే అంత్య క్రియలు నిర్వహించేందుకు పలు ఇబ్బందులను ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం 2ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు నిర్మాణ పనుల కోసం సుమారు రూ.3 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, అన్ని సౌకర్యాలతో నిర్మించి ఇస్తామన్నారు. కొందరు పని గట్టుకొని గ్రేవ్ యార్డ్ నిర్మాణంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని పట్టించుకోవద్దన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదారి పట్టించాలని చూసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బేగంపేట ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలు అనేకం పరిష్కరించినట్లు వివరించారు. వర్షాకాలంలో బేగంపేట నాలాకు వచ్చే వరదతో బ్రాహ్మణ వాడి, ప్రకాష్‌నగర్, వడ్డెరబస్తీ తదితర ప్రాంతాలు ముంపుకు గురై ప్రమా దకర పరిస్థితులను తలపించేవని, ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద రూ.45 కోట్ల వ్యయంతో నాలా అభివృద్ధి పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్క రించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ టి.మహేశ్వరి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు తదితరులు ఉన్నారు.

35 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితులు అరెస్టు- రిమాండ్‌కు తరలింపు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నాంపల్లి ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఇద్దరు వ్యక్తులు వద్ద 35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలుపుతూ ఆదివారం సికింద్రాబాద్ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ షేక్ సలీమా ఐపీఎస్ ఆదేశాల మేరకు నాంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో రైలను తనిఖీ చేసామని, లింగంపల్లి వద్ద భువనేశ్వర్ టు ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమాదాస్పదంగా కనిపించడంతో వానిని తనిఖీ చేయగా వారి బ్యాగుల్లో 35 కిలోల గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు రాహుల్, ఆకాష్‌రావు సాహెబ్‌లో అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించి మన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి మహారాష్ట్రలోని పూణేకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు చెప్పినట్లు తెలి పారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న సీఐటీ ఇన్ స్పెక్టర్ రవిబాబు. ఆర్పీఎఫ్ సిబ్బంది. జీఆర్పీహెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రాథోడ్ లను రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ షేక్ సలీమా ఐపీఎస్. సికింద్రాబాద్ అర్బన్ డీఎస్పీ నరసయ్యలు అభినందించారు. వీరికి రివార్డు ప్రకటించినట్లు తెలిపారు

'అపోలో చిల్డ్రన్స్' పేరుతో సమగ్ర పీడియాట్రిక్ కేర్ ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అత్యుత్తమ క్లినికల్ ఫలితాలతో ప్రాథమిక చికిత్స మొదలుకుని అత్యాధునిక సంరక్షణ వరకు పిల్లలకు సమగ్రమైన వైద్య సంరక్షణను 'అపోలో చిల్డ్రన్స్' పేరుతో సమగ్ర పీడియాట్రిక్ కేర్ ఆస్పత్రి అందిస్తుందని అపోలో ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల క్లినికల్ ఎక్సలెన్స్ ఘనమైన వారసత్వంతో మరింత పురోగమిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద వర్టికల్ ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ అయిన అపోలో, పిల్లల ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తుందన్నారు. అపోలో ఆస్పత్రి జూబ్లీ హిల్స్, హైదరాబాద్ అపోలో చిల్డ్రన్స్ పేరుతో - అత్యంత సమగ్రమైన పీడియాట్రిక్ సేవలను ఒకే చోట ప్రారంభించడం ద్వారా, పిల్లలకు అత్యంత నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా మల్టీ-స్పెషాలిటీ కేర్‌కు సంబంధించి, అన్ని సాంకేతిక పురోగతుల విస్తరణను అందించడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్, జూబ్లీ హిల్స్‌లో పీడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్ కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితం కాకుండా భారతదేశం, దేశం వెలుపల అత్యున్నతమైన చికిత్సలను అందించడంలో ప్రసిద్ధి చెందిందన్నారు. నెలలు నిండకుండానే పుట్టిన శిశువులు అయినా లేదా బహుళ-అవయవాలు పనిచేయని పిల్లల సంరక్షణ అయినా సమగ్ర శిశువైద్య సంరక్షణను అందించే అగ్రగామి అత్యాధునికమైన చికిత్సా కేంద్రాలలో అపోలో ఒకటి అన్నారు. పుట్టుకతో వచ్చే రుగ్మతలు, గ్యాస్ట్రోఇంటెస్టినల్, కాలేయ రుగ్మతలు, న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్స్, కార్డియాక్ సమస్యలు, మూత్రపిండ వ్యాధి, ఆంకాలజీ, కాలేయ మార్పిడి వంటి ప్రత్యేక చికిత్సలు ఉంటాయన్నారు. అత్యాధునిక సౌకర్యాలు , ఆధునిక సాంకేతికతను కలిగివున్న అపోలో చిల్డ్రన్స్ అవసరమైన పిల్లలకు అత్యంత నాణ్యమైన సంరక్షణను అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నది. ఈ సందర్భంగా అపోలో, చైర్మెన్, డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మాట్లాడుతూ గత 40 ఏళ్లలో పిల్లల ప్రత్యేక అవసరాలపై అవగాహనల విషయంలో పీడియాట్రిక్ కేర్‌లో అద్భుతమైన ఖ్యాతిని అపోలో పెంచుకోగలిగామని, భారతదేశంలోనే కాకుండా 50కి పైగా ఇతర దేశాల నుండి వచ్చిన పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి సంరక్షణను అందించామన్నారు. వైస్ చైర్మెపర్సన్ ఉపాసన మాట్లాడుతూ అపోలోలో మేము చేసే పనిలో రోగులు వ్యక్తిగత అవసరాలు కలిగిన వ్యక్తులుగా వారికి చికిత్స చేయడంపై దృష్టి పెట్టాలని, అత్యధిక సంఖ్యలో మల్టీడిసిప్లినరీ పీడియాట్రిషియన్స్, అత్యుత్తమ రోగి ఫలితాల వారసత్వం, పిల్లల సంరక్షణను సమగ్రంగా అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సీఈఓ, తేజస్వీ రావు వీరేపల్లి ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ "పిల్లలకు స్నేహపూర్వకమైన వాతావరణాన్ని పెంపొందించడం మా ప్రాథమిక లక్ష్యమని ఆయన అన్నారు. రోగులకు ప్రపంచ స్థాయి సంరక్షణను అందించడానికి అనుభవమున్న వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు.

వర్షాకాలం వచ్చే వ్యాధులతో జాగ్రత్త అవసరం

- డాక్టర్ మురళీధర్ రామప్ప



నవతెలంగాణ-బంజారాహిల్స్

వర్షాకాలం తేమ చెమ్మ బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందడానికి ఒక అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుందని, వీటి వల్ల ఇన్‌ఫెక్షన్ అయ్యి చాలా వరకు అంటుకునే అంటువ్యాధులని, అవి ఒకరినుంచి మరొకరికి ఈజీగా సోకే అవకాశం ఉందని కార్నియా కన్సల్టెన్సీ వైద్య నిపుణులు డా మురళీధర్ రామప్ప అన్నారు. కండ్లకు సంబంధించిన గులాబి రంగు కన్ను లేదా కండ్లకలక వంటి వ్యాధులను నుంచి జాగ్రత్తగా ఉండాలని, కంటి తెల్లభాగాన్ని కనురెప్పల లోపలివైపును కప్పి ఉంచే పల్చటి పొర అయిన కన్జంక్టివా ఇన్ఫమేషనును కండ్లకలక బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇది వైరల్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, పారాసైట్ల పీడనం, అలర్జీలు, లేదా కొన్ని రసాయనాలకు గురికావడంవంటి అనేక కారకాల వలన జరుగుతుందనీ, అడెనోవైరస్ వంటి ఒక ప్రత్యేక వైరసులు సమూహం కారణంగా వచ్చే ఫోలిక్యులర్ కండ్లకలక ఈ కాలంలో అత్యంత సాధారణంగా కనిపిస్తాయన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఒడిషాలలో ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కేంద్రాల న్నింటిలో ఈ సంవత్సరం దాదాపు 1000 కేసులు చికిత్స పొందినట్లు తెలిపారు. ఫోలి క్యులర్ కండ్లకలక రకాలుఫారింగో - కంజని వల్-ఫీవర్ (పిసిఎఫ్) అనబడే గొంతునొప్పితో కండ్లకలక ఇది తరచుగా తేలికపాటిగా ఉంటుందనీ, ఇటీవల జలుబు లేదా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ఉన్న పిల్లలలో , యువకులలో ఇది సాధారణంగా కనిపిస్తుందన్నారు.

రిలే నిరాహార దీక్షలు విరమణ

నవతెలంగాణ-ఓయూ

మాణికేశ్వరి నగర్‌లో స్థానికులు, యూనివర్సిటీ విద్యార్థులకు, సిబ్బందికి ఉపకరించేలా ఆసుపత్రి ఏర్పాటు అంశం పై ప్రభుత్వానికి నివేదించి తగిన నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ తెలిపారు. మాణికేశ్వరి నగర్‌లో ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని స్థానికులు కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ సోమవారం దీక్షా శిబిరాన్ని సందర్శించారు. స్థానికులతో ముచ్చటించారు. మాట్లాడుతూ తమ పరిధిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరిం చామని వివరించారు. ఆస్పత్రి ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చి స్థానికులతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు సైతం ఉపయోగపడేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దాంతో ఆందోళనకారులు తమ దీక్షను విరమిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు ఆలకుంట హరి, యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్, మాణికేశ్వరి నగర్ బస్తీ అధ్యక్షుడు మల్లేష్ తో పాటి అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారు.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకో

- బీఆర్ఎస్ గోషామహల్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రాష్ట్ర ప్రభుత్వంపై అవాక్కులు చివాకులు మాట్లాడి రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవిని పోగొట్టుకున్న బండి సంజయ్ ఇకనైనా నోరు అదుపులో ఉంచుకొని మా ట్లాడడం నేర్చుకోవాలని గోషామహల్ నియోజక వర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్ కుమార్ యాదవ్ ఘాటుగా హెచ్చరించారు. సోమవారం అబిడ్స్‌లోని తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ గోషామహల్ నుంచి మంత్రి అవసరం లేదని మేమే నిన్ను చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. భాజపా జాతీయ హోదాలో ఉండి ఇక్కడి నుంచి పోటీ చేయాలని ఆశిష్ కుమార్ యాదవ్ సవాల్ విసిరారు. రాజా సింగ్‌ను బీజేపీ అధిష్టాన వర్గం సస్పెండ్ చేస్తే మీరు ఆయనకు వత్తాసు పలుకుతూ, మీ పార్టీ అధిష్టాన వర్గాన్ని ధిక్కరిస్తు న్నారా అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర బిజెపి అధ్యక్ష పద విలో ఉండి పిచ్చి ప్రేలాపనలు చేసినందుకే మీ పార్టీ అధి ష్టానం మిమ్మల్ని మార్చింది అన్న విషయాన్ని గుర్తుం చుకో వాలి అన్నారు. ఇప్పటికైనా మారకపోతే తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. గోషామహల్ నియోజక వర్గంలో రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఇదంతా ప్రజలు గ్రహించారని రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీని చిత్తుగా ఓడిస్తారన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, ముందు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూ డాలని ఆవిధంగా కాంట్రాక్టర్ , అధికారులు పనులపై దృష్టి సారించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ ఓవైసీనగర్‌లో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా సీసీ రోడ్డు పనులను, కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రఘునాథ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి స్థానికంగా ఉన్న డ్రయినేజీ సమస్యను పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారం చేయా లని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తని ఎప్పటి కప్పుడు శుభ్రపరచాలని పారిశుద్ధ సిబ్బందికి సూచించారు. డివిజన్‌లో ప్రతి బస్తీలో అవసరమైన ప్రతి చోట నూతన డ్రయి నేజీ, మంచినీటి లైన్లు, నూతన సీసీ రోడ్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఎఈ యాదగిరి రెడ్డి,వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంలో కేరళ ఎప్పుడూ అగ్రభాగంలోనే ఉంటుంది. కొత్త కొత్త నినాదాలు ఇస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అక్కడ వామపక్ష పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి 'కుటుంబ శ్రీ' కార్యక్రమం ప్రారంభించి మహిళ సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం అందిరికీ తెలిసిందే. అందులో భాగంగా 'హరిత కర్మ సేన'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు తమ రాష్ట్రాన్ని హరిత కేరళగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 33,278 మంది హరిత కర్మసేన (హెచ్‌కెఎస్) వాలంటీర్లు ఉన్నారు. వీరంతా మహిళలే. ఇంతకీ ఈ సేన ఏం చేస్తుందో ఈరోజు మానవిలో తెలుసుకుందాం...

క్లీన్ కేరళలో మహిళా సేన



పెరుగుతున్న వ్యర్థపదార్థాలను అదుపు చేసేందుకు స్థానిక స్వపరిపాలన శాఖ (ఎల్‌ఎస్‌జిడి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది హరిత కర్మ సేన (హెచ్‌కెఎస్) సభ్యులు తమ విధులను నిర్వర్తిస్తున్నారు. హెచ్‌కెఎస్ వాలంటీర్లు ప్రతి రోజు తమ పనులను ముగించుకొని ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలను సేకరిస్తారు. ఇది వారికి పార్ట్‌టైం పని మాత్రమే. కాబట్టి మహిళలు తమ పని ముగించుకొని చెత్తను సేకరించే పనిలో భాగస్వామ్యం అవుతారు. రీసైక్లింగ్ కోసం ఇళ్లు, సంస్థల నుండి ష్రెడింగ్ యూనిట్ల నుండి బయోడిగ్రేడబుల్ కాని వ్యర్థాలను సేకరిస్తారు. 'క్లీన్ కేరళ' (చెత్త రహిత కేరళ) కోసం హెచ్‌కెఎస్ పని చేస్తున్నది.

రీసైక్లింగ్ చేస్తారు

సేకరించిన వ్యర్థాలను వివిధ విభాగాలుగా విభజిస్తారు. హెచ్ఎం వైట్, పిపి, హెచ్ఎం, ఎల్‌డిప్రింట్, బజార్, గానీ, బల్బ్, పివిసి, స్టీల్, ట్యూబ్‌లు, బాటిల్, ఈ-వేస్ట్, ఎల్‌డి(గ్లూకోజ్), బాటిల్ క్యాప్స్, స్ప్రే బాటిల్, ప్లాస్టిక్‌ను విభజించి రీసైక్లింగ్ చేస్తారు. పర్యావరణ అనుకూల పదార్థాల తయారీ, వ్యర్థాలను పారవేసే యంత్రాంగ నిర్వహణ, సేంద్రియ ఎరువులను ఉపయోగించి కూరగాయల సాగు, వ్యవసాయం, పర్యావరణ అనుకూల పరికరాలు, కంపోస్ట్ తయారీ వంటి పనులన్నీ హరిత కర్మ సేన సభ్యులే చేస్తారు. ప్రతి కుటుంబశ్రీ కార్యకర్త కనీసం 250 ఇళ్లకు వెళ్లి నాన్‌బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను సేకరిస్తారు. వినియోగదారుని రుసుం ఆధారంగా సేకరణ ఉంటుంది. నెలకు రూ.60 చెల్లించే ఇళ్లకు వారానికి ఒకసారి వెళ్లి చెత్తను సేకరిస్తారు. రూ.800 చెల్లించే ఇళ్లకు ప్రతిరోజూ వెళ్లి చెత్తను సేకరిస్తారు. ఆ మొత్తాన్ని కలిపి వేతనం రూపంలో వాలంటీర్లందరికీ పంచుతారు.

పది కోట్లు గెలుచుకున్నారు

కేరళలోని మలప్పురం జిల్లా పరప్పనంగడిలో 11 హెచ్‌కెఎస్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మాన్సూన్ బంపర్ లాటరీలో రూ. పది కోట్లు గెలుచుకున్నారు. దాంతో హెచ్‌కెఎస్ కార్యక్రమం దేశ మీడియాను ఆకర్షించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అక్కడ హెచ్‌కెఎస్ పని చేస్తుంది. క్లీన్ కేరళ, మహిళా సాధికారిత లక్ష్యంగా ఇది పని చేస్తుంది. 11 మంది హెచ్‌కెఎస్ మహిళలు డబ్బులు పోగుచేసి రూ.250కి లాటరీ టిక్కెట్టు కొనుగోలు చేశారు. 11 మందిలో తొమ్మిది మంది రూ.25 చొప్పున, ఇద్దరు రూ.12.50 చొప్పున డబ్బులు ఇచ్చారు. జులై 27 (గురువారం) నాడు తమకు మొదటి బహుమతి వచ్చిందని ఫోన్ రావడంతో మహిళలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ మహిళల బృందం కొనుగోలు చేసిన నాలుగో బంపర్ లాటరీ టికెట్ ఇది. గతేడాది ఓనం బంపర్ లాటరీలో రూ.1,000 గెలుచుకున్నారు. ఇప్పటి లాటరీ డబ్బులో టాక్స్ పోను గ్రూపులోని ఒక్కొక్క మహిళా సభ్యురాలికి రూ.63.6 లక్షలు అందుతుంది. అయితే తమ పరప్పనంగడి జిల్లాను పరిశుభ్రంగా మార్చేందుకు ఇంకా కృషి చేస్తామని, తాము ఎప్పటికీ కుటుంబశ్రీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలో భాగమైన హెచ్‌కెఎస్ వాలంటీర్లుగానే ఉంటామని వారు చెబుతున్నారు.

సొంత ఇల్లు కొనుక్కుంటా...

పరప్పనంగడి మున్సిపాలిటీ చైర్మన్ ఎ ఉస్మాన్ మాట్లాడుతూ.. 'లాటరీ గెలవడానికి ఈ మహిళలే అత్యంత అర్హులు. లాటరీ గెలుచుకున్న వీరు పరప్పనంగడిని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న హరిత కర్మ సేనకు చెందిన సభ్యులు. కష్టపడి, అంకితభావంతో పనిచేసే బృందం ఇది. లాటరీ ద్వారా అంత డబ్బు వారికి వచ్చినా పరిశుభ్రతలో భాగంగా ఉన్న తమ పనిని ఆపమని చెప్పడమే వారి అంకితభావానికి నిదర్శనం' అన్నారు. 'ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వీరు తమకు వచ్చిన లాటరీ డబ్బును జాగ్రత్తగా ఉపయోగించుకోవడానికి విభిన్న ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు' అని హరిత కర్మ సేన అధ్యక్షురాలు షీజా గణేశన్ అన్నారు. 'నాకు సొంత ఇల్లు లేదు. అలాగే కొన్ని అప్పులు కూడా ఉన్నాయి. నా వాటాగా వచ్చిన డబ్బుతో కొత్త ఇల్లు కట్టుకుని నా అప్పులు తీర్చుకుంటాను' అని హెచ్‌కెఎస్ సభ్యురాలు రాధ అంటున్నారు.

- జె.జగదీశ్వరరావు,
ఢిల్లీ ప్రతినిధి

ఆర్థిక నిర్వహణలో మహిళల పాత్ర

హరిత కర్మ సేన గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. సేన కార్యక్రమాలు ప్రారంభించిన నాటి నుండి ఎలాంటి విమర్శలూ లేకుండా విజయవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో హెచ్‌కెఎస్ వాలంటీర్లకు వేతనం కూడా వస్తుంది. దీంతో వారు ఆర్థికంగా నిలబడేందుకు ఒక వేదికగా మారింది. ఫలితంగా కుటుంబ ఆర్థిక నిర్వహణలో మహిళల పాత్ర కూడా పెరిగింది. మరోవైపు గ్రామాలు పరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పుడు కేరళలో ఎక్కడపడితే అక్కడ చెత్త కనబడదు. కేరళ స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేష్ కేరళ హరిత కర్మ సేన విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వామపక్ష ప్రభుత్వం వచ్చిన తర్వాత కుటుంబ శ్రీ కార్యక్రమంతో పాటు అనేక మహిళా సాధికారిత ప్రాజెక్టులు చేపట్టామని, అందులో హరిత కర్మసేన కూడా ఒకటని ఆయన చెబుతున్నారు.



ఆరెంజ్ ఫేస్‌ప్యాక్...



కృత్రిమ లోషన్లు, క్రీములూ ముఖానికి అప్లై చేయించుకొని సైడ్ ఎఫెక్ట్స్ తెచ్చుకోవడం కంటే ఇంట్లోనే ఉంటూ అదిరిపోయే ఫేస్ ప్యాక్ చేసుకోవచ్చు. మార్కెట్లో లభించే పండ్లతోనే చాలా వెరైటీస్ తయారు చేసుకోవచ్చు. ఎందుకంటే పండ్లలో సహజ సిద్ధంగా ఉండే విటమిన్లు, మినరల్స్ మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి వల్ల మన ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. ముఖ్యంగా నారింజ పండ్లు చర్మం మెరిసేలా చేస్తాయి.

ఫేస్‌ప్యాక్ తయారీకి కావాల్సినవి: మూడు టీస్పూన్ల ఆరెంజ్ జ్యూస్, రెండు టీస్పూన్ల అలోవెరా (కలబంద) గుజ్జు, టీస్పూన్ గ్లిజరిన్.

తయారీ విధానం: పైన చెప్పుకున్న మూడింటినీ ఓ గిన్నెలో వేసి బాగా కలపాలి. అది పేస్టులా అయ్యాక ముఖానికి పట్టించాలి. 20 నిమిషాలు అలా ఆరనివ్వాలి. ఆ తర్వాత పరిశుభ్రమైన నీటితో కడిగేసుకోవాలి. ఆరెంజెస్, ఆలోవెరా, గ్లిజరిన్ ఈ మూడింటిలోనూ చర్మాన్ని మృదువుగా, మెరిసేలా చేసే గుణాలుంటాయి. ఇవి చర్మంలో పొడిదనాన్ని తగ్గిస్తాయి. అందువల్ల చర్మం నిగారిస్తుంది. ఈ ఆరెంజ్ ఫేస్ ప్యాక్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి చర్మ కణాల్ని కాపాడి, మృతకణాల్ని తరిమేసి ముడతల్ని పోగొడతాయి. చర్మంపై చిన్నదైనా, పెద్దదైనా గాయం ఉన్నచోట ఈ ప్యాక్ అప్లై చేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది.

విటమిన్ సి కారణంగా ఈ ప్యాక్ బ్లీచింగ్‌లా పనిచేస్తుంది. అంటే చర్మంపై అవసరం లేని కణాలను పంపేయడం, కొత్త కణాలు వచ్చేలా చేయడం వంటివి జరుగుతాయి. అందువల్ల చర్మం మెరుస్తుంది. ముఖ్యంగా ఆరెంజెస్, అలోవీరా ఈ రెండూ... చర్మాన్ని క్లీన్ చేయడంలో బాగా పనిచేస్తాయి. ముఖంపై మచ్చలు ఉంటే పోగొడతాయి. కాబట్టి వారాలకు ఒక్కసారైనా ఈ ప్యాక్ అప్లై చేసుకుంటే మంచిది.

పద్దెనిమిది నిమిషాల్లో...



ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న సమస్య నిద్రలేమి. చాలా మంది తమకు నిద్ర పట్టట్లేదంటూ బాధపడుతుంటారు. కొందరైతే నిద్రమాత్రలు వాడుతున్నామంటారు. ఇది ప్రమాదకరం. నిద్రలేమి అనే మానసిక సమస్య ఇప్పుడు ప్రపంచమంతా ఉంది. దీనికి కారణం అనేక రకాలఒత్తిళ్లు, టెన్షన్లు, శారీరక అలసట, సోషల్ మీడియా గాసిప్‌లు, రణగొణ ధ్వనులు... ఇలా ఎన్నో అంశాలు మన నిద్రను చెడగొడుతున్నాయి. అయితే కొన్ని చిట్కాలకు పాటిస్తే ఎవరైనా సరే బెడ్ ఎక్కిన 18 నిమిషాల్లో నిద్రపోవచ్చు అంటున్నారు సైకాలజిస్టులు. అదెలాగో మనమూ తెలుసుకుందాం.

నిద్రపోవడానికి నిద్రమాత్రలకు ఒక్కసారి అలవాటైతే... ఇక ప్రతిసారీ వేసుకునేలా చేస్తాయి. అందుకే సైకాలజిస్టులు నిద్ర కోసం టాబ్లెట్లు వాడమని ఎప్పుడూ చెప్పరు. తాజాగా ప్రముఖ జర్నల్ ఎక్స్‌పెరిమెంటల్ సైకాలజీలో ఎలా నిద్రపోవాలో సలహా ఇచ్చారు. ఈ అధ్యయనాన్ని అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ బేలార్‌లో 56 మంది సైకాలజీ ప్రొఫెసర్లు నిర్వహించారు. 57 మందిని రెండు గ్రూపులుగా విభజించారు. ఓ గ్రూపును... నిద్రపోయే ముందు తాము ఆ రోజు ఏం చేసిందీ ఓ బుక్కులో రాయమన్నారు. మరో టీమ్‌ని వాళ్ల తర్వాత రోజు ఏం చేయాలనుకుంటున్నారో ఓ బుక్కులో రాయమన్నారు. ఈ పరిశోధనలో... ఆ రోజు ఏం చేసిందీ రాయమన్న వారు ఆలస్యంగా నిద్ర పోతున్నారు. తర్వాత రోజు ఏం చేయాలో రాయాలనుకున్నవారు వెంటనే నిద్రలోకి జారిపోతున్నారు. ఇలా ఎందుకంటే ఏదైనా జరగబోయేది ఆలోచిస్తూ ఉంటే ఆటోమేటిక్‌గా నరాలు రిలాక్స్ అవుతూ నిద్రలోకి జారిపోతారట. ఇకపై నిద్రపట్టని వాళ్లు ఇది ఫాలో అయిపోతే సరి అంటున్నారు సైకాలజిస్టులు.

గ్రామసభల ద్వారానే దళితబంధుకు ఎంపిక

(మొదటిపేజీ తరువాయి)

చొప్పున పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ పథకం లక్ష్యం మంచిదే అయినప్పటికీ, అర్హుల ఎంపిక ప్రక్రియ సక్రమంగా లేదని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు, జిల్లాల కలెక్టర్ల సమన్వయంతో లబ్ధిదారుల ఎంపిక జరగాలనే ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల్లోనే ఎంపిక పూర్తవుతున్నదని తెలిపారు. ఆ జాబితాను కలెక్టర్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. పైరవీకారులు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.మూడు లక్షల వరకు కమీషన్లు తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

రాహుల్ ఈజ్ బ్యాక్

(మొదటిపేజీ తరువాయి)

జైలుశిక్ష తీర్పు ఆగస్టు 4న సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాహుల్‌పై అనర్హత ఆదేశాలను నిలుపుదల చేస్తున్నట్లు లోక్‌సభ సచివాలయం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆయన ఎంపీగా కొనసాగుతారని తెలిపింది. ఈ మేరకు రాహుల్ గాంధీకి లోక్‌సభ సచివాలయం సమాచారం అందించింది. పార్లమెంట్ సభ్యత్వం పునరుద్ధరణ కాపీ ఇవ్వడంతో.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ దాదాపు నాలుగు నెలల తరువాత పార్లమెంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం భవనంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీల ఎంపీలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పార్లమెంట్‌లోకి సాదరంగా ఆహ్వానం పలికారు. కాగా అవిశ్వాస తీర్మానంపై చర్చను రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు.

వనమాకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు హాజరుకాకపోవడం, ఆయా ఎన్నికల్లో సమర్పించిన ప్రమాణపత్రాల వివరాలు, ఒక భార్య ఉన్నారా? లేదా ఇద్దరు భార్యలు ఉన్నారా? తదితర అంశాలన్నీ పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నందున వనమా వెంకటేశ్వరరావుపై అనర్హతను కొనసాగించాలని దామా శేషాద్రి నాయుడు కోరారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించిన ధర్మాసనం ప్రతివాదులు జలగం వెంకటరావు, తదితరులకు నోటీసులు జారీ చేసింది. అదనపు ఆధారాలు సమర్పించడానికి పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది హరీస్ రావెల్‌కు అనుమతించింది. ప్రతివాదులు రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలన్న ధర్మాసనం రిజాయిండర్‌కు మరో రెండు వారాలు గడువు ఇచ్చింది.

ఆగిన మరో జీపీ కార్మికుడి గుండె

(మొదటిపేజీ తరువాయి)

కోసం చేస్తున్న సమ్మెలో పాల్గొంటున్నాడు. నెల రోజులు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మల్లేశం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య సత్తవ్వ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. సీఐటీయూ నాయకులు, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ప్రధాన రహదారిపై మల్లేశం మృతదేహాన్ని పెట్టి.. ధర్నా చేశారు. కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య డిమాండ్ చేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే బెంగతోనే మల్లేశం చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ నవత, ఎంపీడీవో నరేష్, సర్పంచ్ పాటి దినకర్ ఘటనాస్థలానికి వచ్చి.. ప్రభుత్వంతో మాట్లాడి సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి తక్షణ సాయం రూ.10 వేలు ఇవ్వడంతో ధర్నా విరమించారు.

పోలవరం నిర్వాసితులది జాతీయ సమస్య

న్యూఢిల్లీ : పోలవరం నిర్వాసితుల సమస్య జాతీయ సమస్యగా మారిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. పరిహారం, పునరావాసం కేంద్రం బాధ్యతేనని, అది పూర్తి కాకపోతే..ప్రాజెక్టు కొనసాగదని హెచ్చరించారు. సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై ధర్నా జరిగింది. ఈ ధర్నాను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఢిల్లీలో ధర్నా చేస్తున్నామని, ఢిల్లీ ద్వారా దేశం ముందుకు ఈ సమస్యను తీసుకొచ్చామని అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దీనిపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత కేంద్రంపై ఉంటుందని తెలిపారు. పునరావాసం అవసరమైన వనరులను సమకూర్చడం కేంద్రం బాధ్యతని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకోవాలని, అంతేతప్ప పోలవరం నిర్వాసితులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆత్మ సమర్పణ చేసుకుందని విమర్శించారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్లో పోలవరం గురించి లేవనెత్తానని, కాంగ్రెస్ జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో పొందుపరిచిందని అన్నారు. అప్పుడు బీజేపీ కూడా పోలవరం పునరావాసం, పరిహారంపై ఒప్పుకుందని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి నిధులు ఇవ్వటం లేదని విమర్శించారు.

గిరిజన హక్కులపై మోడీ సర్కార్ బుల్డోజర్ . బృందాకరత్

గిరిజన హక్కులపై మోడీ సర్కార్ బుల్డోజర్‌తో దాడి చేస్తుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో అభివృద్ధి పేరుతో పెట్టుబడిదారులు ఆదివాసీ గుండెలపై ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని విమర్శించారు. జాతీయ ప్రాజెక్టు అంటున్నారని, ఆదివాసులు జాతీయులు కాదా? అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్‌లో, అటవీ హక్కుల చట్టం, పంచాయతీ విస్తరణ షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టం ఆదివాసుల హక్కులను స్పష్టం చేసిందని తెలిపారు. కానీ అందుకు భిన్నంగా పెట్టుబడిదారుల అభివృద్ధి కోసం మోడీ పని చేస్తున్నారని. మణిపూర్‌లోని గిరిజనుల భూములను కార్పొరేట్లకు ఇస్తున్నారని, జార్ఖండ్‌లో కూడా గిరిజనుల భూములను లాక్కొంటున్నారని, బెంగాల్‌లో కోల్ ప్రాజెక్టు పేరుతో వేలాది ఎకరాల ఆదివాసీ భూములను కేంద్రం తీసుకున్నదని విమర్శించారు. దీంతో ఆదివాసీ భూములు, హక్కుల, గుర్తింపు సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అటవీ సంరక్షణ సవరణ చట్టం చేశారని, ఇది ఆదివాసులకు ఉండే హక్కులను హరిస్తుందని విమర్శించారు. గిరిజన భూములు తీసుకోవాలంటే గ్రామ సభలు నిర్వహించాలని, అయితే ఈ చట్టం గ్రామ సభల అవసరం లేకుండానే భూములు లాక్కొవచ్చని పేర్కొందన్నారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ పక్షంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈడీ, సీబీఐకి భయపడి ఏపీలో జగన్మోహన్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావటం లేదని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన మాట్లాడటం లేదని విమర్శించారు.

జీవన్మరణ పోరాటం : అశోక్ ధావలే, విజ్జు కృష్ణన్

పోలవరం నిర్వాసితులు జీవన్మరణ పోరాటం చేస్తున్నారని ఏఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజ్జు కృష్ణన్ అన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీజేపీకి సేవ చేస్తున్నారని, పోలవరం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే వైసీపీ, టీడీపీ, బీజేపీలకు సరైన సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

టీడీపీకి పట్టిన గతే, వైసీపీకి పడుతుంది : బి.వెంకట్

ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు గిరిజనులు, పేదల పక్షాన లేకుండా బీజేపీ పంచన చేరాయని ఏఐఎడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పేర్కొన్నారు. గతంలో టీడీపీకి పట్టిన గతే, వైసీపీకి పడుతుందని అన్నారు. బీజేపీతో ఉన్న పవన్ కళ్యాణ్ మరో జగన్మోహన్ రెడ్డిగా మారాడని విమర్శించారు.



గిరిజనులు జాతిలో భాగం కాదా? జితిన్ చౌదరి

ప్రధాని మోడీ ఎప్పుడూ జాతి అంటారని, గిరిజనులు జాతిలో భాగం కాదా? అని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ జితిన్ చౌదరి ప్రశ్నించారు. గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని, గిరిజనులను భూముల నుంచి తరిమేసి, ప్రాజెక్టులు కడుతోందని విమర్శించారు. ఆదివాసీ కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యంగా చేసుకుందని దుయ్యబట్టారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి తమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకుండా, ప్రాజెక్టు ఎలా ముందుకు సాగుతోందని ప్రశ్నించారు.

పార్లమెంట్‌లో లేవనెత్తుతాం వి.శివదాసన్

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పార్లమెంట్‌లో లేవనెత్తుతామని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ వి.శివదాసన్ హామీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పట్టవని, వారు బీజేపీకి మద్దతుగా ఉన్నారని అన్నారు. కార్పొరేట్లకు సాగిలపడటమే ధ్యేయంగా పని చేసే బీజేపీలానే, వైసీపీ కూడా కార్పొరేట్ల కోసమే పని చేస్తుందని విమర్శించారు.

కదం తొక్కిన పోలవరం నిర్వాసితులు

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. "పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం చెల్లించాలి. 1986,2022 సంవత్సరాల్లో సంభవించిన వరదల్లో మునిగిన గ్రామాలన్నింటినీ మొదటి దశ పునరావాసంలో కలపాలి. గోదావరి వరదల నుంచి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలి. కేంద్రం జాతీయ విపత్తు నిధులు ఇవ్వాలి. తప్పుల తడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలి. రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 కింద ఉన్న గిరిజనుల ప్రత్యేక హక్కులను కాపాడాలి" వంటి డిమాండ్ల కోసం నినదించారు. గిరిజనులు అందులోనూ మహిళలు, యువత తమ హక్కుల సాధన కోసం వేల కిలో మీటర్లు ప్రయాణించి, వ్యయ ప్రయాసలతో ఢిల్లీకి చేరుకున్నారు. మోడీ ప్రభుత్వాన్ని గర్జించేందుకు ఆదివాసీ గొంతెలు ఎక్కు పెట్టారు. ప్రజా నాట్య మండలి కార్యకర్తలుక నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను, గోడును వినిపించారు. అలాగే పెట్టుబడిదారులు, కార్పొరేట్లు, మతోన్మాదుల నుంచి స్వేచ్ఛ కోరుతూ చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితర నాయకులు అభివాదం చేశారు. అనంతరం నేతలు విల్లు ఎక్కుపెట్టి ధర్నాను ప్రారంభించారు. ఈ ధర్నాకు ఆర్.లక్ష్మయ్య (సీఐటీయూ), విపి సాను (ఎస్ఎఫ్ఐ), అయోధ్య రామ్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ నేత) తదితర ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, తెలంగాణ నేత బండారు రవి కుమార్, పశ్చిమ బెంగాల్ మాజీ ఎంపీ పులెన్ బస్, జార్ఖండ్ నేత సుభాష్ ముర్ము, సీపీఐ(ఎం) రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగమణి, రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వాణి శ్రీ, వి.ఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై మహిళా కమిటీ

న్యూఢిల్లీ : మణిపూర్ ఘటనపై విచారణకు ముగ్గురు మహిళా న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ షాలినీ పన్సాల్కర్ జోషి, జస్టిస్ ఆషా మీనన్‌లతో కూడిన కమిటీని నియమిస్తున్నట్టు వెల్లడించింది. ఈ కమిటీ పునరావాసం, పరిహారంపై అధ్యయనం చేయనుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ ఆదేశించారు.

జస్టిస్ గీతా మిట్టల్ జమ్ము కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి. జస్టిస్ జోషి బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి. జస్టిస్ మీనన్ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహించి రిటైరయ్యారు.

అలాగే సీబీఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు ఓ అధికారిని నియమిస్తున్నట్టు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. దీంతో న్యాయ విచారణపై విశ్వాసాన్ని జోడిస్తున్నామని పేర్కొంది. విచారణ నివేదికను ఆ అధికారి కోర్టుకు సమర్పించాలని సూచించింది . మహారాష్ట్ర మాజీ డీజీపీ , ముంబయి పోలీస్ కమిషనర్ అయిన దత్తాత్రేయ పద్సల్గికర్‌ను పర్యవేక్షక అధికారిగా నియమిస్తున్నట్టు వెల్లడించింది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

- కేంద్రానికి మాజీ ఉన్నతాధికారుల వినతి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ ఉన్నతాధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రమాదకరమైన పరిస్థితి నెలకొన్నదని, జాతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని వారు హెచ్చరించారు. భిన్నత్వంలో ఏకత్వానికి పునాది అయిన సామరస్యం, సోదరభావం స్ఫూర్తిని మణిపూర్ పరిస్థితులు ప్రశ్నిస్తున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడడంలో బీరేన్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. 'రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉద్దేశపూర్వకంగానే కుట్ర పన్ని మారణహోమం సృష్టించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గృహ దహనాలు, దోపిడీలు, సామూహిక అత్యాచారాలు జరిగాయి.

విధ్వంసకాండ యథేచ్ఛగా సాగింది. దుండగులు స్వైరవిహారం చేసి బీభత్సం సృష్టించారు. విధులు నిర్వర్తించకుండా కేంద్ర భద్రతా దళాలను అడ్డుకున్నారు. రెండు తెగల వారూ ప్రతీకారేచ్ఛతో ఆయుధాలతో పరస్పరం దాడులకు తెగబడ్డారు' అని 110 మంది ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు కేంద్రానికి వివరించారు. రాష్ట్రంలో ఇంటర్నెట్‌పై నిషేధం విధించడంతో హింసాకాండకు సంబంధించిన సమాచారం బయటకు రాలేదని, దీంతో తప్పుడు వార్తలు, వదంతులు వ్యాపించాయని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుండి ఆయుధాలు దోచుకున్న ఉదంతాలపై మాజీ ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. హింసకు పాల్పడిన మైతీ తెగ వారికి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ బాసటగా నిలవడంపై మండిపడ్డారు. పైగా ఆయన ఒక తెగ వారిని లక్ష్యంగా చేసుకొని అక్రమ వలసదారులని, ఆక్రమణదారులని, ఉగ్రవాదులని, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తారని నిందిస్తున్నారని తెలిపారు.

సమస్యకు రాజకీయ పరిష్కారం సాధించే ప్రయత్నంలో ప్రతిపక్షాలను భాగస్వాములను చేసే సువర్ణావకాశాన్ని వినియోగించుకోవడంలో కేంద్రం విఫలమైందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేయకపోవడాన్ని వారు తప్పుపట్టారు. బాధిత ప్రజల కోసం నిస్వార్థంగా సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని, తగిన నష్టపరిహారం అందజేయాలని కేంద్రాన్ని కోరారు. సమస్య పరిష్కారంలో కేంద్రం కానీ, జాతుల వారు కానీ ప్రతిష్టకు పోవాల్సిన అవసరం లేదని హితవు పలికారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం సంయమనంతో స్పందించాల్సిన అవసరం ఉన్నదని వారు తెలిపారు.

ప్రజాస్వామ్య విజయం

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎప్పటికైనా న్యాయం గెలిచితీరుతుందని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలకుల నిరంకుశ వైఖరికి ఇది చెంపపెట్టు లాంటిదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన్ను తిరిగి పార్లమెంట్‌కు సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్


సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, నేతలు చెరుపల్లి, జూలకంటి


సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సినీ నటుడు మాదాల రవి


పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కళారవికి కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. పెద్ద ఎత్తున కవులు, రచయితలు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై కడసారి వీడ్కోలు పలికారు. మహాబోధి స్కూల్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. స్కూల్‌లోకి ఎక్కువ మందికి స్థలం సరిపోదని పోలీసులు చెప్పినా వినకుండా జనం తోసుకుంటూ వెళ్లడంతో వారిని అదుపు చేసేందుకు స్వల్ప లాఠీచార్జి చేయాల్సి వచ్చింది.

ప్రముఖుల నివాళులు..

ఎల్బీ స్టేడియంలో గద్దర్ భౌతికకాయానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, డి.జి.నర్సింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, ఎంవీ రమణ, హిమబిందు, సీనియర్ నాయకులు జి.రాములు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, పత్రికా సంపాదకులు మాణిక్‌రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు పల్లా వెంకట్ రెడ్డి, మాదాల రవి, నవతెలంగాణ ఇన్‌చార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, ఫీచర్స్ ఎడిటర్ ఆనందాచారి, తెలంగాణ సాహితి రాష్ట్ర సహాయ కార్యదర్శి అనోంతజు మోహన్‌కృష్ణ, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తెలంగాణ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ.రమణ, మంత్రులు సబితా


నవతెలంగాణ ఇన్‌చార్జి ఎడిటర్ రాంపల్లి రమేశ్, ఫీచర్స్ ఎడిటర్ ఆనందాచారి


విమలక్క తదితరులు

ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి.. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ మానిక్‌రావు థాక్రే, ఎంపీలు రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, సీతక్క, రఘునందన్‌రావు, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మెన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్ గజ్జెల నగేష్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, మల్లు రవి, హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజనీ కుమార్ యాదవ్, అజారుద్దీన్, బూర నర్సయ్య గౌడ్, సంపత్ కుమార్, గరికపాటి నర్సింహరావు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, సినీ ప్రముఖులు మంచు మోహన్‌బాబు, మనోజ్, కొణిదెల నాగబాబు, నిహారిక, అలీ, ఆర్.నారాయణ మూర్తి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, విమలక్క, నందిని సిధారెడ్డి, దేవీప్రసాద్, మాజీ ఐఏఎస్ అకునూరి మురళి, పీవోడబ్ల్యూ సంధ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి, సికింద్రాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, క్రిశాంక్, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సి.కాశీం, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు మమత, సత్యనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు గద్దర్‌కు నివాళులర్పించారు.



అంతిమ యాత్రలో కళాప్రదర్శనలు..

గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో పూర్తి చేశారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో లంబాడీల డ్యాన్సులు, జానపద కళాకారులు ఆటపాటలు ప్రదర్శించారు. ప్రజాసంఘాల నాయకులు అంతిమయాత్ర కొనసాగిన దారిలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, అధ్యక్షులు వేముల ఆనంద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రాజు రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గుల ప్రభాకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జక్కిడి నరసింహారెడ్డి, హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు గోపాల్, పి.వెంకట్ రెడ్డి, ఆర్.సైదులు శ్రద్ధాంజలి గీతాలు ఆలపించారు.


గద్దర్ అంతిమ యాత్ర

గద్దర్ అంత్యక్రియల్లో విషాదం

గుండెపోటుతో సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ మృతి

- భారీగా తరలివచ్చిన జనం
- అల్వాల్‌లో తోపులాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియల్లో విషాదం చోటుచేసుకుంది. కడసారి చూపు కోసం వచ్చిన అభిమానులు, శ్రేయోభిలాషులతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌లో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో గద్దర్‌కి అత్యంత ఆప్తుడు, సియాసత్ ఉర్దూ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్(63) గుండెపోటుతో మృతిచెందారు. భారీగా తరలివచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేక పోవడంతో తోపులాట జరిగింది. సియాసత్ ఉర్దూ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ కిందపడిపోయారు. వెంటనే పక్కనే ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

జహీరుద్దీన్ అలీఖాన్ గద్దర్‌కు అత్యంత సన్నిహితుడు. ఎల్బీ స్టేడియంలో నివాళ్లర్పించాక.. వాహనంలో గద్దర్ భౌతికకాయం వెంటే ఆయన కూడా ఇంటికి చేరుకున్నారు. అంత్యక్రియల సమయంలో కిక్కిరిసిన జనం ఉండటంతో జహీరుద్దీన్ కింద పడిపోయారు. ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. కార్డియాక్ అరెస్టుతో మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈయన కూడా తెలంగాణ కళాకారుడే. గద్దర్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం జరిగిన విద్యావంతుల వేదిక సదస్సులో కూడా జహీరుద్దీన్ పాల్గొన్నారు. గద్దర్ చనిపోయారని తెలుసుకున్న జహీర్ వెంటనే అపోలో ఆస్పత్రికి చేరుకున్నారు.

అప్పట్నుంచీ గద్దర్ అంత్యక్రియలు ముగిసే వరకూ వెన్నంటే ఉన్నారు. అయితే, అల్వాల్‌లోని మహాబోధి స్కూల్ వద్ద స్థలం సరిపోకపోవడం.. పోలీసులు ముందుగానే హెచ్చరించినా జనాలు తోసుకుని లోపలికి వెళ్లడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో సొమ్మసిల్లి పడిపోయిన జహీరుద్దీన్ ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయారు.

ఉర్దూ పత్రికా ప్రపంచానికి తీరనిలోటు
జహీరుద్దీన్ అలీఖాన్ మరణం పట్ల సీఎం కేసీఆర్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్ : **సియాసత్ ఉర్దూ** దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన మరణం ఉర్దూ పత్రికా ప్రపంచానికి తీరనిలోటని తెలిపారు. పత్రికా సంపాదకుడుగా తెలంగాణ ఉద్యమంలో అలీఖాన్ పోషించిన పాత్రను, వారి సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అలీఖాన్ కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు కూడా అలీఖాన్ మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

ఇక చావోరేవో!

ఆటలు

- నిలవాలంటే తప్పక గెలవాల్సిందే
- హార్దిక్‌సేనకు నేడు విషమ పరీక్ష
- సిరీస్ విజయంపై విండీస్ గురి

భారత్, వెస్టిండీస్ మూడో టీ20 నేడు

టీమ్ ఇండియాకు ఇక చావోరేవో. టీ20 సిరీస్‌పై ఆశలు నిలవాలంటే నేడు మూడో టీ20లో కచ్చితంగా నెగ్గి తీరాల్సిందే. లేదంటే, 2016 తర్వాత తొలిసారి భారత్‌పై కరీబియన్లు ద్వైపాక్షిక టీ20 సిరీస్ సొంతం చేసుకోవటం లాంఛనమే కానుంది. 2-0 ఆధిక్యంలో నిలిచిన ఆతిథ్య వెస్టిండీస్ నేడు సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్ లైనప్ అంచనాలను అందుకుంటేనే నేడు కీలక మ్యాచ్‌లో హార్దిక్‌సేన గెలుపుపై కన్నేయగలదు. మరి భారత బ్యాటర్లు మూడో మ్యాచ్‌లోనైనా మెరుగైన ఆట తీరు కనబరుస్తారా? సిరీస్‌పై ఆశలు సజీవంగా నిలుపుతారా? ఆసక్తికరం.





నవతెలంగాణ-ప్రావిడెన్స్

కరీబియన్ పర్యటనలో భారత జట్టు తొలిసారి ఒత్తిడిలో పడింది. పొట్టి ఫార్మాట్‌లో ఆతిథ్య జట్టు కుర్రాళ్ల కదం తొక్కుతుండగా.. స్లో పిచ్‌లపై పరుగుల వేటలో భారత బ్యాటర్లు తడబాడుతున్నారు. తొలి రెండు మ్యాచుల్లో వెస్టిండీస్ విజయం సాధించగా.. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో నేడు సిరీస్ సొంతం చేసుకునేందుకు కరీబియన్లు బరిలోకి దిగుతున్నారు. మరోవైపు హార్దిక్‌సేన బ్యాటింగ్ లోపాలను సరిచేసుకునేందుకు ఇబ్బంది పడుతుంది. ఎదురుదాడి వ్యూహంలో భాగంగా టాప్ ఆర్డర్ ధనాధన్ మోత మోగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. నిలకడగా నిరాశపరుస్తున్నారు. నేడూ బ్యాటర్లు తేలిపోతే.. సుదీర్ఘ విరామం అనంతరం విండీస్ చేతిలో టీ20 సిరీస్ పరాజయం చవిచూడాల్సిన ప్రమాదం పొంచి ఉంది. భారత్, వెస్టిండీస్ మూడో టీ20 నేడు. రాత్రి 8 గంటలకు డిడి స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం.

బ్యాటర్లు మెరిస్తేనే :

ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్. పొట్టి ఫార్మాట్‌లో మంచి రికార్డున్న బ్యాటర్లు. అయినా, స్లో వికెట్‌పై పరుగులు చేసేందుకు తంటాలు పడుతున్నారు. శుభ్‌మన్ గిల్ ఐపీఎల్ తర్వాత నిలకడగా విఫలమవుతుండగా.. ఇషాన్ కిషన్ మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోతున్నాడు. ఇక సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్ కరీబియన్ టూర్‌లో కొనసాగుతుంది. టాప్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాటర్లు నిలకడగా అంచనాలు అందుకోవటం లేదు. దీంతో భారత్ బ్యాట్‌తో ఆశించిన స్కోరు సాధించటం లేదు. యువ బ్యాటర్ తిలక్ వర్మ తొలి రెండు మ్యాచుల్లోనూ ఆదుకున్నాడు. సంజు శాంసన్, హార్దిక్ పాండ్య సైతం స్థాయికి తగ్గ ప్రదర్శన చేయటం లేదు. బ్యాటర్లు తేలిపోతున్న పిచ్‌లపై ఓ అదనపు బ్యాటర్‌ను తుది జట్టులోకి తీసుకునే ఆలోచన సైతం ఉంది. ముగ్గురు స్పిన్నర్లలో ఒకరిపై వేటు వేసి యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో ఆడించే అవకాశం లేకపోలేదు. అయితే, హార్దిక్ పాండ్య ఈ ఆలోచనకు అంత సుముఖంగా లేనట్టు కనిపిస్తుంది. బౌలింగ్ విభాగంలో అర్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్‌లు డెత్ ఓవర్లలో మరింత మెరుగైన ప్రదర్శన చేయాల్సి అవసరం ఉంది. అక్షర్ పటేల్ గత మ్యాచ్‌లో ఒక్క ఓవర్ కూడా వేయలేదు. కుల్దీప్ ఫిట్‌నెస్ సాధిస్తే రవి బిష్ణోయ్ స్థానంలో తుది జట్టులోకి రానున్నాడు. యుజ్వేంద్ర చాహల్ మరోసారి భారత్‌కు కీలకం కానున్నాడు.

కరీబియన్ల ఉత్సాహం

ఆల్‌రౌండ్ల అండతో ఆతిథ్య వెస్టిండీస్ ముచ్చటగా మూడో విజయంపై కన్నేసింది. లోతైన బ్యాటింగ్ లైనప్ ఉండటంతో ఆ జట్టు ఒత్తిడిలోనూ రాణిస్తోంది. నికోలస్ పూరన్, షిమ్రోన్ హెట్‌మయర్‌లు ఫామ్‌లో ఉన్నారు. భారత బౌలర్లను ఎదుర్కొని విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేస్తున్నారు. బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్ ఆరంభంలో ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. కొత్త బంతిని ఎదుర్కొని నిలబడలేకపోతున్నారు. జాన్సన్ చార్లెస్, రోవ్‌మాన్ పావెల్‌లు సైతం రాణిస్తే ఆతిథ్య జట్టుకు తిరుగుండదు. ఒబెడ్ మెక్‌కాయ్, అల్జారీ జొసెఫ్, రోమారియో షెఫర్డ్, జేసన్ హోల్డర్‌లు బంతితో సమిష్టిగా రాణిస్తున్నారు. నేడూ కరీబియన్ కుర్రాళ్లు మెరిస్తే.. సిరీస్ వేదిక అమెరికాకు మారకముందే వెస్టిండీస్ సొంతం కానుంది!.

పిచ్ రిపోర్టు

ప్రావిడెన్స్ స్టేడియంలో సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 127 పరుగులు. ఇక్కడ ఆతిథ్య జట్టుకు మంచి రికార్డు లేదు. అయినా, రెండో టీ20లో కరీబియన్లు పైచేయి సాధించారు. మ్యాచ్ సాగుతున్న కొద్దీ పిచ్ మరీ నెమ్మదించటంతో స్పిన్నర్లకు అనుకూలత ఎక్కువగా లభిస్తోంది. ఆరంభంలో పేసర్లకు మంచి సహకారం లభిస్తుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

వర్షం సూచనలు

భారత్, విండీస్ మూడో టీ20కి సైతం వర్షం ముప్పు కనిపిస్తోంది. మంగళవారం ఇక్కడ 50 శాతం వర్షం కురువనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్ ఉదయం 10.30 గంటలకు ఆరంభం అవుతుండగా.. మ్యాచ్ సమయంలోనూ చిరు జల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, సంజు శాంసన్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్/యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్/కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, ముకేశ్ కుమార్.

వెస్టిండీస్ : బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, జాన్సన్ చార్లెస్, నికోలస్ పూరన్, రోవ్‌మాన్ పావెల్, షిమ్రోన్ హెట్‌మయర్, రోమారియో షెఫర్డ్, జేసన్ హోల్డర్, అకీల్ హొసేన్, అల్జారీ జొసెఫ్, ఒబెడ్ మెక్‌కాయ్.



క్రీడా సంఘాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

జీఓ ఎం.ఎస్ నం.4పై శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్

నవతెలంగాణ-హైదరాబాద్

క్రీడా రంగంలో మెరుగైన ఫలితాలు, క్రీడాకారుల ఉజ్వల భవిత దృష్ట్యా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని క్రీడా సంఘాలు జీఓ ఎం.ఎస్ నం.4 ప్రకారం ప్రభుత్వ రూపొందించిన నిబంధనలు పాటించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం, పలు క్రీడా సంఘాల ప్రతినిధులతో సోమవారం ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలో శాట్స్ చైర్మెన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 'మెరుగైన క్రీడా ఫలితాలు, క్రీడాకారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పథకాలు అథ్లెట్లకు చేరేందుకు జీఓ ఎం.ఎస్ నం.4 అమలు అనివార్యం. ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు రాష్ట్రంలోని క్రీడాకారులు అందరికీ చేరాలి. అందుకోసం క్రీడా సంఘాలు తమ వంతు బాధ్యత పోషించాలి. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, అవసరమైన అన్ని పత్రాలను శాట్స్‌కు సమర్పించాలి. క్రీడా సంఘాల్లో సమస్యల పరిష్కారానికి శాట్స్ చొరవ తీసుకుంటుందని' ఆంజనేయ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, శాట్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వీఎస్ సంపత్

నియమించిన జస్టిస్ ఎల్. నాగేశ్వర రావు

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. విరుద్ధ ప్రయోజనాలు, బహుళ క్లబ్‌ల యాజమాన్యం సహా పలు కారణాలతో 57 క్రికెట్ క్లబ్‌లను మూడేండ్ల పాటు ఎలక్టోరల్ జాబితా నుంచి తొలగిస్తూ సుప్రీంకోర్టు నియమిత ఏకసభ్య కమిటీ జస్టిస్ లావు నాగేశ్వర రావు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 15న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో.. భారత మాజీ ముఖ్య ఎన్నికల కమిషనర్ వీఎస్ సంపత్‌ను హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా భారత ఎన్నికల కమిషనర్‌గా పని చేసిన వ్యక్తిని నియమించాలని 2018లో హెచ్‌సీఏ రూల్స్‌లో పొందుపరిచారు. అపెక్స్ కౌన్సిల్ తరఫున జస్టిస్ నాగేశ్వరరావు ఈ మేరకు వీఎస్ సంపత్‌ను నియమించారు. ఎన్నికల నిర్వహణలో ఎవరైనా సహాయకుడిని నియమించుకునే స్వేచ్ఛ, వెసులుబాటును వీఎస్ సంపత్‌కు కల్పించారు. ఇక, విరుద్ధ ప్రయోజనాలతో ఓటు హక్కు తొలగించడాన్ని ఓ సభ్యుడు ఏక సభ్య కమిటీకి ఫిర్యాదు చేయగా.. ఆ ఫిర్యాదుపై సైతం వీఎస్ సంపత్ ఎన్నికల అధికారి హోదాలో తగు నిర్ణయం తీసుకోవచ్చని జస్టిస్ నాగేశ్వర రావు సూచించారు.





కిరాక్ హైదరాబాద్ దూకుడు

- 21-2తో బరోడా బాద్‌షాస్‌పై గెలుపు
- ప్రో పంజా లీగ్ తొలి సీజన్

న్యూఢిల్లీ : కిరాక్ హైదరాబాద్ ఆర్మ్ రెజ్లర్లు ఖతర్నాక్ ప్రదర్శన చేశారు. సోమవారం జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో బరోడా బాద్‌షాస్‌పై 21-2తో ఏకపక్ష విజయం సాధించగా, ప్రో పంజా లీగ్ (ఆర్మ్ రెజ్లింగ్)లో కిరాక్ హైదరాబాద్ ఏకంగా ఐదో విజయం నమోదు చేసింది. అండర్ కార్డ్ మ్యాచుల్లో తొలుత కిరాక్ హైదరాబాద్ 1-2తో వెనుకంజ వేసినా.. మెయిన్ కార్డ్ మ్యాచుల్లో స్వీప్ చేశారు. పురుషుల 80 కేజీల విభాగంలో అస్కర్ అలీ 5-0తో గెలుపొందగా.. 90 కేజీల విభాగంలో సిద్దార్థ్ మలాకర్ 10-0, 70 కేజీల విభాగంలో స్టీవ్ థామస్ 5-0తో అదరగొట్టారు. మెయిన్ కార్డ్‌లోనే 20 పాయింట్లు సాధించిన కిరాక్ హైదరాబాద్.. 21-2తో బరోడా బాద్‌షాస్‌ను చిత్తుగా ఓడించింది. ఏడు మ్యాచుల్లో ఐదో విజయంతో పాయింట్ల పట్టికలో కిరాక్ హైదరాబాద్ అగ్రస్థానంలో కొనసాగుతుంది.

జాతీయ క్రీడలకు ఆహ్వానం



హైదరాబాద్ : రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజ రామయ్యర్‌ను భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఏఐ) ప్రధాన కార్యదర్శి అర్శనపల్లి జగన్‌మోహన్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సచివాలయంలోని కార్యాలయంలోని ఆమెని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అక్టోబర్‌లో గోవాలో జరగనున్న జాతీయ క్రీడలకు హ్యాండ్‌బాల్ సంఘం తరఫున శైలజ రామయ్యర్‌ను ఈ సందర్భంగా జగన్ ఆహ్వానించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.